సంపుటి : 2
సంచిక : 8
రు. 20/-లు
తెనాలి

1993-2013 నడుస్తున్న చరిత్ర

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

అక్టోబరు 2016





కంప్యూటర్‌లో తెలుగు... ఆస్కీ, ఇస్కీ, యూనికోడ్!

జాతీయ విద్యావిధానం 2016 ముసాయిదాపై విశ్లేషణ

ఛాందసమెరుగని సంప్రదాయవాది
ఆవేశం లేని ఆధునికవాది
మనసున్న మానవతావాది-**విశ్వం**

తత్వశాస్త్రాన్ని జనరంజకం చేసిన త్రిపురనేని



హైకోర్టు తీర్పు పూర్తి పాఠం

ఉన్నతన్యాయస్థానం తీర్పు అందరికీ కనువిప్పు కావాలి

# ఆహ్వానం



ఉత్తమ పాత్రికేయుడు
కథా రచయిత, సాహితీ విమర్శకుడు

## శ్రీ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావుకు
## తాపీ ధర్మారావు పురస్కారం



**17, అక్టోబరు 2016 ఉ॥ 10.30 గం॥లకు**
**తిరుపతి- శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో**

సభాధ్యక్షులు :
**డా॥నాగసూరి వేణుగోపాల్**, సంచాలకులు, ఆకాశవాణి, తిరుపతి

ముఖ్య అతిథి :
**శ్రీ భువనచంద్ర**, కవి, రచయిత

విశిష్ట అతిథి :
**డా॥ ఎన్.ముక్తేశ్వరరావు**, ఐఎఎస్, స్పెషల్ ఆఫీసర్-తితిదే

ఆత్మీయ అతిథులు :
**ఆచార్య మధురాంతకం నరేంద్ర**, రచయిత, సాహితీ విమర్శకులు
**ఆచార్య పి.విజయలక్ష్మి**, రిజిస్ట్రార్, పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం
**శ్రీ సాకం నాగరాజ**, తెలుగు భాషోద్యమ సమితి, తిరుపతి

**తాపీ ధర్మారావు వేదిక**

వివరాలకు : **డా॥సామల రమేష్‌బాబు**, 98480 16136

శ్రీ ఉమామహేశ్వరరావు 1986 నుండి పాత్రికేయ జీవితం, సంపాదకత్వ బాధ్యతలలో వివిధ స్థాయిలలో పనిచేసి, ఇప్పుడు రాయలసీమ, నెల్లూరు జిల్లాల పరిధిలో ఎబిఎన్ ఆంధ్రజ్యోతి టీవీ, ఆంధ్రజ్యోతి దినపత్రికల పర్యవేక్షణ బాధ్యతల్లో వున్నారు. నెల్లూరు జిల్లాలో సారా వ్యతిరేక ఉద్యమ సందర్భంలో ఆంధ్రజ్యోతిలో వరుసగా వ్రాసిన 'సారా కథలు', ప్రత్యేక ఆర్థిక మండళ్ళ ప్రభావంపైనా, వాటివల్ల ఏర్పడిన విధ్వంసంపైనా కథనాలు, నక్సలైట్ల అజ్ఞాత జీవనశైలిపై కథనాలు, వారితో ఇంటర్వ్యూలు, తెలుగు మూలాలను వెతుక్కుంటూ తెలుగువాణి సంస్థతో కలిసి శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో పర్యటించి అక్కడి తెలుగుజాతి ప్రజలను గురించి వ్రాసిన కథనాలు జర్నలిస్టుగా ఉమామహేశ్వరరావు ప్రత్యేకతను వెల్లడిస్తాయి. ఆయన వ్రాసిన కథలు, సాహితీ ప్రముఖులతో ఇంటర్వ్యూలు, సంపాదకత్వం వహించిన కథా సంపుటాలు విశిష్టమైనవి. ఉత్తమ గ్రామీణ తెలుగు జర్నలిస్టుగా 2007లో పురస్కారాన్ని పొందారు. ఉత్తమ జర్నలిస్టుగా 2015లో ప్రభుత్వ పురస్కారాన్ని పొందారు.

తాపీ వారి అభిమానులు, కవులు, రచయితలు, పాత్రికేయులు, సామాజిక ఉద్యమకారులు,
తెలుగు భాషాభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయగోరుతున్నాం

## తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు



డా॥ఎన్.వేణుగోపాల్
2009



డా॥కె.శ్రీనివాస్
2011



శ్రీ టంకశాల అశోక్
2013



శ్రీ జి.శ్రీరామమూర్తి
2014



శ్రీ.ఎ.కృష్ణారావు
2015



రాజనీతి శాస్త్రములో తెలుగువారికి గల ప్రావీణ్యము చాలా ప్రాచీనమైనది. పాటలీపుత్ర నగరములో వర్ధిల్లిన ఆంధ్ర రాజ్యమూ తరువాత తమిళనాడును పరిపాలించిన విజయ నగర సామ్రాజ్యము పేర్కొనదగినవి. తెలుగువారు తమిళుల్ని పరిపాలించిన చిహ్నాలు మన భాషలోని నిఘంటువులలో చెరగని ముద్రగా నిలిచిపోయినవి. మన సంగీత, నాట్యశాస్త్రాలు కూడా నేటివరకు తెలుగులోనే మునిగి ఉన్నవి. మన గాయకులు పాడే కీర్తనలలో ఉత్తమమైనవి తెలుగు కీర్తనలే! దేవదాసీలు నాట్యం చేసేప్పుడు పాడే వరణములు, జావళీలు, మొదలైన వాటిలో కూడా రుచికరమైనవి తెలుగుభాషలోనివే. మన గ్రామాల్లో నివసిస్తున్న తెలుగు రెడ్లు, నాయుళ్ళు, తెలుగు బ్రాహ్మణ పురోహితులు, తెలుగు దేవదాసీలు, కృష్ణదేవరాయల కాలంలో ఇక్కడికి వచ్చి స్థిరపడినవారే! మన వివాహ సమయాలలో పాడే పాట, లాలీ మొదలైనవన్నీ తెలుగు వారి సంప్రదాయానికి చెందినవే. మనభాషలో గమనం, ఎచ్చరిక, దొర వాడిక, కొంచెం – మొదలైన నూర్లకొలది తెలుగు మాటలు కలిసిపోయినవి. తెలుగువారి ఏలుబడిలో తమిళ దేశంలో అధర్మం లేదు. తమిళులకు ఓ న్యాయమనీ, తెలుగువారికి మరో న్యాయమని ఉండేది కాదు. తెలుగుజాతి రాజనీతిశాస్త్రములో ఆరితేరినది. ఆరోజులలో కూడా తమిళుల కంటె తెలుగువారు రాజకీయ వ్యవహారాలలో ఎక్కువ శ్రద్ధ వహిస్తున్న విషయానికి ఇది చక్కని ఉదాహరణ. అయితే మనలో జాతి భేదం ఉన్నదికదా! ఈ జాతిభేదం భారతావనిలోనే కాదు, ప్రపంచంలోని అన్ని దేశాలలో ఉన్నది. కానీ, మనదేశంలో ఇది కొంచెం ఎక్కువగా, పరిహాసప్రాయంగా మార్చుటకు వీలులేనట్టిదిగా ఉన్నది. ఇప్పుడు ప్రపంచమంతటా కానవస్తున్న మహాప్రళయంలో ఈ జాతి భేదము మాయమైపోయి, మరో రూపంలో జీవించవచ్చు. తెలుగువారు ప్రజాభ్యున్నతికి తోడ్పడే సత్కార్య నిర్వహణలో తమ బుద్ధిని వినియోగిస్తున్నారు. స్వరాష్ట్ర సంపాదన విషయంలో తెలుగువారి శ్రద్ధాసక్తులలో నాలుగులో ఒక వంతు కూడా తమిళులలో కనబడటం లేదు. **–సుబ్రహ్మణ్యభారతి**

తెలుగునాట విద్వాన్ విశ్వంగారిది ప్రత్యేకస్థానం. వీరి జీవితంలో ఉద్యమం, సాహిత్యం, జర్నలిజం ముప్పేటగా కలిసిపోయాయి. ప్రాకృతం, సంస్కృతం, ఆంగ్లం, తెలుగు భాషలను ఆకళింపు చేసుకొన్న పాండిత్యం ఆయన సొంతం. వామపక్ష ఆలోచనలనూ, భారతీయ లోచనాన్నీ కలిపి చూసిన సమన్వయవాది విద్వాన్ విశ్వం. అక్టోబరు 21న ఆయన జయంతి, 20న వర్ధంతి. ఈ సందర్భంగా వ్యాసం.



## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | ఉన్నతన్యాయస్థానం తీర్పు కనువిప్పు కావాలి | **–డా॥సామల రమేష్‌బాబు** | **7** |
| **ప్రాచీన భాషలు :** | మద్రాసు ఉన్నతన్యాయస్థానం తీర్పు | ........................ | **9** |
| **సాహితీరంగం :** | చదువు–సంస్కారం | **–డా॥మధురాంతకం నరేంద్ర** | **18** |
| **కంప్యూటర్ :** | ఆస్కీ, ఇస్కీ యూనికోడ్ | **–రహ్మానుద్దీన్ షేక్** | **20** |
| **ప్రభుత్వ వార్తలు :** | ప్రభుత్వం నుండి రెండు ఉత్తర్వులు | ................ | **23** |
| **భాషోద్యమం :** | ప్రభుత్వాలు భాషా విధానాన్ని ప్రకటించాలి | **–సంకేపల్లి నాగేంద్రశర్మ** | **25** |
| **ముఖచిత్రం :** | సమన్వయమూర్తి విద్వాన్ విశ్వం | **డా॥నాగసూరి వేణుగోపాల్** | **30** |
| **జాతీయ విద్యావిధానం :** | 2016 ముసాయిదా | **రమేష్ పట్నాయక్** | **33** |
| **పిట్టచూపు :** | నిస్సహాయంగా న్యాయస్థానాలు | **–చలసాని నరేంద్ర** | **37** |
| **మన రాజులు –బిరుదులు :** | విష్ణుకుండినులు | **–డా॥ఈమని శివనాగిరెడ్డి** | **39** |
| **గుర్తు చేసుకుందాం:** | తత్వశాస్త్రాన్ని జనరంజకం చేసిన త్రిపురనేని | **–కె.రాజశేఖరరాజు** | **41** |
| **వార్తలు :** | గురజాడ 154వ జయంతి–ప్రభుత్వ నిర్లక్ష్యం | **–డా॥వేదగిరి రాంబాబు** | **45** |
| **తెలుగులెంక సూక్తులు : :** | | **–డా॥నాగభైరవ ఆదినారాయణ** | **46** |
| **పుస్తక సమీక్ష :** | | | **47** |
| **గ్రంథాలయం :** | | | **50** |
| **బయటి తెలుగు కతల మాలిక :** | ఓ సంచారి అంతరంగం | | **26** |
| **కవితలు** | ఆటవిడిది | **–వెలుగు వెంకట సుబ్బారావు** | **17** |
| | హఠాత్ జాగృతి | **–డా॥సి.నారాయణరెడ్డి** | **17** |
| | మహాత్మా! | **–మందరపు హైమవతి** | **40** |



క్రైసేత, ముఖచిత్ర అలంకరణ : **కలిమిశ్రీ**

ఫొటోలు : **తమ్మా శ్రీనివాసరెడ్డి**

రేఖాచిత్రం : **చిదంబరం** పకపకలు : **సరసి**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా

**డాక్టర్ సామల రమేష్‌బాబు**, సంపాదకుడు, **అమ్మనుడి,**

జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ–520004.

దూరవాణి: కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136*

e-mail : editorammanudi@gmail.com



పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం.
వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

మాసపత్రిక

• నుడి • నాడు • నెనరు

సంపాదకుడు డా॥ సామల రమేష్‌బాబు

శాలివాహన శకం 1938 : దుర్ముఖినామ సంవత్సర ఆశ్వీయుజ *(కుందాపి) శుద్ధపాడ్యమి శనివారం మొదలు కార్తీక*(జీరాపి) శుద్ధపాడ్యమి సోమవారం వరకు

* కుందాపి * జీరాపి : తెలుగు నెలలు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో – చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

## రచయితలకు సూచనలు

1. విభిన్న అంశాలపై వ్యాసాలను పంపవచ్చు. ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకుండా ఉండాలి. అన్నిరంగాలలో తెలుగు వారి శ్రేయస్సుకు సంబంధించిన రచనలను పంపండి. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. అప్రజాస్వామిక రచనలను తీసుకోలేము. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. లేదా కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో పంపవచ్చు. **3. రచనతోపాటు రచన స్వంతమేనని, ఇతర పత్రికలకు గాని, ఇంటర్నెట్ పత్రికలకు గాని పంపలేదని, పరిశీలనలో లేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీపత్రాన్ని స్పష్టంగా వ్రాసి పంపాలి. పోస్టల్ చిరునామా, ఫోన్ నెం., ఇ-మెయిల్ కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.** 4. మాకు పంపే రచన నకలును మీ వద్ద ఉంచుకోండి. ప్రచురణకు ఎంపిక చేయని రచనలను తిప్పి పంపడం వీలుకాదు.

## కథారచయితలకు, కవులకు విన్నపం

1. మాట్లాడుకొనే తెలుగులో వ్రాసిన కథల్ని **'నడుస్తున్న చరిత్ర'** ప్రచురించిన సంగతి చదువరులకు, రచయితలకు తెలిసిందే. ఈ సంప్రదాయాన్ని **'అమ్మనుడి'** పత్రిక కొనసాగిస్తున్నది. పాత్రల సంభాషణలు తప్పనిసరిగా మీ ప్రాంతంలో మాట్లాడుకొనే తెలుగు తీరులో ఉండాలి. కథాచిత్రణ కూడా మీ తెలుగు తీరులోనే ఉంటే మంచిది. కఠినమైన సమాసాలను ఉపయోగించవద్దు. తేలికైన తెలుగు మాటలు కుదరకపోతే జనం వాడుకలోని ఇతర ప్రాంతాల తెలుగు మాటల్ని వ్రాయవచ్చు. తప్పనిసరి అయితే తప్ప ఏ ఇతర భాషల మాటలను ఉపయోగించవద్దు. ఈ సూచనలే కవితలకూ వర్తిస్తాయి.

2. **'అమ్మనుడి'**లో ప్రచురణకు తీసుకొనే కథలు, కవితలు తెలుగు వారి సామాజిక, భాషాసంస్కృతుల వికాసానికి తోడ్పడేవిగా ఉండాలి. ప్రతినెలా ఒకటి లేక రెండు కథలను మాత్రమే ప్రచురించగలం. ముద్రణలో 2 లేక 3 పుటలకు మించకుండా ఉండేవాటినే తొలి ఎంపికకు తీసుకుంటాము. కవితలు 20 నుంచి 30 వరుస (లైను) లకు మించకూడదు.


**నడుస్తున్న చరిత్ర** (2013 నవంబరు వరకు)

**అమ్మనుడి** (2015 మార్చి నుండి...)

**పాత సంచికలు విడిగా గాని, సంపుటి (వాల్యూం) బౌండులుగా గాని కావలసినవారు సంప్రదించండి.**

అమ్మనుడి, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-4.
ఫోన్ : 98480 16136, 0866-2439466

## ఆహ్వానం

# భారతీయ భాషాసమ్మేళనం

**జాతీయ సదస్సు**
**2016 అక్టోబరు, 15,16 శని, ఆదివారాలలో**
**రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతిలో**

**ముఖ్య ఉద్దేశ్యం :** మాతృభాషలను కాపాడుకొని, అంటే – విద్య, సాహిత్యం, కళారంగం, అనువాదం, సమాచారవ్యవస్థ, పరిపాలన, పోటీ పరీక్షలు, వైద్యం, సాంకేతిక రంగం, న్యాయవాద వృత్తి, సంప్రదాయ విద్యలు, ఆర్థిక, మేనేజ్‌మెంట్ తదితర రంగాలలో – మాతృభాషలను ప్రాచుర్యంలోనికి తేవడం.

భారతీయ భాషలను కాపాడుకొని, ప్రాచుర్యంలోనికి తీసుకుని రావడానికి వివిధ రాష్ట్రాలలో చేస్తున్న ప్రయత్నాలను సమన్వయం చేసుకొని, సహకారాన్ని పెంపొందించుకొని, సమైక్యంగా ముందుకు సాగాలి. ఈ ప్రయత్నంలో తెలుగు భాష అభివృద్ధి కోసం పనిచేస్తున్న మనం కలియవలసి ఉన్నది. ఆయా రంగాలలో తెలుగును ముందుకు తీసుకుని వెడుతున్న అధ్యాపకులు, విద్యావేత్తలు, భాషానిపుణులు, పత్రికారంగ ప్రతినిధులు, భాషాప్రచార కార్యకర్తలు, వైద్యులు, న్యాయవాదులు, ఆడిటర్లు, ఇంజనీర్లు, కళాకారులు, సామాజికకార్యకర్తలు, పరిపాలకులు, ఇతర రంగాలకు చెందిన వారందరిని ఆహ్వానిస్తున్నాం.

ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలనుండి, కేంద్రప్రభుత్వం నుండి, రాష్ట్రప్రభుత్వం నుండి భాషావేత్తలు, ప్రముఖులు పాల్గొంటారు. ఈ కార్యక్రమం రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి, మరియు శిక్షా సంస్కృతీ ఉత్థాన్ న్యాస్, ఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. వివరములకు:

**ఆచార్య రాణి సదాశివమూర్తి,** 9440246354
రాష్ట్రీయ సంస్కృత విద్యా పీఠం

**కొ.దశపతిరావు,** 9441214639
సంయోజకులు, శిక్షా సంస్కృతీ ఉత్థాన్ న్యాస్, ఆంధ్ర, తెలంగాణా.







**సరసి కార్టూన్లు – 'మనమీదేనర్రోయ్'** (రెండు సంపుటాలు)
పేజీలు : 212 + 212, వెల : రు. 120 +120
ప్రతులకు : కార్టూనిస్టు, సెల్ : 94405 42950, క్రియేటివ్ లింక్స్, సెల్ : 98480 65658

## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక–

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.
2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.
3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

**–ప్రచురణకర్త,** అమ్మనుడి



**శ్రీ చలంచర్ల భాస్కరరెడ్డి**, నెల్లూరు
ఫోను : 98498 63183

ఇరవై ఏళ్ళ క్రితం హైదరాబాదులో మాతృభాషా చైతన్య సమితి తొలి సభ్యులలో ఒకరుగా మొదలై తర్వాత తెలుగు భాషోద్యమ సమాఖ్య నిర్మాణాన్ని ప్రోత్సహించారు. అందులో భాగంగా నెల్లూరుజిల్లా తెలుగు భాషోద్యమ సమితిని తోటివారితో కలిసి ప్రారంభించి, నిరంతర ఉద్యమచైతన్యంతో కృషి చేస్తున్న శ్రీ చలంచర్ల భాస్కరరెడ్డి గారిని ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా పురస్కారంతో సత్కరించింది. ఈ సందర్భంగా తెలుగుజాతి ట్రస్టు, అమ్మనుడి పత్రిక తదితర కార్యక్రమాల అభివృద్ధి కోరుతూ, ప్రోత్సాహకులుగా రు.15,000/–లు విరాళం ఇచ్చారు. వీరికి ధన్యవాదాలు.



**శ్రీ పి.వి.ఎన్.ఆర్.ఎన్.పవన్‌కుమార్**
**శ్రీమతి జ్యోతిభార్గవి**
తెనాలి, గుంటూరుజిల్లా.
ఫోను : 98498 63183

అమ్మనుడి పత్రికను ప్రతి నెలా చదువుతూ దానిలో ప్రచురించే వ్యాసాలకు, వార్తలకు తృప్తి చెంది, పత్రిక అభివృద్ధిని కోరుతూ తెలుగుజాతి ట్రస్టుకు ప్రోత్సాహకులుగా రు.10,000/లు విరాళం ఇచ్చారు. ఈ దంపతులకు ధన్యవాదాలు.

## తెలుగుజాతి (ట్రస్టు) విన్నపం

'నడుస్తున్న చరిత్ర' ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోనే కాక, పొరుగు రాష్ట్రాల్లోనూ నివసిస్తున్న తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగు భాషోద్యమ నిర్మాణానికి కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, అనేక ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించుకొనివున్న తెలుగుజాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావసమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపి వేయవలసి వచ్చింది. మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' పేరిట ఒక ట్రస్టును నమోదు చేయించాము. (92/2014). తెలుగు అమ్మనుడిగా కలిగినవారు ఎక్కడ నివసిస్తున్నా, వారి శ్రేయస్సు కోసం ఈ సంస్థ పనిచేస్తుంది.

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. పుస్తకాల ప్రచురణ కార్యక్రమంలో భాగంగా తొలుత స.వెం.రమేశ్ వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'**ను విడుదల చేశాము. త్వరలోనే మరికొన్ని ప్రత్యేకమైన పుస్తకాలను వెలువరించ బోతున్నాము. ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో బలపరచటానికి మీ అందరి చేయూత కావాలి. ట్రస్టు నిర్మాణంలో తోడ్పడాలని విన్నవిస్తున్నాము.

**ట్రస్టుకు విరాళాలనిచ్చి తోడ్పడ గోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులురు. 1,00,000/–లు | పోషకులు రు. 25,000/–లు |
| విశిష్ట పోషకులు రు. 50,000/–లు | ప్రోత్సాహకులు రు. 10,000/–లు |

**దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని 'అమ్మనుడి' పత్రికలో ప్రచురిస్తాము.**
**దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా ఉచితంగా పంపిస్తాము.**
సొమ్మును చెక్ / డ్రాఫ్టుగా / ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర పంపాలి. యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు.
అక్కౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068
**డా॥ సామల రమేష్‌బాబు,** మేనేజింగ్ ట్రస్టీ, 9848016136 ట్రస్టీలు : **పారుపల్లి కోదండరామయ్య** 9505298565, **డా॥వెన్నిసెట్టి సింగారావు** 9393015584, **స.వెం.రమేశ్** 8500548142, **సామల లక్ష్మణబాబు** 9440448244

సంపుటి : 2 సంచిక : 8

**అమ్మనుడి**

అక్టోబరు 2016

సంపాదకీయం

# ఉన్నత న్యాయస్థానం తీర్పు అందరికీ కనువిప్పు కావాలి

**ఆ**గస్టు 8న మద్రాసు ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చరిత్రలో నిలిచిపోతుంది. ఆ తీర్పునిచ్చిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ ఆర్.మహదేవన్ గార్లకు ప్రజలు కృతజ్ఞులై వుంటారు. ఎటువంటి వత్తిడికి, అభిమాన దురభిమానాలకు లొంగిపోకుండా, ఆ న్యాయమూర్తులు సత్యాన్ని వెలుగులోకి తెచ్చారు. ఒకటికి రెండుసార్లు ఆ తీర్పును మనం చదవాలి. అందులో ఆ న్యాయమూర్తులు పలికిన హితోక్తులను, ఉటంకించిన పెద్దల మాటలను కూడా మనం గుర్తు పెట్టుకోవాలి.

'ప్రతి భాష ఒక దేవాలయం. ఆ భాషను మాట్లాడే వారి ఆత్మ అందులో విలసిల్లుతుంటుంది' అని ప్రసిద్ధ అమెరికన్ రచయిత ఆలివర్ వెండెల్ హోమ్స్ చెప్పిన మాటలను తమ తీర్పుకు ముగింపులో న్యాయమూర్తులు ఉటంకించటంతో ఆ తీర్పుకు సాటిలేని విలువ చేకూరింది.

తమ భాషే గొప్పదని, ప్రపంచంలోనే అది తొలి భాష అని తమిళ మేధావులు ప్రచారం చేస్తూ, 'ద్రావిడ' అనే మాటకి తామే గుండుగుత్తగా ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకోవడం అందరకూ తెలిసిందే. 'రాయిపుట్టి మన్ను పుట్టకముందే పుట్టిన శ్రేష్ఠమైన తొలిభాష తమిళ్' అనేది వారు ఉద్యమాల స్థాయిలోనే గాక, అధికార పత్రాల్లో కూడా ఉటంకించే ఒక 'నానుడి'. 2006లో పాఠశాల విద్యలో తమిళభాషను తప్పనిసరి చేస్తూ ఇచ్చిన జీ.వో.లోనే ఆ నానుడిని పేర్కొన్నారంటే అది ఎంతటి ఉన్మాదస్థాయికి చేరిందో తెలుస్తుంది.

భాషను ఊతంగా చేసుకొని రాజకీయాలను నడిపిన తమిళ నేతల అజెండా – ఆ ప్రాతిపాదికన రాజ్యనిర్మాణం చేసుకోవడం– వీలు చూసుకొని శ్రీలంకలో ఉత్తర భాగాన్నీ, నేటి తమిళనాడు భూభాగాన్నీ కలుపుకొని ఒక స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించడమనేది వారి లక్ష్యం. తెలుగువారి తెలివితక్కువతనం వల్లనే నేడున్న రూపంలో తమిళనాడు ఏర్పడింది. నిజానికి ఆ రాష్ట్రంలోని ప్రజల మూలాల్లోకి చూస్తే, అది బహుభాషా రాష్ట్రం. అందులో సంఖ్యరీత్యా తెలుగువారి తరువాతి స్థానమే తమిళులది. అయినా, అసంబద్ధంగా జరిగిన భాషారాష్ట్రాల ఏర్పాటులో అది తమిళరాష్ట్రం అయిపోయింది. ఇప్పుడది పూర్తిగా తమిళీకరించబడుతోంది. భాషాపరంగా రాష్ట్రంలోని తమిళేతరులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులు ఆ రాష్ట్రంలో పూర్తిగా త్రోసిపుచ్చబడుతున్నాయి. అణచివేయబడుతున్నాయి. ఇదంతా దీర్ఘకాలిక వ్యూహంగా తమిళ రాజకీయ నేతలు చేపట్టిన విధానం.ఇది పోటాపోటీగా అన్ని ద్రవిడ పార్టీలకూ వర్తిస్తుందక్కడ. ఈ వ్యూహంలో భాగమే తమిళానికి ప్రాచీన భాషా ప్రతిపత్తి కోసం పాకులాట.

న్యాయమూర్తులకు ఈ విషయం తెలియనిది కాదు. అందువల్లనే వారు ఈ రాజకీయాన్ని బాగా అర్థం చేసుకొన్నారు. తమ తీర్పులో ఈ దుష్టవ్యూహాన్ని పలుచోట్ల ఎత్తి చూపారు. రిట్ పిటిషన్లలోని అంశాలను, క్లాసికల్ హోదాకు ఉండవలసిన అర్హతల దగ్గర నుండి నిపుణుల సంఘాన్ని తమిళులతో నింపడం, ప్రాచీనత అర్హతను 1000 నుండి 2000 ఏళ్ళకు పెంచడం వంటి అన్ని తప్పులను వారు తమ తీర్పులో ప్రస్తావించారు. భాషలు ఎట్లా పుట్టి పెరుగుతాయో స్పష్టం చేయడంతోపాటు– ఇతర భాషలకు ప్రాచీనహోదా కల్పించడం వలన తమిళభాషకు ఉన్న ప్రాధాన్యత తగ్గిపోతుందన్న పిటిషనర్ వాదాన్ని తోసిపుచ్చారు. ఒక భాష యొక్క ప్రాధాన్యత అనేది ఇతర భాషలు అభివృద్ధి చెందటం లేక అణగారిపోవటంపై ఆధారపడి వుండదని, అది ఎంతవరకు వాడుకలో ఉన్నది, కళలు మరియు సాంస్కృతిక రంగాలలో సృజనాత్మకత ఎంతవరకు ఉన్నది అన్న వాటిపై ఆ భాష అభివృద్ధి, ప్రాధాన్యత ఆధారపడి వుంటుంది అని న్యాయమూర్తులు తీర్పులో పేర్కొన్నారు.

తమిళం ప్రాచీన భాషేనని ఒప్పుకొన్నంత మాత్రాన తక్కిన భాషలు ప్రాచీనం కావు అనడానికి వీలు లేదని స్పష్టం చేశారు. తమిళానికి అంతకంటే ప్రత్యేకత నివ్వటానికి తీర్పు నిరాకరించింది. శాస్త్రీయంగా విస్పష్టంగా ఉన్న ఈ తీర్పు తరువాతనైనా – తమది ప్రపంచపు తొలి భాష అనీ, అన్నిటికంటే శ్రేష్ఠమైన భాష అనే అశాస్త్రీయమైన, అసంగతమైన వాదాల నుండి, పిచ్చి నమ్మకాల నుండి బయటపడి తోటి భాషల వారితో సఖ్యంగా మెలగాల్సిన రోజులు వచ్చాయని తమిళ పిడివాదులు తెలుసుకోవాలి.

అయితే ఈ ఉన్మాదాన్ని తమిళులందరికీ వర్తింపచేసి ఆలోచించకూడదు. నిజానికి కీర్తిశేషులు సుబ్రమణియన్

మలయాండి, కాశీపాండ్యన్ వంటి తమిళ సోదరులు తెలుగు ప్రాచీనతను నిరూపించిన విధం వారికి మనల్ని శాశ్వత ఋణగ్రస్తుల్ని చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉన్నతాధికారిగా పనిచేసి ఉద్యోగంలో ఉన్నప్పుడూ తర్వాత కూడా తెలుగు కోసం పనిచేస్తున్న చెల్లప్పగారి వంటి సోదరులు సత్యాన్ని ఎప్పుడూ అంటిపెట్టుకొని ఉన్నారు. ఇప్పుడు వెర్రితలలు వేస్తున్న ఉన్మాదమంతా రాజకీయ స్వార్థపరుల నుంచి వచ్చిందే. దీనికి ఇప్పటి కోర్టు తీర్పు ఒక అడ్డుకట్ట.

భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో పేర్కొన్న అన్ని భాషలను అధికార భాషలుగా, జాతీయ భాషలుగా గుర్తించాలనే డిమాండు ఎప్పటినుంచో ఉంది. 2004లో ఈ అంశాన్ని పరిశీలించడం కోసమే అప్పటి యుఎన్ఏ ప్రభుత్వం కమిటీని నియమించింది. దానితోపాటే తమిళానికి ప్రాచీనభాషా ప్రతిపత్తినిచ్చే సంగతిని కూడా కలిపింది. ద్రవిడ రాజకీయ పార్టీలతో ఉన్న అవసరాలే ఆ నిర్ణయానికి కారణం. 2004 నుంచీ కొనసాగుతున్న ప్రాచీన భాషా రాజకీయాలకు, ఇప్పుడీ వ్యాజ్యానికీ దారి తీసిందంతా నాటి ప్రభుత్వ నేతల ఆ తప్పుడు నిర్ణయమే. స్పష్టమైన భాషావిధానం లేకపోవడమే ఇందుకు కారణం. ఈ విషయకంగా రాజ్యాంగంలోని అంశాలను కూడా తిరుగతోడాల్సిన అవసరం వుంది. అందుకు సమయం ఆసన్నమయింది.

## తెలుగు రాష్ట్రాల నేతల బాధ్యత

క్లాసికల్ భాషార్హత వివాదంపై న్యాయమూర్తులు తీర్పును ప్రకటించిన వెంటనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు, కొందరు రాజకీయ రాజకీయేతర ప్రముఖులు పోటాపోటీగా ప్రకటనలు చేశారు. సానుకూలంగా తీర్పు రావడానికి తెలుగుకు వున్న సాక్ష్యాధారాలపై కూడా 'గొప్పదనాన్ని' ఎవరికి వారు తమకే ఆపాదించుకున్నారు కూడా. ప్రాచీన హోదావల్ల లభించే కోట్లాది (?) రూపాయలను తమకే ఇవ్వాలని, తమ రాష్ట్రంలోనే పరిశోధనాకేంద్రం తదితరాలను స్థాపించుకుంటామని కూడా ప్రకటనలు చేశారు. అంతే! గట్టిగా ఆరేడు వారాలకే అంతా చల్లారిపోయింది. ఎక్కడా ఆ ప్రస్తావన గానీ, చొరవతో కూడిన ప్రయత్నాలు కానీ జరుగుతున్న దాఖలాలు లేవు. ఇదీ మన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ నేతల నిర్వాకం.

తీర్పు సంగతిని అన్ని ప్రముఖ తెలుగు పత్రికలూ ప్రముఖంగా మొదటి పుటలో పెద్ద వార్తగానే ఇచ్చాయి. తెలుగునేలపై ఉన్న ఆంగ్ల దినపత్రికలు కూడా బాగానే ఇచ్చాయి. తమాషా ఏమిటంటే అత్యధిక సంఖ్యాక పాఠకులు కలిగిన తెలుగు పత్రికలు పోటీపడి అబద్ధమూ అసంగతమూ అయిన వార్తల్ని కూడా ఇచ్చాయి.ప్రాచీన భాషా కేంద్రానికి ప్రతిఏటా కేంద్రం 100 కోట్లు ఇస్తుందని ఒక పత్రిక వ్రాస్తే, ఐదేండ్ల కొకసారి 100 కోట్లు వస్తాయని మరో పత్రిక వ్రాసింది. ఇది సమాచార లోపం వల్ల జరిగి వుంటుందనుకుందాం. అసలు సంగతేమిటంటే- ఈ విషయమై పలు విడతలుగా ఇచ్చేదంతా కలిపి మొత్తం 100 కోట్లు. ఈ పథకం క్రింద చేసే పనికి ఏదో ఒక దశలో ముగింపు పలకాల్సిందే తప్ప నిరంతరం చేసుకుపోయే పని కాదిది. భాషను అధునాతనంగా అభివృద్ధి చేసుకోవడానికి నిరంతరం చేయవలసిన పనులెన్నో వున్నాయి. వాటికీ, ఈ ప్రాచీన భాషాకేంద్రాల పనికీ ఏమీ సంబంధం లేదు. ఈ వాస్తవాన్ని తెలుసుకోకుండా ఎవరికి తోచినట్లు వారు ప్రకటనలు చేశారు. ఇప్పుడే కాదు, 2005 నుండీ ఇదే తంతు.

మైసూరులోని భారతీయ భాషల కేంద్ర సంస్థ (సి.ఐ.ఐ.ఎల్)లో తెలుగు, కన్నడ భాషలకు చెందిన క్లాసికల్ భాషా అధ్యయన కేంద్రాలను ప్రారంభించబోయిన తరుణంలో తెలుగు కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనే స్థాపించాలన్న డిమాండు వచ్చింది. దాన్ని కేంద్రప్రభుత్వమూ, ఒప్పుకొంది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం చేయవలసిన ఒకే ఒక్క పని- తగినంత భవన సౌకర్యాన్ని కలిగించడం మాత్రమే. అంతకుమించి ఒక్కపైసా కూడా ఖర్చుపెట్టనక్కరలేదు. కానీ ముగ్గురు ముఖ్యమంత్రులు మారినా మన ప్రభుత్వాలు ఆ పనిని చేయలేకపోవడంతో ఏడేళ్ళుగా కోట్లాది రూపాయలు కేంద్రసాయం మురిగిపోయింది. ఇప్పుడు ఒకటికి రెండు రాష్ట్రాలయ్యాం. అధ్యయనకేంద్రం కోసం రెండు రాష్ట్రాలూ పోటీపడుతున్నాయి. ఇందులోవిజ్ఞత ఏమాత్రం లేదు. తెలుగు భాషా చరిత్ర ఏ ఒక్కరి సొమ్ము కాదు. అది తెలుగు ప్రజలందరిది. అనేక వర్తమాన విషయాలపై రెండు రాష్ట్రాల నేతలమధ్య ఏకాభిప్రాయ సాధన చెయ్యక తప్పని పరిస్థితి వుంది. అటువంటప్పుడు తెలుగుజాతి మొత్తానికి సంబంధించిన చరిత్రను పంచుకోవాలనే ప్రయత్నం మూర్ఖత్వం మాత్రమే అవుతుంది. కనుక ఈ విషయంలోనైనా ఇరు రాష్ట్రాల నేతలు తమ బాధ్యతను గుర్తించి క్లాసికల్ భాషాకేంద్రాన్ని సమష్టిగా స్థాపించుకొని కలసిమెలసి పని చేసేందుకు చొరవతో ముందడుగు వేస్తారని ఆశిద్దాం.

"ఒక భాష అభివృద్ధి చెందాలంటే, ఆ భాషను ప్రాచీనభాషగా గుర్తించి ప్రకటించాల్సిన అవసరం లేదు. దేశంలోని భాషలను, సంస్కృతిని అభివృద్ధి పరచేందుకు అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వవచ్చు. ఇప్పటికే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ఆ పని చేస్తూనే వున్నాయి" అని తీర్పులో న్యాయమూర్తులు స్పష్టంగా చెప్పారు. అయితే ప్రాచీనభాషగా గుర్తింపు వచ్చినందున ఒక అధ్యయన కేంద్రాన్ని (సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్) ను స్థాపించుకోవటానికీ, కొందరు పండితులకు ఏటా అవార్డులు ఇవ్వటానికి, ఇంకా ఆ పథకం క్రింద పేర్కొన్న పరిమిత ప్రయోజనాలకు కావలసిన సొమ్ము వస్తుంది. అదంతా 100 కోట్లలోపు సంగతి. అందుకోసం కేంద్రం ఇచ్చే 100 కోట్లే కాదు, మరికొన్ని కోట్ల రూపాయల ధనాన్ని అదనంగా సమకూర్చడం మన ప్రభుత్వాలకు చేతగాని పని కాదు. భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాలు తమ భాషల గొప్పదనాన్ని, ఖ్యాతిని పెంపుచేసుకోవటానికి, అత్యాధునిక భాషలుగా అభివృద్ధి చేసుకోవడానికీ ఎవరు అడ్డు పడతారు కనుక?

**1-10-2016**

సామల రమేష్‌బాబు

# తమిళం మాత్రమే కాదు- తెలుగు, కన్నడం, మలయాళం, ఒడిసా భాషలు కూడా క్లాసికల్ భాషలే!

## మద్రాసు ఉన్నత న్యాయస్థానం తీర్పు.

తీర్పు పూర్తిపాఠాన్ని తెలుగులోకి అనువాదం చేసి ప్రచురిస్తున్నాము. స్థలాభావం దృష్ట్యా ఈ తీర్పులో పేర్కొన్న కొన్ని వ్యవస్థల- వ్యక్తుల వివరాలవంటి వాటిని అనువాదంలో ఇవ్వలేదు. అందువల్ల తీర్పును అర్థంచేసుకోవడంలో ఎటువంటి ఇబ్బంది ఏర్పడదని భావించాము. పూర్తి పాఠమే అయినా, ఎక్కడా తప్పులు దొర్లకుండా మేము జాగ్రత్తలు తీసుకున్నాం. అనువాదంలో ఎక్కువ తక్కువలు, లోపాలు ఏమైనా చోటుచేసుకుంటే దయచేసి సవరించుకొనగోరుతున్నాము. భారత రాజ్యాంగాన్ని, ఇంకా అనేక చట్టాలను తెలుగులోకి అనువదించిన ప్రముఖ న్యాయవాది, రచయిత **పెండ్యాల సత్యనారాయణ గారు** అతి తక్కువ సమయంలో ఎంతో శ్రద్ధగా ఈ తీర్పును అనువదించి ఇచ్చారు. వారికి మప్పిదాలు తెలుపుకొంటున్నాము.

ఈ వ్యాజ్యంలో ప్రతివాదిగా చేరి, తుదికంటా శ్రద్ధతో పోరాడిన మిత్రులు **తూమాటి సంజీవరావు గారు** ఈ తీర్పు ప్రతిని మాకు యిచ్చారు. వారికి మప్పిదాలు, అభినందనలు తెలుపుకొంటున్నాము. - సంపాదకుడు

**ఉన్నత న్యాయస్థానము, మద్రాసు**
**రిజర్వుచేయబడినది : 13-07-2016**
**వెలువరించబడిన తేది : 08-08-2016**

తీర్పును వెలువరించినది గౌరవనీయులైన ప్రధాన న్యాయమూర్తి శ్రీ సంజయ్ కిషన్‌కౌల్ మరియు గౌరవనీయులైన న్యాయమూర్తి శ్రీ ఆర్.మహదేవన్.

రిట్‌పిటిషన్లు 27405/2014, 28334/2008, 18810/2008, 5813/205, 5814/2015 మరియు తత్సంబంధిత అనుబంధ పిటిషన్లు.

రిట్ పిటిషన్ నెం.27405/2014

ఆర్.గాంధి -పిటిషనర్

ఎదిరి

1. కేంద్ర ప్రభుత్వ హోంశాఖ, కార్యదర్శి,లోక్‌నాయక్ భవన్, ఖాన్ మార్కెట్, క్రొత్త ఢిల్లీ - 110003.
2. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతికశాఖ, కార్యదర్శి, శాస్త్రి భవన్, డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రోడ్, న్యూఢిల్లీ. - రెస్పాండెంట్లు

ఒక భాషకు 'ప్రాచీన భాష' హోదాను కల్పించే విషయంలో, భారత ప్రభుత్వం హోంశాఖ, ది 25-11-2005వ తేదీన జారీ చేసిన నెం.IV-14014/7/2004-NI-II నోటిఫికేషన్‌లో పొందుపరచబడిన ప్రామాణికాలకు కట్టుబడి ఉండేలా మొదటి రెస్పాండెంటును ఆదేశించవలసిందిగా కోరుతూ రాజ్యాంగంలోని 226 అధికరణం క్రింద రిట్ పిటిషన్ దాఖలు చేయబడింది.

### తీర్పు

**ప్రధాన న్యాయమూర్తి**

1. ఒక వ్యక్తి, తన భావాలను వ్యక్తీకరించే మాధ్యమమే భాష. ఒక దేశంగా, భారతదేశం వారసత్వంలోను, భాషలలోను సమున్నతమైనది. భారతదేశంలో 325 భాషలు ఉన్నట్లుగా చెబుతారు. 25 భాషలకు లిపి ఉన్నది. కొన్ని భాషలకు సుదీర్ఘ చరిత్ర, అనంతమైన సాహిత్యం ఉన్నది. అటువంటి భాషలలో తమిళ భాష ఒకటి.

2. ప్రముఖమైన భాషలకు ప్రాచీన హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకున్నది. ఆ క్రమంలో ఒక భాషకు 'ప్రాచీన హోదా' కల్పించే వర్గీకరణకు అవసరమైన ప్రామాణికాలను కూడా కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. తదనుగుణంగా ఒక ప్రాథమిక నోటిఫికేషన్‌ను 12-10-2004 తేదీన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నోటిఫికేషన్‌ను సవరించుకుంటూ 29-11-2004న ఒక నోటి ఫికేషన్‌ను, 25-11-2005న మరొక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వాడుకలో ఉన్న సమకాలీన భాషలలో అత్యంత పురాతనమైనవాటిలో ఒకటైన తమిళభాషను ప్రాచీన భాషగా కేంద్ర ప్రభుత్వం మొదటిగా ప్రకటించింది. ఆ తర్వాత సంస్కృతానికీ అదే హోదా లభించింది. తెలుగు, కన్నడ, మలయాళ, ఒడియా భాషలను ప్రాచీన భాషలుగా గుర్తిస్తూ డిక్లరేషన్ జారీచేయటంపట్ల అసంతృప్తిగా ఉన్న ఇదే కోర్టుకు చెందిన సీనియర్ అడ్వొకేట్ ఆ డిక్లరేషన్ ఔచిత్యాన్ని ప్రశ్నిస్తూ ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే, ఒక భాషకు ప్రాచీన హోదా కల్పించటానికి ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రామాణికాలను ఒక్క తమిళ, సంస్కృత భాషలు తప్ప మిగిలిన భాషలు అందుకోలేక పోయాయి అని సదరు అడ్వొకేట్ భావించారు. అందువలన ఇతర భాషలను ప్రాచీన భాషలుగా వర్గీకరించటం చట్ట విరుద్ధమని, అందువలన ప్రాచీన భాషగా గుర్తించటం వలన తమిళభాషకు లభించిన ప్రయోజనాలు నీరుగారి పోతాయని సదరు అడ్వొకేట్ భావించారు.

3. పైన ప్రస్తావించబడిన నోటిఫికేషన్లను జారీ చేయుటపైగల వివాదాలను (contravercy) విశ్లేషించాలంటే, ముందుగా 12-10-2004 తేదీగల నోటిఫికేషన్‌ను అధ్యయనం చేయటం అవసరం. ఆ నోటిఫికేషన్ ఈ క్రింది విధముగా ఉన్నది.

No.IV-1407/7/2004-NT-II

**భారత ప్రభుత్వము/భారత సర్కార్**

**హోంమంత్రిత్వశాఖ/గృహ మంత్రాలయ**

**జైసాల్మీర్‌హౌస్, మాన్‌సింగ్ రోడ్, న్యూఢిల్లీ-110011**

**నోటిఫికేషన్ ది.12-10-2004.**

1. "ప్రాచీన భాషలు"గా కొన్ని భాషలను క్రొత్తగా వర్గీకరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

2. 'ప్రాచీన భాషగా' పరిగణింపబడటానికి ఒక భాష తగిన అర్హతను కలిగి ఉందోలేదో నిర్ధారించటంలో ఈ క్రింది ప్రామాణికాలు ఉపకరిస్తాయి.

(i) గడచిన వెయ్యి సంవత్సరాల నుండి ఆ భాషకు చెందిన ప్రాచీన గ్రంథాల అత్యున్నత ప్రామాణికత (High antiquity) లిఖిత చారిత్రక ఆధారాలు (recorded history).

(ii) గుర్తింపతగినంతగా ప్రాచీన సాహిత్యం/గ్రంథాలు. తరతరాలుగా ప్రజలు ఆ సాహిత్యం, గ్రంథాలను అత్యంత విలువైన వారసత్వ సంపదగా పరిగణించి ఉండాలి.

3. రెండవ పేరాగ్రాఫ్‌లో ప్రస్తావించబడిన ప్రామాణికాలను "తమిళభాష" కలిగి ఉన్నది. అందువలన ఇప్పటి నుండి "ప్రాచీన భాష"గా వర్గీకరించబడింది.

4. పై నిర్ణయాలను అమలు చేయడానికి తగిన చర్యలను సాంస్కృతిక శాఖ చేపడుతుంది.

(సం) ఎ.కె.జైన్

భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి

No.IV-14017/7/2004-NI-II

**భారత ప్రభుత్వము/భారత సర్కార్**

**హోంమంత్రిత్వశాఖ/గృహ మంత్రాలయ**

**లోక్ నాయక్ భవన్, ఖాన్ మార్కెట్, న్యూఢిల్లీ -10003.**

**నోటిఫికేషన్ ది 25-11-2005.**

'ప్రాచీన భాష' పేరుతో భాషలలో ఒక క్రొత్త వర్గీకరణను తీసుకు రావాలని భారత ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని తీసుకున్నది. అందుకు సంబంధించి ది.12-10-2004 తేదీన No.IV-14014/7/2004-NI-II నోటిఫికేషన్ ను కూడా విడుదల చేసింది. ఆ నోటిఫికేషన్‌ను సవరిస్తూ ది.29-10-2004 తేదీన మరొక నోటిఫికేషన్‌ను కూడా తీసుకురావటం జరిగింది. ఒక భాషను ప్రాచీన భాషగా పరిగణించటానికి అవసరమైన ప్రామాణికాలు ఆ నోటిఫికేషన్లలో పొందుపరచబడ్డాయి. ఆ ప్రామాణికాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

(i) గడచిన వెయ్యి సంవత్సరాల నుండి ఆ భాషకు చెందిన ప్రాచీన గ్రంథాల అత్యున్నత ప్రామాణికత (High antiquity) లిఖిత చారిత్రక ఆధారాలు(recorded history).

(ii) గుర్తింపతగినంతగా ప్రాచీన సాహిత్యం/గ్రంథాలు. తర తరాలుగా ప్రజలు ఆ సాహిత్యం, గ్రంథాలను అత్యంత విలువైన వారసత్వ సంపదగా పరిగణించి ఉండాలి.

(iii) ఆ సాహిత్య సంపదకు మూలాధారం (మాతృక) ఆ భాషలోనే ఉండాలి (original). అంతే తప్ప మరొక భాష నుండి అరువు తెచ్చుకుని ఉండరాదు.

(iv) ప్రాచీనభాషకు, సాహిత్యానికి, ఆధునికభాష, సాహిత్యానికి తేడా ఉంటుంది. అందువలన ప్రాచీన భాషకు, తదనంతర మార్పులకు, ఉపాంగాలకు మధ్య వైరుధ్యం ఉండవచ్చు.

2. ది.12-10-2004 తేదీగల నోటిఫికేషన్‌లోని మూడవ పేరాగ్రాఫ్ ద్వారా తమిళభాష ప్రాచీన భాషగా నోటిఫై చేయబడింది.

3. ది.12-10-2004 తేదీగల నోటిఫికేషన్‌లోని రెండవ పేరాగ్రాఫ్‌లోని క్లాజ్ (i)ని సవరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సవరించబడిన ఆ క్లాజు ఈ క్రింది విధంగా ఉంటుంది.

"గత 1500-2000 సంవత్సరాల పూర్వం ఆ భాషకు చెందిన ప్రాచీన గ్రంథాల అత్యున్నత ప్రామాణికత (high antiquity) లిఖిత చారిత్రక ఆధారాలు(recorded history).

4. పైన ప్రస్తావించబడిన ప్రామాణికాలను సంస్కృత భాష కలిగి ఉన్నది. అందువలన సంస్కృత భాష "ప్రాచీన భాష"గా వర్గీకరించబడింది.

5. 12-10-2004 తేదీ నోటిఫికేషన్‌లోని ఇతర అంశాలన్నీ యథాతథంగానే ఉంటాయి.

6. పై నిర్ణయాలను అమలు చేయుటకు అవసరమైన అన్ని చర్యలను సాంస్కృతిక శాఖచేపడుతుంది.

(సం) జగ్‌రాం

కేంద్రప్రభుత్వ ఉపకార్యదర్శి

4. కొన్ని భాషలను ప్రాచీన భాషలుగా గుర్తించవలసిందిగా కోరుతూ అనేక విజ్ఞాపనలు అందటంతో, ఆ విజ్ఞాపనలపై అధ్యయనం చేసేందుకై భాషాపరమైన నిష్ణాతులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం ది.1-11-2004న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ క్రింది విధముగా ఉన్నది.

**తీర్మానము**

కొన్ని భాషలను ప్రాచీన భాషలుగా గుర్తించాలని కోరుతూ భారత ప్రభుత్వానికి అనేక విజ్ఞాపనలు అందుతున్నాయి. ఆ విషయానికి సంబంధించిన అన్ని అంశాలపై కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసింది. భాషాపరమైన నిష్ణాతులతో చర్చలు జరిపిన తర్వాత తమిళభాషను ఒక ప్రాచీన భాషగా భారత ప్రభుత్వం ప్రకటించింది (as one of the classical languages) తదనుగుణంగానే, భారత ప్రభుత్వ హోంశాఖ, ది. 12.10.2004 తేదీన No.IV-14014/7/2004-NI-II నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

ఒక భాష, నిర్దిష్టంగా ఏ సంవత్సరంలో ఆవిర్భవించిందో చెప్పటం సాధ్యంకాదు. ఎందుకంటే, సుదీర్ఘ పరిణామ క్రమం తర్వాత, మాత్రమే అంతిమంగా ఒక భాష తనకంటూ ఒక స్పష్టమైన గుర్తింపును తెచ్చుకుంటుంది.

అందువలన కొన్ని భాషలను ప్రాచీన భాషలుగా వర్గీకరించాలని కోరుతూ భవిష్యత్తులో వచ్చే విన్నపాలపై అధ్యయనం చేసేందుకై ఈ క్రింది భాషా పండితులతో ఒక కమిటీవి ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం ఒక నిర్ణయాన్ని తీసుకున్నది -

1. డాక్టర్ అన్విత అబ్బి (Dr Anvita Abbi) ఆచార్యులు, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ.
2. డాక్టర్ కె.వి.సుబ్బారావు, ఢిల్లీవిశ్వవిద్యాలయం,
3. ప్రొఫెసర్ ఉదయ నారాయణసింగ్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మానసగంగోత్రి, మైసూర్
4. డాక్టర్ బి.ఎన్. పట్నాయక్ (విశ్రాంత ఆచార్యులు) ఐ.ఐ.టి, కాన్పూర్
5. ప్రొఫెసర్ భద్రిరాజు కృష్ణమూర్తి హైదరాబాద్
6. అధ్యక్షులు, సాహిత్య అకాడమి (ఎక్స్ ఆఫిషియో సభ్యులు), ఏదైనా ఒక భాషకు 'ప్రాచీన హోదాను' కల్పించటానికి సంబంధించిన విజ్ఞాపనలను భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, పైన ప్రస్తావించిన

కమిటీకి నివేదిస్తుంది.
ఈ క్రింద ప్రస్తావించబడిన ప్రామాణికాలు ఆధారంగా, తమకు అందిన విజ్ఞాపనలపై సదరు కమిటి అధ్యయనం చేయవలసి ఉంటుంది.

(i) గడచిన వెయ్యి సంవత్సరాల నుండి ఆ భాషకు చెందిన ప్రాచీన గ్రంథాల అత్యున్నత ప్రామాణికత(High antiquity)
లిఖిత చారిత్రక ఆధారాలు(recorded history).

(ii) గుర్తింపతగినంతగా ప్రాచీన సాహిత్యం/గ్రంథాలు తరతరాలుగా ప్రజలు ఆ సాహిత్యం, గ్రంథాలను అత్యంత విలువైన
వారసత్వసంపదగా పరిగణించి ఉండాలి,

(iii) ఆ సాహిత్య సంపదకు మూలాధారం (మాతృక) ఆ భాషలోనే ఉండాలి. (original), అంతే తప్ప మరొక భాష నుండి అరువు తెచ్చుకుని ఉండరాదు.

(iv) ప్రాచీనభాషకు, సాహిత్యానికి, ఆధునికభాష, సాహిత్యానికి తేడా ఉంటుంది. అందువలన ప్రాచీన భాషకు, తదనంతర
మార్పులకు, ఉపాంగాలకు మధ్య వైరుధ్యం ఉండవచ్చు.

ప్రాచీన భాషగా నోటిఫై చేయబడిన, లేక ప్రకటించబడిన భాషలకు ఈ క్రింది ప్రయోజనాలను కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

(1) ప్రతి సంవత్సరం, ప్రాచీన భాషలలో అత్యంత ప్రతిభావంతులైన పండితులను రెండు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ అవార్డులతో సత్కరించుట.

(2) ప్రాచీన భాషను అధ్యయనం చేసేందుకుగాను అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పటం (centre of excellence),

(3) ప్రారంభ దశలో కనీసం కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో అయినా భారతీయ ప్రాచీన భాషలలో నిష్ణాతులైన వారికి పీఠాలను (Professional Chairs) కేటాయించవలసిందిగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్‌ను కోరటం.

(సం) కె.జయకుమార్
భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి

5. పైన ప్రస్తావించబడిన కమిటీలో, అదనంగా ఇద్దరు భాషాకోవిదులను సభ్యులుగా నియమించాలని ఆదేశిస్తూ ది.21-12-2004 తేదీన భారత ప్రభుత్వం ఈ క్రింది విధంగా ఉత్తర్వులను వెలువరించింది.

"కొన్ని భాషలకు ప్రాంతీయభాష హోదా కోరుతూ భవిష్యత్తులో వచ్చే అభ్యర్థనలపై అధ్యయనం చేసేందుకై ఆరుగురు భాషాకోవిదులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ, ది.1-11-2004 తేదీన No.2-16/2004-US (Academies) నోటిఫికేషన్‌ను భారత ప్రభుత్వం జారీ చేసింది. ఇప్పుడు ఈ క్రింద ఉదహరింపబడిన ఇద్దరు భాషాకోవిదులను ఆ కమిటీలో అదనపు సభ్యులుగా నామినేట్ చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది.

1. ప్రొఫెసర్ విసి, కుళందైస్వామి, చెన్నయ్
2. డాక్టర్ టి.యస్.కె. కన్నన్, చెన్నయ్

మిగిలిన షరతులన్నీ యధాతథంగానే ఉంటాయి".

ఈ ఇద్దరు నిష్ణాతులూ తమిళనాడుకు చెందిన పండితులు కావటం విశేషం.

6. ఇక్కడ ప్రధానమైన సమస్య ప్రామాణికాలను గురించికాదని, ఆప్రామాణికాలను అందుకోలేక పోయినట్టుగా భావించబడుతున్న భాషలు గురించేనని మేము గుర్తించాం. ది 20-6-2016న మేము వెలువరించిన ఉత్తర్వులలోనే ఈ విషయాన్ని ప్రస్తావించటం జరిగింది. ఇందుకు సంబంధించి నాలుగు పరీక్షల సూత్రం (four test formula) అన్వయిస్తుందని, అందరూ దీనికి బద్ధులై ఉండాలని ఆ ఉత్తర్వులలో పేర్కొనటం జరిగింది.

(i) గడచిన 1500-2000 సంవత్సరాల నుండి ఆ భాషకు చెందిన ప్రాచీన గ్రంథాల అత్యున్నత ప్రామాణికత (High antiquity) లిఖిత చారిత్రక ఆధారాలు(recorded history).

(ii) గుర్తింపతగినంతగా ప్రాచీన సాహిత్యం/గ్రంథాలు. తరతరాలుగా ప్రజలు ఆ సాహిత్యం, గ్రంథాలను అత్యంత విలువైన వారసత్వ సంపదగా పరిగణించి ఉండాలి,

(iii) ఆ సాహిత్య సంపదకు మూలాధారం (మాతృక) ఆ భాషలోనే ఉండాలి (original). అంతే తప్ప మరొక భాష నుండి అరువు తెచ్చుకుని ఉండరాదు.

(iv) ప్రాచీనభాషకు, సాహిత్యానికి, ఆధునికభాష, సాహిత్యానికి తేడా ఉంటుంది. అందువలన ప్రాచీన భాషకు, తదనంతర మార్పులకు, ఉపాంగాలకు మధ్య వైరుధ్యం ఉండవచ్చు.

7. అసలు జటిలమైన సమస్య ఈ నాలుగు పరీక్షల సూత్రాన్ని అన్వయించటంలోనే ఉన్నది. ఈ విధంగా ఎందుకు చెప్పాల్సివస్తున్నదంటే, మా ఎదుట స్వయంగా హాజరైన పిటిషనర్ యొక్క వాదన ఏమిటంటే, తమిళం, సంస్కృతం మినహాయించి, మిగిలిన ఏ ఒక్క భాషకు 1500-2000 సంవత్సరాల నాటి పురాతన సాహిత్యంకాని, గ్రంథాలుగాని లేవు, అందుకు విరుద్ధంగా 1500 నుండి 2000 సంవత్సరాలు అనేది పైన ప్రస్తావించబడిన మొదటి ప్రామాణికానికి సంబంధించినదే తప్ప రెండవ ప్రామాణికానికి వర్తించదని ప్రతివాదుల తరపున వాదన చేయబడింది. అంతేకాకుండా ప్రతివాదులు ఎవరికివారే సంక్షిప్త ప్రమాణ పత్రాలను దాఖలు చేశారు. తమ తమ భాషలు ప్రాచీన భాషలుగా పరిగణింపబడటానికి ఏ విధంగా అర్హత పొందాయో ఆ ప్రమాణ పత్రాలలో వివరించారు. అంతేకాకుండా, ఈ అంశాన్ని నిర్ధారించాల్సింది భాషా పండితులతో ఏర్పాటయిన కమిటీయే తప్ప ఈ న్యాయస్థానం కాదని సదరు ప్రమాణపత్రాలలో పేర్కొనటం జరిగింది. భాషాపరమైన పాండిత్యం ఏ మాత్రంలేని పిటిషనర్‌కు ఈ అంశంపై వాదన చేసే అర్హతగాని, హక్కుగాని లేదని కూడా పేర్కొనటం జరిగింది.

8. అందువలన పిటిషనర్ దాఖలు చేసిన పిటిషన్ల వలన ఎటువంటి ఉపయోగంలేదని, ఈ కారణంపై పిటిషనర్, తన పిటిషన్లను ఉపసంహరించుకోవటం ఉపయుక్తమని రెస్పాండెంట్ల తరపు అడ్వొకేట్లు కోరటం గమనించతగినది. దురదృష్టవశాత్తూ గతంలో మన దేశంలో భాషకూ వివాదాస్పద చరిత్ర ఉన్నది. భాష ప్రాతిపదికగా కొన్ని రాష్ట్రాలు ఏర్పడటానికి కూడా కారణం ఇదే. ఇతర భాషలను ప్రాచీన భాషలుగా వర్గీకరించటం వలన 'ప్రాచీన భాషగా' తమిళ భాషాప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. అదే సమయంలో ఇతర భాషలకు కొంత ప్రయోజనం చేకూరింది. అందువలన ఈ పిటిషన్లపై విచారణ జరగాలని పట్టుబట్టటం వలన ఎటువంటి అర్థవంతమైన ప్రయోజనమూ ఉండదు. ఈ పిటిషన్లలో మొదటి పిటిషన్ దాఖలైనప్పుడు, 5-8-2008 తేదీన మధ్యంతర ఉత్తర్వులు జారీకాబడినప్పుడు, ఇతర రాష్ట్రాల నుండి వ్యతిరేకత వచ్చినట్లు (reaction) మేము తెలుసుకున్నాం. అయినప్పటికి పిటిషనర్ తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు, కేవలం రెండు భాషలు మాత్రమే ప్రాచీన భాషలని తాను ఋజువు చేయగలనని పేర్కొన్నారు.

9. మేము గమనించిన మరొక విషయం ఏమిటంటే ఈ నోటిఫికేషన్లను ప్రశ్నించే అర్హత పిటిషనర్‌కు లేదని రెస్పాండెంట్లు బలంగా వాదించారు. అదేవిధంగా ఈ పిటిషన్లపై విచారణ జరిపే అధికారం ఈ వ్యాయస్థానానికి లేదని కూడా రెస్పాండెంట్ల బలంగా వాదించారు. అదే

సమయంలో, ఈ నోటిఫికేషన్లను కేంద్ర ప్రభుత్వం జారీచేసినంత మాత్రాన ఈ పిటిషన్లపై విచారణ జరిపే అర్హత ఈ న్యాయస్థానానికి లేదని మాత్రం బలంగా వాదన జరగలేదు.

10. ప్రపంచంలో మొత్తం ఆరువేల భాషలున్నాయని, అయితే వాటిలో గ్రీకు, లాటిన్ సంస్కృతం, తమిళం, కొంతమేరకు చీనీభాష, హీబ్రూ భాషలు (మొత్తం ఆరు భాషలు) మాత్రమే ప్రాచీన భాషలుగా పండితులు గుర్తించారని పిటిషనర్ వాదించారు. దీని అర్థం ఒక భాషకు ప్రాచీన హోదా ఇవ్వటం అనేది అంతర్జాతీయ పరంగా ప్రాధాన్యత సంతరించుకున్నది. ప్రపంచ భాషా పండితులు మాత్రమే ఆ అంశంపై నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని పిటిషనర్ వాదన. తదనుగుణంగానే మొదట నోటిఫికేషన్లు వెలువరింపబడ్డాయి. గత వెయ్యి సంవత్సరాలుగా ఆ భాషలో పురాతన గ్రంథాలు రచించబడినట్లుగా చారిత్రక ఆధారాలు ఉండాలని ఆ నోటిఫికేషన్లలో పేర్కొనబడింది. నిపుణుల కమిటి సిఫార్సులను అనుసరించి 1500 మండి 2000 సంవత్సరాల కాల వ్యవధిని 1000 సంవత్సరాలకు తగ్గించటం జరిగింది. 25-11-2005 తేదీన సంస్కృత భాషకు ప్రాచీన భాష ఇవ్వటానికి తగిన అర్హత ఉన్నదని పేర్కొంటూ జారీ చేయబడిన నోటిఫికేషన్ ద్వారా సదరు కాల వ్యవధి 1500-2000గా సవరించబడింది.

11. పిటిషనర్ తరపున ఇంకా ఈ క్రింది విధంగా వాదన చేయబడింది. తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన భాష హోదా కల్పించవలసిందిగా కోరుతూ వచ్చిన అభ్యర్థనలపై చర్చించేందుకై ది 2-9-2004 తేదీన సాహిత్య అకాడమీ సమావేశం జరిగింది. ఆ సమయంలోనే భారత ప్రభుత్వం గోపీచంద్ నారంగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సులను ఆమసరించి నాలుగు పరీక్షల సూత్రం రూపొందించబడింది. తెలుగు, కన్నడ భాషల తరపున దాఖలైన డాక్యుమెంట్లను పరిశీలిస్తే ప్రాచీన భాషగా గుర్తింపు పొందే అర్హత ఆ రెండు భాషలకు లేదని అర్థం ఆవుతుంది. కాని కమిటీలోని నలుగురు సభ్యులు ప్రాచీన భాషగా గుర్తించాలన్న అభ్యర్థనను సమర్థించారు. తర్వాత నామినేట్ చేయబడ్డ తమిళనాడుకు చెందిన ఇద్దరు సభ్యులు మాత్రం ప్రాచీన భాషగా గుర్తింపబడటానికి తగిన అర్హతలు ఆ భాషలకు లేవని అభిప్రాయపడ్డారు. మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే కమిటీ సమావేశాలకు రాజకీయ రంగు పులమబడింది. ఆ రెండు భాషలకు చెందిన వ్యక్తులు, తీవ్రస్థాయిలో ప్రచారం చేశారు. (ప్రాచీన హోదా కోసం), ఆ రెండు భాషలకు చెందిన పత్రికలు, మీడియా కూడా తమిళ పండితులకు వ్యతిరేకంగా ధ్వజమెత్తాయి (Chauvinism against Tamil scholars). మొత్తం మీద పిటిషనర్ వాదన ఏమిటంటే ఆ రెండు భాషలకు సంబంధించి సమగ్రమైన అధ్యయనం జరగలేదు (no objective evalution), నాలుగు సూత్రాలపై సకారాత్మకమైన, హేతుబద్ధమైన సిఫార్సులు ఉంటే బాగుంటుందని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. హేతుబద్ధమైన సిఫార్సు అంటే ఏమిటో పిటిషనర్ ఈ క్రింది విధంగా సూచించారు.

**1. మొదటి ప్రామాణికం :**

"గత 1500-2000 సంవత్సరాల పూర్వపు ప్రాచీన గ్రంథాలు, పుస్తకాలు/రికార్డు కాబడిన చారిత్రక ఆధారాలు",

ఒక భాష పైన ఉదహరింపబడిన ప్రామాణికాలను కలిగి ఉన్నట్టు కమిటి భావించాలంటే, ప్రాచీన పుస్తకాలు, గ్రంథాల పేర్లను/చారిత్రక ఆధారాలను స్పష్టంగానే పేర్కొనాలి. అవి అన్నీ అందుబాటులో ఉండాలి, అందుబాటులోలేని (non existant) ఊహాజనితమైన గ్రంథాలు, ఆధారాలను ప్రామాణికాలుగా పరిగణింపకూడదు, అందుబాటులో ఉన్న సాహిత్యం యొక్క ప్రామాణికత, ప్రాశస్త్యం ఆధారంగానే (on the basis of the Quality of the existing literature) సంస్కృతం, గ్రీకు, లాటిన్, తమిళ భాషలకు ప్రాచీన భాషలుగా గుర్తింపు వచ్చింది.

**2. రెండవ ప్రామాణికం :**

"ప్రాచీన గ్రంథాలు, పుస్తకాలు, సాహిత్యం ఒక వారసత్వ సంపదగా తరతరాలుగా కొనసాగుతుండటం, పరిగణింపబడటం"

అంతర్జాతీయంగా ఆమోదంపొందిన విషయం ఏమిటంటే, క్రీస్తు పూర్వం 500 సంవత్సరాలకు పూర్వపు చరిత్ర అంతా ప్రాచీనం. (ప్రపంచ ప్రాచీన భాషల కేంబ్రిడ్జి ఎన్‌సైక్లోపీడియా' ఆధారంగా).

1500-2000 సంవత్సరాలు అనే మొదటి ప్రామాణికంకూడా పైన ఇవ్వబడిన నిర్వచనానికి సరిపోతుంది. ప్రాచీనగ్రంథాలు, సాహిత్యం అమూల్యమైన వారసత్వ సంపదగా తరతరాలుగా గుర్తించబడిందని కమిటీ భావించినట్లయితే, ఆ సాహిత్యం అమూల్యమైన వారసత్వ సంపదగా తరతరాలుగా గుర్తించబడిన విషయాన్ని ఋజువు పరచవలసి ఉంటుంది.

**3. మూడవ ప్రామాణికం :**

ఒక భాష సాహిత్య వారసత్వం మూలాలు ఆ భాషలోనే ఉండాలి (original). అంతేతప్ప మరొక భాష నుండి అరువు తెచ్చుకొని ఉండరాదు.

కమిటీని పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని, ఒక హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి లేక సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో, సాహిత్యం, భాషా పరిజ్ఞానం ఉన్న ఇతర సభ్యులు ఆ కమిటీలో సభ్యులుగా ఉండాలని పిటిషనర్ వాదించటం జరిగింది.

12. ఈ పిటిషన్ ఎనిమిది సంవత్సరాలుగా నిల్వలో ఉన్నది. 5-8-2008వ తేదీన మధ్యంతర ఉత్తర్వులు వెలువరించబడ్డాయి. కమిటీ తీసుకునే ఏ నిర్ణయమైనా, ఈ రిట్ పిటిషన్‌పై వెలువడే అంతిమతీర్పుకు లోబడి ఉంటుందని ఆ మధ్యంతర ఉత్తర్వులలోనే స్పష్టం చేయటం జరిగింది. ఇంతకు ముందే ప్రస్తావించబడినట్లుగా, ఇతర భాషలకు కూడా ప్రాంతీయ భాషలుగా గుర్తింపు ఇవ్వబడింది. సంబంధిత నోటిఫికేషన్లకు వ్యతిరేకంగా కూడా పిటిషనర్ కొన్ని రిట్ పిటీషన్లను దాఖలు చేయటం జరిగింది.

13. రోజర్ డి.వుడార్ట్ సంపాదకత్వంలో వెలువడిన ప్రాచీన భాషలపై కేంబ్రిడ్జి ఎన్‌సైక్లోపీడియాను, పిటిషనర్ మాదృష్టికి తీసుకురావటం జరిగింది. ఆ ఎన్‌సైక్లోపీడియా ఆధారంగా తమిళం మరియు సంస్కృత భాషలను మాత్రమే ప్రాచీన భాషలుగా పరిగణించవలసి ఉంటుందని పిటిషనర్ వాదించారు. ఆ ఎన్‌సైక్లోపీడియాలోని సంస్కృతానికి సంబంధించిన అధ్యాయంలో ఈ క్రింది విధంగా పేర్కొనబడింది. చారిత్రక, సాంస్కృతిక ఆధారాల దృష్ట్యా చూస్తే సంస్కృతం అనేది ఇండో-యూరోపియన్ భాష. ఇండో-యూరోపియన్ కుటుంబంలోని ఇండో- ఆర్యన్ విభాగంలోని ఇండో-ఇరానియన్ ఉప విభాగానికి చెందినది. ఇండో-ఆర్యన్ విభాగంలో అత్యంత పురాతనమైన భాష సంస్కృతం. తమిళం, తెలుగు తదితర దక్షిణ భారతదేశ ద్రవిడ భాషలకు సంస్కృతంతో మౌలికసంబంధం లేకపోయినా, హిందీ, గుజరాతీ, బెంగాలీ తదితర భాషలన్నీ సంస్కృత మూలం నుండి ఉద్భవించినవే. సంస్కృతం యొక్క అత్యంత పురాతన రూపం వేదిక్ సంస్కృతం కాగా, అందులో పురాతనమైన ఋగ్వేదం క్రీస్తు పూర్వం 1500 సంవత్సరాల నాటిది.

14. ఇక తమిళం విషయానికి వస్తే, తమిళం యొక్క చారిత్రక, సాంస్కృతిక మూలాలను గురించి ఆ ఎన్‌సైక్లోపీడియాలోని తమిళ భాషకు చెందిన అధ్యాయంలో ప్రస్తావించబడింది. భారతదేశంలోని రెండు ప్రాచీన భాషలలో ఒకటి సంస్కృతం అయితే, రెండవది తమిళం అని ఆ

అధ్యాయంలో పేర్కొనబడింది. ద్రావిడ భాషలలోకెల్లా అత్యంత పురాతన మైనదని, ప్రాచీన తమిళ భాషా మూలాలు క్రీస్తు పూర్వం 254 సంవత్సరం నుండి ఉన్నట్లు పేర్కొనబడింది. అందువలన అంతర్జాతీయ భాషల కోణం నుండి పరిశీలించినా, తమిళ, సంస్కృత భాషలకు మాత్రమే ప్రాచీన హోదా అర్హత ఉన్నదని పిటిషనర్ వాదించారు.

### తెలుగు

15. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ ప్రభుత్వాలు రెండూ కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయి. ప్రాచీన భాష హోదాను తెలుగు, కన్నడ భాషలకు కల్పించాలని కోరుతూ దాఖలైన అభ్యర్ధనలపై, కమిటీకి చెందిన నిపుణుల బృందం 10-6-2008 మరియు 8-8-2008 తేదీలలో జరిగిన సమావేశాలలో చర్చించింది. తదనుగుణంగా సిఫార్సులను చేసిన తర్వాత, ఆ సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిన తర్వాత, కేవలం ఒక సభ్యుడు లేక సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేసినంత మాత్రాన ఆ సిఫార్సులు హేతుబద్ధం కాదనటం సరికాదు. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం కనుక, ఆ నిర్ణయంపై న్యాయసమీక్షకు అవకాశం లేదు. నిపుణుల కమిటీ సిఫార్సులను అనుసరించి మాత్రమే తమిళభాషకు ప్రాచీన భాష హోదా లభించిందన్న విషయాన్ని, ఆ రెండు ప్రభుత్వాలూ మా దృష్టికి తీసుకు వచ్చాయి. ప్రాచీన భాషకు ఉండాల్సిన లక్షణాలన్నీ తెలుగుభాషకూ ఉన్నాయి. ప్రపంచంలోని పురాతన భాషలకు ఉన్న విశేషాలన్నీ తెలుగు భాషకూ ఉన్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల అఫిడవిట్లలో పేర్కొనటం జరిగింది,

16. నిర్దేశింపబడిన మూడు ప్రామాణికాలలో ఒకటైన వెయ్యి సంవత్సరాల చరిత్ర ఆధారంగా తమిళభాషను ప్రాచీన భాషగా గుర్తించటం జరిగింది. ఆ తర్వాత ఆ వ్యవధిని 1500-2000 సంవత్సరాలకు పెంచారు. ఆ కాలపరీక్షకూ తెలుగుభాష నిలబడుతుంది. ఆ క్రమంలో ఈ క్రింది అంశాలను మా దృష్టికి తీసుకురావటం జరిగింది.

“ప్రోటో తెలుగులో” ఉన్న భట్టిప్రోలు బౌద్ధ శాసనం క్రీస్తు పూర్వం 3000 సంవత్సరాలనాటికి (రిఫరెన్స్ : ‘ఎపిగ్రాఫియా ఇండియా’ రెండవ సంపుటి, 232 పేజి) ప్రోటో తెలుగులో ఉన్న ఎర్రగుడి అశోకస్తంభం క్రీస్తు పూర్వం 257 సంవత్సరం నాటిది. (డి.సి.సర్కార్ రచించిన “అశోకన్ స్టడీస్ కలకత్తా 1979 ముద్రణ 7-8 పేజీలు), ఘంటసాలలోని బ్రాహ్మణ శిలాశాసనం (ఎపిగ్రాఫియా ఇండియా’27వ సంపుటి, 1947-48, 1 నుండి 4 పేజీలు), నాగార్జునకొండ, విజయపురిలోని విజయశాతకర్ణి శిలాశాసనం మొదలైనవి క్రీస్తు శకం ఐదవ శతాబ్దినాటివి. (ఎపిగ్రాఫియా ఆంధ్రిక, రెండవ సంపుటి, 9 నుండి 14 పేజీలు)

17. అంతేకాకుండా, భాషల విషయంలో క్లాసిక్ అనే పదానికి నిర్వచనంపై భాషావేత్తలలో ఏకాభిప్రాయంలేదు. ఒక భాష ప్రాచీనమైనదా కాదా (క్లాసికల్) అనేది నిర్ధారించటానికి ప్రామాణికాలు ఏమిటన్న అంశంపై భాషాకోవిదుడు, మేధావి, భాషా సమస్యలపై అత్యంత ప్రభావం చూపిన సర్ ఎడ్వర్డ్ సఫైర్ తన సుప్రసిద్ధ “భాష” (Language) అనే పుస్తకంలో ఈ క్రింది విధంగా వ్యాఖ్యానించారు,

“చైనా భాషతో సంబంధం లేకుండా (without the use of chinese resources) విద్యావంతుడైన జపాన్‌దేశస్తుడు ఒక్క వాక్యం కూడా వ్రాయలేడు. సియాం, బర్మా, కంబోడియా భాషలపై ఇప్పటికీ, సంస్కృతం మరియు పాళీ భాషల ప్రభావం స్పష్టంగా కనిపిస్తూనే ఉంటుంది. (అనేక శతాబ్దాల క్రితం హిందూ దేశానికి చెందిన బౌద్ధమతం ద్వారా, ఆ రెండు భాషలూ ఆ దేశాలలోకి ప్రవేశించాయి). పాఠశాలలో గ్రీకు, లాటిన్ భాషలను బోధించాలా, వద్దా అనే అంశంపై వాదించేటప్పుడు తప్పనిసరిగా మన నోటి నుండి రోమ్ మరియు ఏథెన్సుకు చెందిన పదాలు అనివార్యంగా ఉచ్చరింపబడతాయి. ప్రపంచ చరిత్రలో ప్రాచీన చైనా సాహిత్యం, బౌద్ధమతం, ప్రాచీన మధ్యధరా ప్రాంత నాగరికతలు అనివార్యమైన భాగాలే. సాహిత్య వాహకాలుగా (Language carrier) ప్రాధాన్యత ఉన్నవి కేవలం ఐదు భాషలు మాత్రమే. అవి – చైనా భాష, సంస్కృతం, అరబిక్, గ్రీక్ మరియు లాటిన్ భాషలు. ఆ భాషలతో పోలిస్తే, హీబ్రూ, ఫ్రెంచ్ భాషలది కూడా రెండవ స్థానమే”.

18. “క్లాసికల్ భాష” పై కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జార్జ్ ఎన్ హార్ట్ అభిప్రాయాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

“ఒక భాష క్లాసికల్ లేక విశిష్టమైన భాషగా పరిగణింపబడాలంటే, అనేక ప్రామాణికాలను ఆ భాష కలిగి ఉండాలి. ఆ భాష ప్రాచీనమైనది అయి ఉండాలి. స్వతంత్ర వ్యక్తిత్వం, మనుగడ కలిగి ఉండాలి. అంతే కాకుండా మరొకదాని యొక్క ఉపాంగం అయి ఉండకూడదు. (independent tradition that arose mostly on its own) చెప్పుకోతగిన స్థాయిలో, విస్తృత స్థాయిలో ప్రాచీన సాహిత్యాన్ని ఆ భాష కలిగి ఉండాలి. భారతదేశంలో ఉన్న అనేక ఆధునిక భాషలకు భిన్నంగా, పైన ప్రస్తావించ బడిన ప్రామాణికాలు అన్నింటినీ తమిళభాష కలిగి ఉన్నది. అరబిక్ భాషకన్నా పురాతనమైనది. లాటిన్ భాష అంత ప్రాచీనమైనది. తమిళ భాషకు స్వతంత్ర గుర్తింపు వ్యక్తిత్వం ఉన్నది. సంస్కృతం తదితర భాషల ప్రభావం పడకుండా, స్వతంత్రంగా మనగలిగింది. తమిళం యొక్క ప్రాచీన సాహిత్యం విస్తృతమైనది. అత్యున్నత ప్రమాణాలను కలిగి ఉన్నది. తమిళ భాషను ప్రాచీన భాషగా పేర్కొంటూ ఒక వ్యాసాన్ని వ్రాయాలని నాకు అనిపిస్తూ ఉంటుంది. భారతదేశాన్ని ఒక గొప్ప దేశంగా, లేక హిందూ మతాన్ని ప్రపంచంలోని అనేక విశిష్ట మతాలలో ఒకటిగా పేర్కొనటం ఎంతో, తమిళభాషను ప్రాచీన భాషగా పేర్కొనటం కూడా అంతే. భాషలపై అవగాహన ఉన్న ఎవరైనా ప్రపంచంలోని గొప్ప భాషలలో తమిళభాష ఒకటన్న వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. తమిళ భాష ప్రాచీనమైనది కాదని పేర్కొనటం అంటే భారతదేశ గొప్ప సంస్కృతిని నిరాకరించటమే”.

19. అయితే, ఇతర ముఖ్యమైన భాషల ప్రాశస్త్యాన్ని సర్ జార్జి ఎన్ హార్ట్ గుర్తించలేదని చాలా మంది భాషాకోవిదులు భావిస్తున్నారు. ఎందుకంటే, ఉదాహరణకు కన్నడ భాషను ప్రాచీన భాషగా వికీపీడియా గుర్తించింది. అయితే, తెలుగును వదలి వేసింది. విభిన్న అభిప్రాయాలు ఉన్నాయనటానికి ఇవి అన్నీ ఉదాహరణలే. ఈ కోర్టు ముందు ఉన్నది కూడా ఇదే పరీక్ష

### మలయాళం

20. కేరళ ప్రభుత్వం తరఫున కూడా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయబడింది. మలయాళానికి ప్రాచీనభాష హోదా కల్పించవలసిందిగా నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన విషయాన్ని ఆ అఫిడవిట్‌లో ప్రస్తావించారు. తనకు అందజేయబడిన సాక్ష్యాధారాలను పరిశీలించిన పిదప నిపుణుల కమిటీ ఆ విధంగా సిఫార్సు చేసినందున, ఆ సిఫార్సులు ఆమోదింపబడ్డాయి. అందువలన ప్రజాప్రయోజన వ్యాజ్యం ద్వారా ఆ సిఫార్సులను ప్రశ్నించే హక్కు పిటిషనర్‌కు ఉండదు.

21. ఒక సాహిత్య భాషగా మలయాళం దాదాపు 10 శతాబ్దాలకు పైగా మనుగడలో ఉన్నది. స్వతంత్ర మలయాళానికి సంబంధించి మూడవ శతాబ్దికాలం నాటి రాజశేఖరుని ‘వాఝుహప్పల్లి’ శిలాశాసనం ప్రప్రథమ మైనదిగా పరిగణింపబడుతున్నది. ఇతర ద్రవిడ సాహిత్య రచనలతో సంబంధం లేకుండా వ్రాయబడిన ‘మణిప్రవాళ’ మలయాళ శైలిలో చేయ బడిన సాహిత్య రచన. 12వ శతాబ్దం నుండి మలయాళంలో చెప్పుకోదగిన

సాహిత్యం వున్నది.

22. మలయాళ భాషను నిశితంగా అధ్యయనం చేసిన నిపుణుల కమిటీ, మలయాళ భాష, సాహిత్యం 1500–2000 సంవత్సరాల పురాతన మైనదిగా గమనించింది. క్రీస్తుశకం రెండవ శతాబ్దం, ఐదవ శతాబ్దం నాటి శిలాశాసనాలనూ నిపుణుల కమిటీ గుర్తించింది. ఆ విశ్లేషణ పర్యవసానంగా మలయాళంలో చెప్పుకోదగిన ప్రాచీన సాహిత్యం ఉన్నదని, అరువు తెచ్చుకొనని సాహిత్యం ఉన్నదని, ఆ సాహిత్యం, వారసత్వం, వారసత్వానికి కనీసం వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉన్నదని నిపుణుల కమిటీ ఒక నిర్ణయానికి వచ్చింది.

## ఒరియా

23. ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం కూడా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. భాషా నిపుణులతో కమిటీని ఏర్పాటు చేయటానికి దారి తీసిన నోటిఫికేషన్ల పూర్వాపరాలను గురించి, తమకు అందిన సాక్ష్యాధారాలను ఏ విధంగా కమిటీ అధ్యయనం చేసిందీ, అంతిమంగా ప్రాచీన హోదా ఏ విధంగా ఇవ్వబడిందన్న విషయాలను ఆ అఫిడవిట్‌లో ప్రస్తావించటం జరిగింది.

24. బ్రిటీషు వలస పాలన కొనసాగుతున్న దశలోనే, 1936లోనే భాష ప్రాతిపదికగా ఏర్పడిన మొట్టమొదటి రాష్ట్రం ఒడిశా అని ఆ అఫిడవిట్‌లో పేర్కొనబడింది. రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులో కూడా ఒరియా భాష చేర్చబడింది. జాతీయగీతంలోని 'ఉత్కళ' అనేది ఒరియాకు సంబంధించినదే. విస్తృతమైన సమాచారం సేకరించి, కమిటీకి అందజేయటం జరిగింది. అందునిమిత్తం ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ తీవ్రంగా శ్రమించి అధ్యయనం చేసి 483 పేజీలు గల నివేదికను రూపొందించి, శిలాఫలకాల ఫొటోగ్రాఫ్‌లు, రాతిస్తూపాలు ఫొటోగ్రాఫ్‌లు, తాళపత్ర గ్రంథాలు తదితర సాక్ష్యాధారాలతో ఆ నివేదిక రూపొందింది. ఒడిశాకు 2000 సంవత్సరాలకన్నా ఎక్కువ చరిత్ర ఉన్నదని, 1500–2000 సంవత్సరాల పూర్వపు సాహిత్యచరిత్ర ఉన్నదని పేర్కొనబడింది. ఒడిశా భాష గురించిగాని, చరిత్ర గురించి గాని పిటీషనర్‌కు ఎటువంటి పరిజ్ఞానం లేదు. ఒడియాభాషకు గల చరిత్ర గురించి సంగ్రహంగా ఈ క్రింది విధంగా పేర్కొనబడింది.

'ఒడియా భాషకు గతంలో ఉద్ర, ఉత్కళ, కళింగ, కోసల, తోషల, కంగొడ తదితర అనేక పేర్లు ఉండేవి. రెండు వేల ఐదువందల సంవత్సరాలకన్నా పురాతనమైన, అమూల్యమైన సాంస్కృతికత, భాషాపరమైన చరిత్ర వున్నది.

క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దినాటి బౌద్ధయాన ధర్మ సూత్రాలలో కళింగ గురించిన ప్రస్తావన వున్నది. రామాయణ, మహాభారతాలలో కూడా 'కళింగ' గురించి ప్రస్తావించబడింది. భారతముని నాట్యశాస్త్రంలోను, కౌటిల్యుని అర్థశాస్త్రంలోను, మను స్మృతిలోను, పాణిని అష్టాధ్యాయిలోను కళింగ ప్రస్తావన ఉంది. ధౌళి (భువనేశ్వర్) జౌగుడ(గంజాంజిల్లా) లోని అశోక స్తూపాలలోను (క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం) ఒడియా భాషకు చెందిన మూలాలు కనిపిస్తాయి. ఆ స్తూపాలపై గల కొన్ని పదాలు ఇప్పటి ఒడియా చదువురి కూడా చదువగలరు. క్రీస్తుపూర్వం మొదట శతాబ్దానికి చెందిన చక్రవర్తి కారవేనుని హతిగుంప శిలాశాసనంపై (ఉదయగిరి, భువనేశ్వర్) అభివృద్ధి చెందిన ఒడియా భాష కవిత్వం రూపంలో కనపడుతుంది.

ఆ తర్వాత దాదాపు పదిశతాబ్దాలపాటు రాతి మరియు రాగి శిలాఫలకాలపై ఒడియాభాషను గమనించవచ్చు. (ఇవి అతి ఎక్కువ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నవి) బయటపడిన 11వ శతాబ్దినాటి శిలాశాసనంలో ప్రత్యేకమైన ఒడియా లిపిలోనే వుంది.

క్రీస్తుశకం 5వ శతాబ్ది నుండే ఒడిషాలో తాటి ఆకులపై (తాళపత్రాలు) వ్రాయటం ప్రారంభం అయింది. తాళపత్రాలపై వ్రాయబడిన అనేక మూలప్రతులు ఒడిశా రాష్ట్ర పురావస్తుశాలలోను చాలామంది వ్యక్తుల వద్ద లభిస్తాయి. ఒడిశా లిపిలో వ్రాయటం అనేది నిరంతరాయంగా కొనసాగిందనటానికి ఇదే నిదర్శనం.

క్రీస్తుశకం 8 నుండి 12 శతాబ్దాలకు చెందిన బౌద్ధమతానికి చెందిన చర్య పండితులు ప్రాచీన ఒడియా లిపిలో పద్యాలను వ్రాసేవారు.

ఇటువంటి సంప్రదాయం కొనసాగింపులో భాగంగానే క్రీస్తుశకం 15వ శతాబ్దంలో అనేక మహాకావ్యాలు వెలువడ్డాయి. ఉదాహరణకు 140 వేల పద్యాలతో (శ్లోకాలతో) ఒడియా మహాభారతం రచించబడింది. ఈ మహాకావ్యం నూతనంగా ఆవిష్కరించబడిన దండివృత్త రూపంలో వ్రాయబడింది. భారతీయభాషలలో ఆధునిక యుగంలో ఒకే కవి చేత వ్రాయబడిన మహాభారతం ఇదే కావటం విశేషం. ఒడియా మహాభారతం ఒక గొప్ప సాంస్కృతిక పునరుజ్జీవనం. దానికి కొనసాగింపుగా బలరామ దాస్ జగన్మోహన రామాయణాన్ని రచించారు. జగన్నాథ్‌దాస్ భాగవతం రచించారు. అచ్యుతానందదాస్ శూన్యసంహితను రచించారు. జసోబంత దాస్ గోబింద చంద్రను రచించారు.

ఉపేంద్ర భంజ, అభిమన్యు, దినకృష్ణ తదితర కవుల కృషి ఫలితంగా భాషా కవిత్వం ఒక గొప్ప మలుపు తిరిగింది. వీరి రచనలతో, క్లాసికల్ సంస్కృత కవిత్వంతో సమానస్థాయికి ఒడిషా కవిత్వం ఎదిగింది.

నిరంతరం యింకా శతాబ్దాలుగా కొనసాగిన బహుభాషా వారసత్వం, ఒడిషా భాషకు గుర్తింపు లభించేలా పునాది పడేలా చేసింది. బ్రిటీషు పాలనలో, వివిధ ప్రాంతాలలో వున్న ఒడిషా ప్రజలు ఏకం కావటానికి ఒడిషా భాష తోడ్పడింది. అందుకు ఒడియా భాషకు ప్రత్యేక గుర్తింపు. పర్యవసానంగానే 1936లో భాషాపరమైన మొదటి రాష్ట్రంగా ఒడిషా చరిత్ర పుటలలోకి ఎక్కింది.

ఫకీర్ మోహన్‌సేనాపతి రాధానాథ్‌దే, భీమాభాయ్, సాధువు, కవి గంగాధర్ మెహర్, మధుసూదన్‌రావ్ తదితర గొప్ప ఒడియా రచయితలు క్రొత్తకోణాలను స్పృశించటం ద్వారా, క్రొత్త ఆలోచనలకు, క్రొత్త పాత్రలను సృష్టించడం ద్వారా ఆధునిక ఒడిశా సాహిత్యాన్నే క్రొత్తపుంతలు త్రొక్కించారు. వారు ఆవిష్కరించిన నూతనశైలిని ముందుకు తీసుకువెళ్లిన వారి వారసులు ఒడియాభాషకు సేవలందించటం ద్వారా ఒడియా భాషకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు నిచ్చారు. 40 లక్షలమంది మాట్లాడే ఒడియాభాష, గిరిజన, స్థానికభాషల మేళవింపుతో మరింత పరిపుష్టి అయింది. ఆ క్రమంలో ఆంగ్ల, పర్షియన్, అరబిక్ పోర్చుగీస్ తదితర విదేశీ భాషల ప్రభావాన్ని తనలో కలుపుకున్నది. ఆధునిక సమాచారం సాంకేతికతలను కూడా తనలో కలుపుకున్నది.

## కన్నడ

25. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వంకూడా వివరణాత్మకమైన అఫిడవిట్‌ను దాఖలు చేసింది. కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఒక నివేదికను కూడా ఆ అఫిడవిట్‌కు జత చేయటం జరిగింది. (ఆ నివేదికను ఒక పుస్తకరూపంలో కూడా ప్రచురించారు. కన్నడ భాషను ప్రాచీనభాషగా గుర్తించటానికి గల కారణాలను, కన్నడ భాషాపండితులు ఆ నివేదికలో వివరించారు. ఆ నివేదికను నిపుణుల కమిటీకి కూడా అందజేయటం జరిగింది. ప్రాంతీయభాషగా గుర్తించటానికి నిర్దేశించబడిన ప్రతిప్రామాణికాన్ని గురించి ఆ నివేదికలో విడివిడిగా వివరించటం జరిగింది. ఉదాహరణకు 1500–2000 సంవత్సరాలనాటి పురాతన గ్రంథాలు, చారిత్రక

ఆధారాలను గురించి ప్రత్యేకంగా వివరించటం జరిగింది. క్రీస్తుశకం 850 సంవత్సరంనాటి కవిరాజమార్గ కన్నడ భాషలోని ప్రప్రథమ సాహిత్య గ్రంథంగా వివరించబడింది. ఈ రకంగా చూస్తే, మొదటి అంశానికి సంబంధించిన ప్రామాణికాలను, రెండవ అంశానికి సంబంధించిన ప్రామాణికాలుగా పేర్కొంటూ పిటీషనర్ విషయాన్ని ప్రక్కదారి పట్టిస్తు న్నారని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

26. ఒక భాషకు ప్రాచీనహోదా కల్పించటం అనేది చట్టపరమైన అంశం కాదని, ప్రభుత్వం యొక్క విధానపరమైన నిర్ణయం అని, అందువలన ఈ అంశాన్ని భాషా నిపుణులకు వదిలివేయటం ఉత్తమమని, ఈ వివాదం లోకి న్యాయస్థానాన్ని భాషా పండితులతో కూడిన కమిటీ అభిప్రాయాలు/ సిఫార్సులను న్యాయస్థానాలు సమీక్షించరాదు. క్రీస్తుపూర్వం 252 సంవ త్సరంనాటి అశోక చక్రవర్తికి చెందిన బ్రహ్మగిరి శిలాశాసనం ఇసిల కన్నడభాషకు చెందిన ప్రాచీన చారిత్రక ఆధారం. హసన్ జిల్లా, బేలూరు తాలూకా, హల్‌మిడి గ్రామంలోని కనుగొన్న శిలాశాసనం పూర్తిగా కన్నడ లిపిలోనే ఉన్నది. ఇది క్రీస్తుశకం 450 సంవత్సరం నాటిది. అంటే క్రీస్తుపూర్వం మూడవ శతాబ్ది నుండే కన్నడ భాష ఉన్నది. క్రీస్తుశకం నాల్గవ శతాబ్ది నుండి పాలనాపరంగా కన్నడ భాష కొనసాగుతున్నదన్న మాట. కన్నడం సాహిత్య పరమైన భాష. అందువలన పాలనా వ్యవహారా లలో పూర్తిగా వాడుకలోకి వచ్చింది. గత 1500 సంవత్సరాలుగా కన్నడ సాహిత్యం ఉన్నది. కన్నడం, తమిళం కూడా 'ప్రొటో ద్రవిడయిన్' దశ నుండి కొనసాగుతున్నాయి. రెండూ ఒకే శ్రేణికి చెందిన భాషలు. అప్పటి నుండి కన్నడ, తమిళ భాషలు రెండూ స్వతంత్ర భాషలుగా అభివృద్ధి చెందాయి. అంటే తమిళం ఎంత ప్రాచీనమైనదో, కన్నడం కూడా అంతే ప్రాచీనమైనది.

27. అందుబాటులో ఉన్న పరిపూర్ణ కన్నడ సాహిత్య గ్రంథం క్రీ.శ.850 నాటి 'కవిరాజ మార్గ'. అప్పటి నుండి చెప్పుకోతగిన స్థాయిలో పద్యరూపం లోను, గద్యరూపంలోను సృజనాత్మక కన్నడ సాహిత్యం వెల్లివిరిసింది. కొన్ని ఉదాహరణలు.

"అందుబాటులో ఉన్న పరిపూర్ణ కన్నడ సాహిత్య గ్రంథం. క్రీ.శ. 850 నాటి 'కవిరాజమార్గ'. ఆ గ్రంథ రచయిత శ్రీ విజయ నృపతుంగ మహారాజు (క్రీ.శ.814-877) శిలాశాసనాలను అనుసరించి, గంగ వంశానికి చెందిన దుర్వినీత మహారాజు గొప్ప పండితుడు. భారవి సుప్రసిద్ధ గ్రంథం 'కిరాణార్జునీయ'కు భాష్యం వ్రాశాడు. కన్నడంలో మొట్ట మొదటి గద్యరచన 'వడ్డారాధనే'. క్రీ.శ.తొమ్మిదవ శతాబ్దంలో వ్రాయ బడింది. ఇది అనేక కథల సమాహారం.

రాయల్ ఏషియాటిక్ సొసైటీ ఆఫ్ గ్రేట్‌బ్రిటన్ అండ్ ఐర్లాండ్ కు చెందిన ఒక పత్రికలో బి.లివిస్ ధిస్ ఒక వ్యాసాన్ని వ్రాశారు. ఆదిపురాణ మరియు 'విక్రమార్జున విజయ' రచయిత కవి అయిన పుంస గురించి ఆ వ్యాసంలో ప్రస్తావించారు. హంసకవి క్రీ.శ.902-941 మధ్యకాలంలో ఆ గ్రంథాలను రచించినట్లు పేర్కొన్నారు. హరికేసరి మహారాజు ఆస్థానంలో ఆ రచయిత ఆస్థాన విద్వాంసుడు.

28. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేసింది. ఆ అఫిడవిట్లలోని ప్రధాన అంశాలను ఇప్పటికే వివరిం చటం జరిగింది. ఇక్కడ అత్యంత కీలకమైనది భాషా కమిటీ వ్యవస్థాగత నిర్మాణం. ప్రారంభంలో ఉన్న 1000 సంవత్సరాల కాలపరిమితిని ఆ తర్వాత 1500-2000 సంవత్సరాలకు పెంచటం జరిగింది. కమిటీలోని కొందరు సభ్యులు అందుకు అభ్యంతరం వ్యక్తం చేయటంతో, కేంద్ర ప్రభుత్వం తిరిగి కాలపరిమితిని 1000 సంవత్సరాలకు తగ్గించింది, ప్రాచీనభాషల జాబితాలో సంస్కృతం,తమిళభాషలను చేర్చటం అంటే భవిష్యత్తులో ఇతర భాషలను ఆ జాబితాలో చేర్చరాదన్నది కేంద్ర ప్రభుత్వ అభిమతం కాదు. భాషా కమిటీలోని సభ్యులంతా గౌరవనీయులు, గుర్తింపు కలిగి ఉన్న వ్యక్తులు. వారి అర్హతలు (bio-data), అనుభవం తదితర వివరాలు కౌంటర్ అఫిడవిట్లతో జత చేయబడ్డాయి. వాటిని పరిశీలిస్తే వారెంత నిష్ణాతులో స్పష్టంగానే తెలుస్తుంది.

29. తగిన నిర్ణయాన్ని తీసుకోవటంలో ఆ నిపుణులకు (కమిటీ సభ్యులు) పూర్తి స్వేచ్ఛ ఇవ్వబడింది. వారి సామర్థ్యాన్ని పిటిషనర్ ప్రశ్నిం చటం, వివాదాస్పద అంశానికి రాజకీయ రంగు పులమటం దురదృష్టకరం. ఉదాహరణకు కమిటీ సభ్యులలో ఒకరైన డాక్టర్ బిహెచ్ క్రిష్ణమూర్తికి ద్రవిడ భాషలపై విశేషమైన పరిజ్ఞానం ఉన్న వ్యక్తిగా ప్రపంచ వ్యాపితంగా మంచి పేరు ఉన్నది. తమిళ, సంస్కృత భాషలకు ప్రాచీన భాషలుగా గుర్తింపు ఇవ్వాల్సిందిగా సిఫార్స్ చేసిన కమిటీలో ఆయన సభ్యులు. అదేవిధంగా డాక్టర్ కె.వి.సుబ్బారావు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో భాషా విభాగంలో ఉపాధ్యాయులు, ఆయనకూ మంచి గుర్తింపు ఉన్నది. కేవలం వారు తెలుగు, కన్నడ భాషలు మాట్లాడతారన్న కారణంపై అటువంటి ప్రముఖుల గొప్పతనాన్ని ప్రశ్నించటం దురదృష్టకరం, నిజానికి తమిళ, సంస్కృతం భాషలకు ప్రాచీన హోదా ఇవ్వాలని అభిప్రాయపడి సిఫార్సు చేసింది వారే, వారి సిఫార్సు మూలంగానే, ఆ రెండు భాషలకు ప్రాచీన హోదా లభించింది, ఆ విధంగా వారి నుండి ప్రయోజనం పొంది, వారి గొప్పతనాన్ని ప్రశ్నించటమా! న్యాయసమీక్ష అవసరమా అన్నది కూడా (Judicial Review) ఇప్పుడు ప్రశ్నించుకోవాలి. కమిటీ సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం పాలనాపరమైన నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆ నిర్ణయం వెనుక ఎటువంటి దురాలోచనా లేనపుడు, ఆ నిర్ణయం చట్ట విరుద్ధం ఎలా అవుతుంది?

30. ప్రాచీన భాష హోదా కల్పించటంలో జరిగిన మొత్తం ప్రక్రి యకు సంబంధించిన ఫోటో కాపీలతోబాటు మూల రికార్డులు కూడా (original records) మాకు అందజేయబడ్డాయి. తమకు అందిన ఆధారాలను కమిటీలోని భాషాకోవిదులు ఒకటికి రెండుసార్లు శాస్త్రీయంగా విశ్లేషించుకోవటం జరిగింది (Scientifically cross checked). యు.పి.ఏ.(UPA) ప్రభుత్వం యొక్క కామన్ మినిమమ్ ప్రోగ్రాం పర్యవ సానంగానే మొత్తం వివాదం ప్రారంభం అయింది. రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూలులో ఉన్న అన్ని భాషలను అధికార భాషలుగా ప్రకటించే విష యంపై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీని నియమించాలని యు.పి.ఏ. ప్రభుత్వం నిర్ణయించింది (తమిళభాషకు ప్రాచీనహోదా కల్పించటంతో బాటు), సాహిత్య అకాడమీతో సంప్రదించటం జరిగింది. తమిళభాషకు ప్రాచీన హోదా కల్పించటం హేతుబద్ధమే అయినప్పటికి ఒక భాషకు ప్రాచీన హోదా కల్పించటం అనేది ప్రభుత్వం చేయాల్సిన పనికాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం కన్నా ఈ అంశం సంక్లిష్టమైనదని సాహిత్య అకాడమి అభిప్రాయ పడింది. ఏదైనా ఒక భాషకు ప్రాచీన హోదా ఇవ్వటానికి సంబంధించిన విధివిధానాలు ప్రభుత్వం వద్దలేవు. అందువలన సాంస్కృతిక శాఖతోను, ఇతర సంబంధిత శాఖలతోను సంప్రదించి భాషలకు ప్రాచీన హోదా కల్పించటానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించే బాధ్యతను హోంశాఖకు అప్పగించటం జరిగింది. ఆ తర్వాత, నిపుణులతో ఒక సమావేశాన్ని సాహిత్య అకాడమీ ఏర్పాటు చేసింది. ప్రామాణికాలపై చర్చించి, ఖరారు చేయబడ్డాయి. ప్రాచీన భాషకు సంబంధించి, నిర్దిష్టంగా నిర్వచింపబడిన ప్రామాణికాలు లేవని ఆ సమావేశంలోనే గుర్తించటం జరిగింది. ఆ వివరాలను కేంద్ర

ప్రభుత్వానికి పంపటం జరిగింది. తదనుగుణంగా కేంద్ర ప్రభుత్వ కాబినెట్ ఒక నిర్ణయం తీసుకున్నది. కేంద్ర మంత్రివర్గంలో ఉన్న తమిళనాడుకు చెందిన మంత్రి ఒకరు, భాషలకు ప్రాచీన హోదాకు సంబంధించిన నిబంధనలు కఠినతరంగా ఉండాలని ప్రతిపాదించిన విషయాన్ని అందరూ గమనించాలి. 2000 సంవత్సరాల కన్నా ఎక్కువ చరిత్ర ఉందని ఏ భాషకూ ప్రాచీన హోదా ఇవ్వరాదని, ఇతర ప్రామాణికాలకు తగినట్టుగా ఉండాలని ఆ మంత్రి ప్రతిపాదించారు, 1000 సంవత్సరాల చరిత్ర ఉండాలన్న నియమాన్ని పెంచే ప్రయత్నం జరిగింది. ఆ అంశంపై తీవ్ర మైన చర్చ జరిగింది. కాల పరిమితిని 2000 సంవత్సరాలకు పెంచటం అంటే చాలా భాషలకు ప్రాచీనహోదా పొందే అర్హత లేకుండా చేయటమే నని చాలామంది అభిప్రాయపడ్డారు. అంతిమంగా కాల పరిమితిని 2000 సంవత్సరాలకు బదులుగా 1500-2000 సంవత్సరాలుగా నిర్ణయించాలని ఒక అంగీకారం కుదిరింది.

31. 1500-2000 సంవత్సరాలు అనే కొలబద్ద (parameter) గ్రంథాలు/ చారిత్రిక ఆధారాలకే వర్తిస్తుంది. అంతేతప్ప సాహిత్యానికి వర్తించదు. ఆమోదయోగ్యమైన సాహిత్యం అంటే ఏది అనేది నిష్ణాతులు నిర్ణయించాలే తప్ప ఈ న్యాయస్థానం కాదు,

32. తమిళభాషకు కేవలం వెయ్యి సంవత్సరాల చారిత్రక ఆధారమే ఉన్నదని, అయినప్పటికి, ఆ భాషకు ప్రాచీన హోదా కల్పించబడిందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ప్రభుత్వాలు దాఖలు చేసిన కౌంటర్లలో పేర్కొన బడింది. అందుకు విరుద్ధంగా ప్రోటో తెలుగు భాషలో ఉన్న భట్టిప్రోలులోని శిలాశాసనం క్రీస్తుపూర్వం 3000 సంవత్సరాల నాటిది. అయితే ఈ వాదన చేసిన ఆ రాష్ట్రాలకు చెందిన ఉన్నత శ్రేణి బ్యూరోక్రాట్లు రికార్డులను చదివినట్టులేదు. పై ప్రస్తావన 3వ శతాబ్దానికి సంబంధించినదే తప్ప, వేల సంవత్సరాలకు సంబంధించినదికాదు. భట్టిప్రోలు శిలాశాసనం, 3వ శతాబ్దం నుండి, 1వ శతాబ్ది బిసిఇల మధ్యకాలం నాటి బ్రాహ్మీలిపిలోని అక్షరమాలకు సంబంధించినది. ఆ బ్రాహ్మీలిపి నుండి తెలుగు, కన్నడ లిపులు ఆవిర్భవించాయి. ఇక్కడ గమనించవలసింది ఏమిటంటే, తమిళ భాషకు ప్రాచీన హోదా ఇవ్వటంలో 1000 సంవత్సరాలనాటి గ్రంథాలు, చారిత్రక ఆధారాలు అంటే అర్థం తమిళభాషకు కేవలం వెయ్యి సంవత్స రాల చరిత్ర మాత్రమే ఉన్నదని అర్థం చేసుకోరాదు. నిజానికి క్రీస్తుపూర్వం (బిసిఇ) కొన్ని వేల సంవత్సరాల నుండే తమిళ సాహిత్యం, గ్రంథాలు ఉన్నాయి. క్రీస్తు పూర్వం 16000 సంవత్సరాల క్రితమే (బిసిఇ) హిందూ మహాసముద్రానికి దక్షిణాన ఉన్న ప్రాంతం నీటమునిగినట్లు, అది అంతా తమిళ నాగరికతే అని కుమరికండంలో పేర్కొనబడింది. సృజనాత్మక (creativity) మాత్రమే ఒక భాషను అభివృద్ధి చేయగలదు. సాహిత్యము, చర్చలు అనేవి రెండు మార్గాలు. పైన ప్రస్తావించబడిన కుమరికండం గురించి చాలా ప్రాచీన తమిళ, సంస్కృత గ్రంథాలలో ఉదహరింపబడింది. క్రీస్తుశకం మొదటి శతాబ్దినాటి తమిళ గ్రంథాలు అనేకమంది కవులతో కూడిన ప్రాచీన తమిళ సంగాల గురించి పేర్కొనబడింది. వాటిలో అతి ప్రాచీన సంగ సమావేశం 4400 సంవత్సరాలు కొనసాగింది. రెండవ సంగం 3700 సంవత్సరాలు, మూడవ సంగం 1850 సంవత్సరాలు కొనసాగింది. తమిళ వ్యాకరణానికి మూలాధారమైన “తొల్‌కాప్పియం” క్రీస్తుపూర్వం మూడవ శతాబ్ది (బిసిఇ) నాటిది. బైబిల్, ఖురాన్ల తర్వాత ఎక్కువగా అనువదింపబడినదిగా ప్రసిద్ధి చెందిన తిరుక్కురల్ క్రీస్తుపూర్వం 3వ శతాబ్ది నుండి 1వ శతాబ్ది వరకు, అప్పటి జీవన విధానానికి దర్పణం పట్టింది. పాఠశాలలో పాఠ్యాంశంగా ఉన్న ‘పురనానూర్’ క్రీస్తు పూర్వం 1వ శతాబ్ది నుండి 5వ శతాబ్ది మధ్యకాలంలో వ్రాయబడింది. ఈ అంశం అతిసున్నితమైనది అయినందువలన, ప్రతివాదులు, ఒక భాష కన్నా మరొక భాష గొప్పది అని వాదించటానికి బదులుగా, ప్రాచీన హోదా పొందటానికి తమ భాష ఏవిధంగా అర్హమైనదో వివరిస్తే మంచిది.

33. రికార్డులను పరిశీలిస్తే గుర్తింపు పొందటానికి (ప్రాచీన హోదాగా) తగిన అర్హతలు భాషలకు ఉన్నాయని నిపుణుల కమిటీ అభి ప్రాయపడింది.ఆందువలన నిపుణుల కమిటీ అభిప్రాయాలు వాస్తవమా, కాదా అన్న అంశం జోలికి కోర్టు వెళ్ళదలచుకోలేదు. ఇక్కడ ప్రధానమైన విషయం ఏమిటంటే, ఒక భాషకు ప్రాచీన భాషగా గుర్తింపు వచ్చినప్పుడు, “సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్” ఏర్పడటానికి అవసరమైన నిధులను పొందటం జరుగుతుంది. ఆ భాషను సంరక్షించుకొని, అభివృద్ధి చేసుకోవటానికి అవసరమైన చర్యలు తీసుకోవటానికి అవకాశం లభిస్తుంది, ఆ భాషాభి వృద్ధికి కృషి చేసిన వారికి ఆవార్డులు ఇవ్వటం జరుగుతుంది, వాస్తవం చెప్పాలంటే ఆ భాషను సంరక్షించుకుని ఆభివృద్ధి చేసుకోవటానికి అవసర మైన ఆర్థిక సహాయం లభిస్తుందన్నమాట. అందువలన ఒక భాష అభివృద్ధి చెందాలంటే, ఆ భాషను ప్రాచీనభాషగా గుర్తించి, ప్రకటించాల్సిన అవ సరం లేదు. ఈ దేశంలోని భాషలను, సంస్కృతిని అభివృద్ధి పరచేందుకు అవసరమైన నిధులను విడుదల చేయటం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. ఇప్పటికీ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ ఆ పని చేస్తూనే ఉన్నాయి. రికార్డులను పరిశీలిస్తే ఇద్దరు ప్రముఖ తమిళ పండితులను కమిటీలో చేర్చటం రాజకీయ ప్రభావంతోనే అని తెలుస్తుంది, ఎందుకంటే తమిళ భాషకు అప్పటికే ప్రాచీన భాష హోదా ఇవ్వాలని కమిటీలోని మెజారిటీ సభ్యులు అభిప్రాయపడటంతో వారి పప్పులు ఉడకలేదు.

34. రిట్ పిటిషన్లు నిల్వలో ఉండగానే ఇతర భాషలకు ప్రాచీన హోదా కల్పించటం వలన తమిళ భాషకు ఉన్న ప్రాధాన్యత తగ్గిపోతుందని పిటిషనర్ ఒక పసలేని వాదన చేశారు. పిటిషనర్ అభిప్రాయంతో మేము ఏకీభవించటంలేదు. ఒక భాష యొక్క ప్రాధాన్యత అనేది ఇతర భాషలు ఆభివృద్ధి చెందటం లేక అణగారి పోవటంపై ఆధారపడి ఉండదు. ఒక భాష ఎంతవరకు వాడుకలో ఉన్నది, కళ మరియు సంస్కృతిక రంగాలలో సృజనాత్మకత ఎంత వరకు ఉన్నది అన్నవాటిపై ఒక భాష అభివృద్ధి, ప్రాధాన్యత ఆధారపడి ఉంటుంది. తమిళభాషకు ఒక పురాతన చరిత్ర, సాహిత్యం ఉన్నదనేది నిస్సందేహం.

35. ఈ రిట్‌పిటిషన్ల విషయంలో ఈ కోర్టు పరిధి చాలా పరిమితం.

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.
అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..

ప్రాచీన భాషకు ఉండవలసిన ప్రామాణికాలు ఆ భాషలకు ఉన్నాయా, లేనా అన్నది ఒక్కటే ఈ కోర్టు పరిధిలోనిది.

"నాలుగు పరీక్షల (ప్రామాణికాలు) సూత్రం" పై పిటిషనర్ వాదనతో ఈ కోర్టు విభేదిస్తున్నది. ఎందుకంటే మొదటి ప్రామాణికంపై 1500–2000సంవత్సరాల క్రితం ఉన్న గ్రంథాలు చారిత్రక ఆధారాల సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టాలని పిటిషనర్ ప్రయత్నించారు. రెండవ ప్రామాణికం ప్రాచీన సాహిత్యం, సంస్కృతి తరతరాలుగా, శతాబ్దాలుగా వారసత్వ సంపదగా కొనసాగటం, ఇదే ప్రధానం. నాలుగు పరీక్షల సూత్రం" మౌలిక లక్ష్యం ఇదే. అందువలన పిటిషనర్ వాదనను మేము అంగీకరించలేదు,

36. అందువలన ఒక భాషకు, ప్రాచీన హోదా ఇచ్చేందుకు తగిన అరత ఉన్నదా, లేదా అనేది పరిశీలించవలసింది, నిర్ధారించవలసింది నిష్ణాతులు, పండితులు. ఆ విధంగా నిర్ధారించుకుని సంతృప్తి చెందిన తర్వాతనే వారు ఆ భాషలకు ప్రాచీన భాష హోదా ఇవ్వవలసిందిగా సిఫార్సు చేశారు. ఆ విధంగా సిఫార్స్ చేయటానికి గల కారణాలను కూడా మా ముందు ఉంచటం జరిగింది. ఆ కారణాల నకలును పిటిషనర్‌కు కూడా ఇవ్వటం జరిగింది. అందువలన ఆ డిక్లరేషన్ జోలికి మేము పోదల్చుకోలేదు. అటువంటి అంశాలపై చర్చావేదికగా ఈ కోర్టును మేము మార్చదలచుకోలేదు. అయినప్పటికి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన వివరణ ఆధారంగా భాషకు ప్రత్యేక హోదా ఇవ్వటం సరైనది కాదని, ఆ అరత ఆ భాషలకు లేదని పిటిషనర్ భావించినట్లయితే, సంబంధిత ఆధారిటీలకు పిటిషనర్ దరఖాస్తుచేసుకోవచ్చు. ఎటువంటి సాహిత్యం ఆధారంగా ఒక భాషకు ప్రాచీన హోదా ఇవ్వవచ్చు అనే అంశంపై సంబంధిత అధారిటీలకు పిటిషనర్ తగిన సూచనలను ఇవ్వవచ్చు.

37. ఆలివర్ వెండెల్ హోమ్ యొక్క అభిప్రాయాన్ని ఈ క్రింద ఉటంకిస్తూ ఈ తీర్పును ముగిస్తున్నాం.

"ప్రతి భాష ఒక దేవాలయం. ఆ భాషను మాట్లాడేవారి ఆత్మలు ఆ దేవాలయంలో ఉంటాయి". (Every Language is a temple, in which the soul of those, who speak it is enshrined)

38. పై విశ్లేషణతో ఈ పిటిషన్ మరియు ఇతర అనుబంధ పిటిషన్లకు ముగింపు పలుకుతున్నాము.

❊

## అ ఆ ఇ ఈ ఉ

-తెలుగు వెంకట సుబ్బారావు

తల్లిభాష తుడిపి తగిలిస్తె పరభాష
తెల్విటేటలెట్లు తేరుకొనును
చుట్టు చీకటెద్దె చూపెట్లు నిల్చురా
తెలుగువాడి మాట వెలుగుబాట!

అన్న ప్రాస దినమె అన్ని నోటను బద్దె
ఎరుగుటెట్లొ గాని ఎగిరి చచ్చు
శిశువు కింగిలీసు చెప్పి నట్లుండదా
తెలుగువాడి మాట వెలుగుబాట!

అమ్మనుడులు ఇచ్చు అడుగులు గొడుగులు
అమ్మ పలుకు తెచ్చు అణకువ, మెలకువ
భాషలెన్ని యైన మాతృభాష పిదపె
తెలుగువాడి మాట వెలుగుబాట!

ఆటపాట చిదిమి అనుబంధములు చీరి
అంతరంగమంత ఆరాటరాటమౌ
కార్పొరేట్ల చదువు గంతల చదువురా
తెలుగువాడి మాట వెలుగుబాట!

ఉన్నచోట నిన్ను ఉల్లాసపడనీదు
మోసులెత్తదనీదు మొక్కగెదగనీదు
ఊహలన్ని మంచి ఊకగా దంచురా
తెలుగువాడి మాట వెలుగుబాట!

ఒంటికంటి చూపు ఒంటరిచింతన
స్వార్థమునకె చోటు సామాజికం దాటు
కార్పొరేట్ల బడులు రాసుల గడులురా
తెలుగువాడి మాట వెలుగుబాట!

కవిత

## హ ఠా త్ జా గృ తి

–డా॥సి.నారాయణరెడ్డి

నేత్ర గవాక్షాల పక్కన
నిద్ర
పొంచి పొంచి చూస్తున్నది
కంటి పాపల్లోనికి
ఎప్పుడు దూరాలా అని
అది నిమిషాలు లెక్కపెడుతున్నది.
కంటిపాపలకు అనుక్షణం
కావలి కాస్తున్న కనురెప్పలు
నిద్రను దరిదాపుల్లోనికి
రానివ్వటం లేదు.
ఆలోచనలను ఈది ఈది
మేధ
అలసిపోయినప్పుడు
వీలు చూసుకుని
నిద్ర
కండ్లలోనికి దూరింది.
నిద్ర దురాక్రమణ చర్యను
అప్పటికప్పుడే తెలుసుకున్న
హఠాత్ జాగృతి
ఆ నిద్రను
నేత్ర గవాక్షాల్లో నుంచి
అవతలికి విసిరేసింది
నిరంతర జాగృతి
నిద్రకు శాశ్వత బహిష్కృతి.

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

# చదువు-సంస్కారం

1861లో పుట్టిన రవీంద్రనాథ్ ఠాగూరు తన చిన్ననాటి జ్ఞాపకాలను గురించి చెప్పినపుడల్లా, ఆనాటి విద్యావిధానాన్ని గుర్తు చేసుకుని బాధపడుతూనే వుండేవాడు. తనకంటే పెద్దవాళ్లయిన పిల్లలు బడికెళ్ళడం చూసి తానూ పల్లకీ యెక్కి బడికెళ్ళాలని ఆయన పోరు పెట్టారట. తీరా బడికెళ్ళాకగానీ బడంటే యేమిటో ఆయనకు తెలియ లేదు. యింటికి తిరిగొచ్చాక, యిప్పటి మనపిల్లల్లాగే, ఆయన గూడా "టీచరు ఆట" ఆడేవారు. టీచరాటంటే మరేమీగాదు, బెత్తమొకటి తీసుకుని, వరండాలోని స్థంభాలను బాదడమే! అలా బడి అంటే అమానవీయంగా బాదడమేనని అప్పుడు ఆయననుకున్నాడు. యిప్పటి పిల్లలూ అనుకుంటున్నారు.

రవీంద్రుడు సరిగ్గా పాఠశాలలకూ, కాలేజీలకూ వెళ్ళి చదువుకోక పోవడానికి ఆ చిన్నతనపు అనుభవాలే కారణం. తాను బాధితుడు కావడం చేతనే ఆయన తన జీవితాన్నంతా వొక ఆదర్శవంతమైన విశ్వవిద్యాలయాన్ని నిర్మించడానికే వెచ్చించాడు. శాంతినికేతన్‌ను ఆయన ప్రపంచమంతా కలిసి నిర్మించుకున్న గూడుగా సంభావించాడు. తన రచనలలో నాటి విద్యావిధానాన్ని విమర్శిస్తూనే వచ్చారు. ఆనాటి విద్యావిధానం ఇటు భారతీయమూ గాకుండా, అటు విదేశీయమూ గాకుండా, రెండు విధానాల్లోని చెడునూ సంతరించుకుంటోందని ఆయన బాధపడ్డాడు.

శాంతినికేతన్‌లోనే వుంటూ ఆయన పిల్లలకోసం అనేక నాటకాలు రాశాడు. వాటిలో పిల్లలతో బాటు తానూ వేషాలు వేశాడు. విద్య అన్నదొక బరువుగా కాకుండా వినోదంగా కొనసాగాలని ఆయన భావించారు. ప్రకృతిలో ఆడుకుంటూ పాడుకుంటూ ప్రకృతిలో మమేకమవడమే మానవ జీవిత పరమావధిగా ఆయన గుర్తించాడు. రవీంద్రుడి విద్యావిధానాన్ని గురించి తెలుసుకుంటున్నప్పుడు నాకు మా ముత్తాతకాలంనాటి సంగతులన్నీ గుర్తుకొచ్చాయి.

మా ముత్తాత 1850 ప్రాంతంలో ఆనాటి వుత్తర ఆర్కాటు జిల్లాలోని దక్షిణ కొసలో వుండే చెంజి కోట దగ్గరి వెంకటాపురమనే చిన్న పల్లెటూరినుంచీ అదే జిల్లాలోని వుత్తరపు సరిహద్దుల్లో వుండే రవణయ్యగారిపల్లె అనే చిన్న పల్లెటూరికి వలస వచ్చారు. ఆ పల్లెటూరి రైతులు ఆయనను తమకు పాఠాలు చెప్పడం కోసం అంతదూరం నుంచీ ఆహ్వానించి తీసుకొచ్చి తమ గ్రామానికి పిలిపించుకున్నారు. తమ పంచనే వో చిన్న స్థలంలో గుడిసె వేసిచ్చారు. జీవనం కోసం కొంత భూమిని గూడా యిచ్చినట్టున్నారు.

ఆనాటి బడిని వాళ్ళు 'పలుకూట' మని పిలిచేవాళ్ళు. అమావాస్యకూ, పౌర్ణమికి మాత్రమే సెలవులు. అక్కడ పంతులుగారు నేర్పించేదంతా తెలుగే! భారతంలోని ఆదిపంచకం, రంగనాథ రామాయణం, విరాటపర్వం, నలచరిత్ర, భాగవతంలోని గజేంద్రమోక్షం, వీటితోబాటూ పల్లెటూరి జీవితానికి అవసరమైనంత లెక్కలు- అవీ అప్పుడు వుపాధ్యాయుడు బోధించాల్సిన పుస్తకాలు. వీటికి తోడు 'ఆట' అని పిలవబడే నాటకాలు నేర్పడం. ఆ నాటకాలు గూడా చాలా వరకూ రామాయణ భారత కథల నాధారం చేసుకున్నవే!

దాదాపు 150 సంవత్సరాలక్రితం పల్లెటూళ్లలో జీవించడమంటే వొక గొప్ప సాంస్కృతిక జీవితాన్ని గడపడమనే అర్థం. రాయల సీమలో, ముఖ్యంగా తొండనాడులో ప్రతి సంవత్సరమూ 18 రోజుల పాటూ మహాభారత యజ్ఞం జరిగేది. పగటిపూట భారతాన్ని హరి కథగా ప్రవచించడమూ, రాత్రుల్లో దానికి సమాంతరంగా అదే కథల్ని నాటకాలుగా ప్రదర్శించడమూ జరిగేది. కంగుంది కుప్పం నుంచీ వచ్చే నాటకాల వాళ్ళు జానపద ధోరణినీ, ఆంధ్రమహాభారత పద్యాలనూ కలగలిపి, తమదైన ధోరణిలో నాటకాలాడే వాళ్ళు. మిగిలిన రోజుల్లో అప్పుడప్పుడూ వేములపల్లి భారతనాటకాలో, పందరి భజనలో జరిగేవి. అప్పుడప్పుడూ అలవాటుగా గ్రామాలకువచ్చే వృత్తికళాకారులు దేసింగురాజుకథ, నల్లతంగాళ్‌కథ, కాంభోజరాజు కథ, కావమ్మకథ, బొబ్బిలికథ, బాలనాగమ్మ కథ మొదలైన బుర్రకథల్ని రాత్రుల్లో వినిపించేవాళ్ళు.

పల్లెటూళ్ళల్లో గ్రామీణ జీవితమంతా ఆటపాటలతోనే ముడిబడి వుండేది. నాట్లు వేసేటప్పుడూ, కోతలు కోసేప్పుడూ, పొలాల్లో అనేక రకాల పనులు చేస్తున్నప్పుడు నిరక్షరాస్యులు గూడా జానపదగేయాలు పాడేవాళ్ళు. ఆ పాటల్లోని సాహిత్యం వాళ్ళకు అర్థమయ్యిందో లేదో తెలియదుగానీ, ఆ పాటలకుండే రాగాలూ, ధోరణులూ (మూడ్) వాళ్ళ అంతరంగాన్ని తప్పకుండా శుభ్రపరిచే వుండేవి. వాళ్ళు చదువుకున్న, పాడుకున్న సాహిత్యంలో కొంతవరకూ పాతచింతకాయ వచ్చడి విలువలూ, మూఢ నమ్మకాల్ని ప్రోత్సహించే ధోరణులూ వుంటే వుండవచ్చు. కానీ అవి వొక గొప్ప సాంస్కృతిక వాతావరణాన్ని మాత్రం తయారు చేసేవి. అందుకే వాళ్ళు యీనాటి వాళ్లలాగా కాకుండా ప్రకృతిని ప్రేమిస్తూ, అనవసరపు వస్తు వినియోగ సంస్కృతికి దూరంగా, హాయిగా, సుఖంగా జీవించేవాళ్ళు.

మా నాయనమ్మ యెప్పుడు యెక్కడికి వెళ్ళినా ఆమెవెంట వొక పెద్ద గుడ్డ సంచి వుండేది. అందులో ఆమె బట్టలతో బాటూ, తెల్లటి వస్త్రంలో చుట్టిన పుస్తకాల సంచయం గూడా వుండేది. ఆ దస్త్రంలో పండరిభజనలు, కుసుమ హరినాథ్‌బాబా భజనలు, ఊర్మిళాదేవి నిద్ర వంటి పాత పుస్తకాలుండేవి. బహుశా ఆ పుస్తకాలన్నీ ఆనాటి మదరాసు వావిళ్ళవాళ్ళు ప్రచురించినవే గావచ్చు. ఆమె రాగయుక్తంగా పాడే ఊర్మిళదేవి నిద్రలో -వనవాసం ముగించుకుని వచ్చిన భర్త లక్ష్మణుడ్ని అప్పుడే నిద్ర లేచిన ఊర్మిళ గుర్తుపట్టలేక మందలించడమూ, ఆ తర్వాత లక్ష్మణుడు తమ వనవాస వృత్తాంతాన్నంతా ఆమెకు చెబుతూంటే ఆ రాత్రంతా గడచి తెల్లవారి పోవడమూ గొప్ప అనిర్వచనీయమైన విషాద భావనతో మమ్మల్ని ముప్పిరిగొనడమూ, యిప్పుడు గూడా స్పష్టంగా గుర్తుండే జ్ఞాపకం.

మా పల్లెటూరి పాతపూరింటిని తలచుకున్నప్పుడల్లా గుర్తుకొచ్చే మరో మధురమైన జ్ఞాపకం సంక్రాంతి రోజు తెల్లవారు జామున, మంచు తెరల్లోంచి తెల్లటి దుస్తుల్లో యింటి కొచ్చి కూర్చుని, యెలుగెత్తి

మధురాతి మధురంగా పాడే జంగందేవరల పాట. ముందుగా శంఖాన్ని పూరించాక వాళ్ళు పదం అందుకునేవాళ్ళు!

పర్వతాల సాంబశివుడు భద్రేశ్వరా !
వచ్చివాకిట నిలచినాడు భద్రేశ్వరా !
భాగ్యనోములిచ్చేవాడు భద్రేశ్వరా !
పున్నెమునోములిచ్చేవాడు భద్రేశ్వరా !
ఓరుగంటి సాంబశివుడు భద్రేశ్వరా !
వాలాలాడే వేళాలయ్యా భద్రేశ్వరా !
ఒళ్ళెల్లాను వీభూదితో భద్రేశ్వరా !
వాలాలాడెను పరమశివుడు భద్రేశ్వరా !
జడజడానా కోటివేలు భద్రేశ్వరా !
చంద్రకాంత శివలింగాలే భద్రేశ్వరా !
దిన దినమూ రాము రాము భద్రేశ్వరా !
ఏడాదికి ఒక్క దినము భద్రేశ్వరా !
వేడుకైన సంకురాత్రి భద్రేశ్వరా !
తరమునాటి తమపెద్దలు భద్రేశ్వరా !
ఎదురు చూచే వేళలయ్యా భద్రేశ్వరా !

జంగందేవరలు చేసేది భిక్షాటనమే గావచ్చు. ఆ రోజుల్లో పొలమూ, వ్యవసాయమూ వున్నా, కొందరు జంగందేవరలు అదొక బాధ్యతగా సంవత్సరాని కొకసారి వచ్చి గ్రామీణులను ఆశీర్వదించి వెళ్ళేవాళ్ళు. కాలం మారుతునే వుంటుంది. చెడ్డవన్నీ, అదెలాంటిదైనా వెళ్ళిపోవడమే మంచిది. కులమూ, అంటరానితనమూ, స్త్రీలను హింసించడమూ, మొదలైన విషయాలు ఆనాటి ప్రాచుర్యమున్న సాహిత్యంలోనూ, ఆటపాటల్లోనూ, జానపద ప్రదర్శనాల వాచకాల్లోనూ వున్నమాట నిజమే! అయితే వాటితోబాటు గొప్ప సాంస్కృతిక వాతావరణం అదృశ్యమై పోవడమే దురదృష్టం.

స్వాతంత్ర్యం వచ్చాక విద్య ప్రభుత్వ బాధ్యతగా మారింది. ప్రభుత్వ పాఠశాలలు వెలిశాయి. ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చే కళాశాలలూ, ప్రాథమిక స్థాయినుంచీ కళాశాల స్థాయివరకూ పాఠ్యప్రణాళికలను తయారుచేసే సంస్థలూ, అనేకం విరివిగా వచ్చి చేరిపోయాయి. ప్రాథమిక విద్యనుంచే మూడు భాషలు నేర్పడం మొదలయ్యింది. అందులో తప్పేమీ లేదుగానీ విద్యకుండే సాంస్కృతిక భూమికను నిర్లక్ష్యం చేయడమే నేరం. విద్యాప్రమాణాలు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి క్రమంగా తగ్గిపోతూనే వున్నాయి. పాతను మెచ్చుకోవడమూ, కొత్తను విమర్శించడమూ ముసలితనపు లక్షణమేమోనని అనుకున్నాం. కానీ అందులో వున్న నిజమెంతో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

యింగ్లీషులో ప్రచురించబడిన రచనలకూ, విదేశీయమైన విద్యాబోధన ప్రమాణాలకూ వున్న విలువ మన జాతీయ విధానాలకు లేదు. క్రమంగా భారత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలూ, రిజర్వేషను పద్ధతులూ విద్యాలయాల్లో జరగవలసిన పని తప్ప మిగిలిన యిబ్బంది కరమైన పనులే జరుపుతున్నాయి. ప్రపంచ సాహిత్యాన్ని, విజ్ఞానాన్ని చదువుకోడానికి యింగ్లీషు నేర్చుకోవడం అవసరమే! జాతీయ అధికారభాష హిందీని నేర్చుకోవడం మంచిదే! అయితే మాతృభాషకివ్వవలసిన ప్రాముఖ్యత నివ్వకపోవడం చేతనే మన విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. గొప్ప మేధావి అనేవాడు కేవలం మాతృభాషలోంచే పుడతాడని ప్రఖ్యాత కన్నడ రచయిత యు.ఆర్. అనంతమూర్తి నొక్కి చెప్పేవాడు.

రవీంద్రుడు 'చిలకకు విద్యనేర్పడం' అనే చిన్న కథొకటిరాశాడు. ఆ కథలో వో రాజు చిలకకు విద్య నేర్పాలనుకుంటాడు. ఆ పనిని తన సోదరులకప్పగిస్తాడు. వాళ్ళు పెద్ద భవనం నిర్మించి దానికి బడి అని పేరు పెడతారు. ప్రపంచంలోని పుస్తకాలనంతా తీసుకొచ్చి పెద్ద కుప్ప బోస్తారు. ఆ కుప్ప శిఖరం మేఘాలను తాకిందట! వొక వుదయాన, సూర్యకిరణాలు పడగానే చిలక రెక్కలల్లార్చింది. దానికి క్రమశిక్షణ రాలేదని కంసాలిని పిలిపించి, గొలుసు తయారు చేసి దాని రెక్కలు కుట్టేస్తారు. పంజరం చేయడానికి వడ్రంగిని రప్పిస్తారు. అలా బడిలోకి వడ్రంగీ, కంసాలీ గూడా వుద్యోగులైపోతారు. రాజు గారొకసారి బడిని తనిఖీ చేయడానికొస్తాడు. బడినీ, పుస్తకాలనూ, వుపాధ్యాయులనూ, వుద్యోగులనూ చూసి విద్యాబోధన సక్రమంగా జరుగుతోందని సంతోషపడిపోతాడు. మరికొన్ని రోజుల తర్వాత, తాను సభలో కొలువుతీరి వున్నప్పుడు, పక్షి విద్యను చూపెట్టి సభికులను ఆశ్చర్యపరచాలనే వుద్దేశంతో, చిలకను తీసుకురమ్మని సైనికులనాజ్ఞాపిస్తాడు. విషయం తెలుసుకున్న రాజుగారి సోదరులు చిలక చేత రెండక్షరాలైనా మాట్లాడించడానికి ప్రయత్నిస్తారు. చిలక నోరు తెరవదు. యిలా కాదని వాళ్ళు పుస్తకాల్ని ముద్దగా రుబ్బి, ఆ ముద్దను చిలక నోట్లో దూరుస్తాడు. చిలక చచ్చివూరుకుంటుంది. చచ్చిన చిలకను భటులు రాజుగారి చేతికందిస్తారు. రాజు చిలక గొంతుపై నొక్కుతాడు. కాగితాల రెపరెప వినబడుతుంది. చిలక విద్య విజయవంతంగా ముగిసిందని రాజుగారు సంబరపడిపోతాడు. అదీకథ.

యీ కథను రవీంద్రుడు 1900 వ ప్రాంతంలో రాసినట్లున్నాడు. అప్పటినుంచీ యిప్పటివరకూ చాలా మార్పులు జరిగిపోయాయి. ఆనాడు విద్యాలయాల్లో విద్యార్థిని నిర్లక్ష్యం చేస్తున్నారని రవీంద్రుడు వాపోయాడు. యిప్పుడు విద్యాలయాల్లో విద్యార్థుల్ని నిర్లక్ష్యం చేయగలిగే స్థితి రాజకీయాలు లేవు. తామరతంపరగా విద్యార్థులకు పట్టాలొస్తున్నాయి. విద్యాలయాలు పరస్పరం పోటీబడుతూ, తమ ప్రాచుర్యం కోసం అవినీతి మార్గాలను తొక్కుతున్నాయి. ప్రభుత్వ విద్యాలయాలలో ప్రమాణాలు పడిపోతున్నాయి. ప్రభుత్వేతర విద్యాలయాలన్నీ వ్యాపారాలుగా మారిపోయాయి. కృత్రిమమైన విద్యాబోధనతో మరమనుషులూ, అమానవీయులూ అయిన కొత్త యువ తరాన్ని తయారు చేస్తున్నాం.

**యిటీవల విశ్వవిద్యాలయాల అధికారులు ప్రతి పరీక్షలోనూ 'నీతి, మానవ విలువలు' అనే పేరుతో కొత్త విషయాన్ని చేర్చారు. యీ విషయం చివరకు భాషాశాస్త్ర అధ్యయనాల్లోనూ తప్పనిసరి చేశారు. సాహిత్యమంతా నీతినీ, మానవ విలువల్ని గురించే కళాత్మకంగా బోధిస్తుంది. కానీ ప్రత్యేకంగా ఆ విషయాన్ని చేర్చడం, ప్రస్తుత విద్యావిధానంలో ఆ పని జరగడంలేదనే విషయాన్ని స్పష్టంగా గుర్తు చేస్తోంది. రవీంద్రుడి కథ నిప్పుడు మనం తిరిగి రాయాలి. ఆ బడిలో చిలకకిప్పుడు పట్టాలపైన పట్టాలొస్తున్నాయి. కానీ దాని జీవిత విధానం మారడంలేదు. ఇప్పటి విద్యాలయాల్లోంచి పారిపోతున్నదెవరు? ప్రతీకాత్మకంగా చెప్పాలంటే చదువుతల్లి సరస్వతి గాదుగదా! మనం క్రమంగా పోగొట్టుకుంటున్న దేమిటి? మన సంస్కృతీ, నాగరికతలే గదా!** ❋



## కంప్యూటర్‌లో తెలుగు-ప్రస్తుత స్థితి, భవిష్యత్ కార్యాచరణ-2

-రహ్మానుద్దీన్ షేక్
96869 03386

# ఆస్కీ, ఇస్కీ, యూనికోడ్

**కం**ప్యూటరులో తెలుగు భాషను చూడగలగటం, రాయగలగటం, ఇంటర్నెట్‌లో తెలుగులో ఉన్న సమాచారం, తెలుగులో కంప్యూటర్‌లు, ఇతర సాంకేతిక ఉపకరణాల అందుబాటు గురించి చూశాం.

ఈ వ్యాసం చదివాక, నా స్నేహితులలో కొందరికి : తెలుగులో టైపు చెయ్యడం సులువా, కష్టమా? ఏమేమి మార్గాలున్నాయి? ఏది మేలైనది? ఏది కష్టతరం? ఏది నాకనువైనది - అన్న విషయాలు చాలా పెద్ద చర్చకు దారి తీశాయి. ఎన్నో సందేహాలు, ఇంకెన్నో సలహాలు. అన్నీ కలిపి ఒక పెద్ద పొత్తమే తయారయ్యేలా ఉంది. అందులోని ఆసక్తికర విషయాలు కొన్ని ఇక్కడ చేర్చుతున్నాను.

తెలుగు లిపిలో అసలు ఎందుకు టైపు చెయ్యాలి? ఇంగ్లిష్ అక్షరాలలో టైపు చేసినా తెలుగు భాషలో టైపు చేస్తే ఎంచక్కా అర్థమవుతుందిగా? పైగా చిన్నప్పటి నుండి తెలుగు చదూకోని ఒకరిద్దరుంటే వాళ్ళకీ అర్థమవుతుందిగా అని ఒక నేస్తమన్నాడు. ఇది నాకొద్దు అంతా గజిబిజిగా ఉంది ఇంగ్లిష్ కీబోర్డు వాడి తెలుగులో టైపు చెయ్యటం వల్ల వచ్చిన కాస్త ఇంగ్లిష్ మర్చిపోతానేమో అనిపిస్తోంది అని ఇంకొకడు వాపోయాడు. బయటంతా ఇంగ్లిష్ కదరా, మళ్ళీ తెలుగులో ఎందుకు? అన్నాడింకొకడు. నేను "అను"లో టైపే వాడిని ఇప్పుడు ఈ ఇన్‌స్క్రిప్టు, లిప్యంతరీకరణల్లో టైపటం కష్టంగా ఉంది అన్నాడింకొకడు. ఒకామె అయితే ఇంగ్లిష్, తెలుగు పక్క పక్కన రాస్తే ఒకే ఫాంటు సైజుకి తెలుగు చిన్నగా, ఇంగ్లిష్ పెద్దగా వస్తోంది - andukani nenu telugulo type cheyyanu.

ఇవన్నీ చంటిపాపడు అన్నం తినకుండా ఉంటానికి చెప్పే సాకుల్లా అనిపించాయి నాకైతే.

కొందరు బలమైన కారణాలు కూడా చెప్పారు. తెలుగులో ఒక పదం టైపు చెయ్యడానికి ఇంగ్లిష్‌లో అదే పదం టైపు చెయ్యడానికి చాలా వ్యత్యాసం ఉంది. తెలుగైతే ఎక్కువ శ్రమ కలుగుతుంది, ఇంగ్లిష్‌లో రాసేస్తే సులువు అన్నాడొకడు.

అదీ కొద్దిపాటి శ్రమ పెడితే కష్టమేమీ కాదు.

ఒక రెండు-మూడు గంటల వ్యవధిలో కష్టమైన పదాలతో సహా సొంతం తెలుగులో టైపు చేయడం నేర్చుకోవచ్చు. అనులో టైపు చేసేవాళ్ళని దృష్టిలో ఉంచుకొని వీవెన్ (veeven.wordpress.com) తన వెబ్‌సైటులో అనులో వ్రాసే శైలిలోనే తెలుగు యూనికోడ్‌లో ఎలా టైపు చేయాలో వివరించారు.

ఇక ఇంగ్లిష్‌లో కాకుండా తెలుగులో ఎందుకు టైపు చెయ్యాలి? అన్న విషయమై చెప్పుకోడానికి ఇది వేదిక కాదు. చర్చించాల్సినంత అవసరమూ లేదు. "మాతృభాషలోనే అంతా" అనందే మన మాట పట్టించుకొనే పరిస్థితి ఎక్కడా లేదు. కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వం నుండి స్థానిక అధికారులకు వచ్చే అన్ని సమాచార పత్రాలు తెలుగులోనే ఉండాలన్న పట్టు పడితే ఎలాంటి పెను మార్పులొస్తాయో ఇట్టే ఊహించొచ్చు. మన మాతృభాషను వదిలి పరభాష హిందీలో మాట్లాడితేనే (ఇంగ్లిష్ అని అనలేదు) మన గోడు పట్టించుకుంటారు అన్న భ్రమలో ఇంకా కొందరున్నారంటే, మనకున్న అవగాహన, పరిణితి ఎంత అభివృద్ధి చెందాలో తెలుస్తుంది.

"కొసమెరుపేమిటంటే బయటంతా ఇంగ్లిష్ కాబట్టీ నేనూ ఇంగ్లిష్‌లోనే" అన్న వ్యక్తే 'తెలుగులో ఏమీ లేనిదే ఏం చదవను ఇంటర్నెట్‌లో' అని రోజుల వ్యవధిలో నన్ను ప్రశ్నించాడు.

ఇంగ్లిష్ అమ్మ ఒడిలో కంప్యూటరు లాలన-పోషణ పొందటం మొదలుపెట్టి దశాబ్దాలవుతున్నాయి. 19వ శతాబ్దం మొదట్లో కంప్యూటర్‌కు ఇంగ్లిష్ నేర్పటం మొదలయింది. దాదాపు రెండొందలేళ్ళుగా ఆంగ్లంలోనే కంప్యూటరు వెలసిల్లింది. యూనికోడ్ వచ్చాకే (1995) లాటినేతర భాషల్లో కంప్యూటరు పుట్టిందని అంచనా వేసుకోవచ్చు. అంటే ఇరవై ఏళ్ళుగా మాత్రమే కంప్యూటర్‌కు తెలుగు చదివి అర్థం చేసుకునే సామర్థ్యం వచ్చింది. కానీ తెలుగును కంప్యూటరుకు నేర్పేవారు చురుగ్గా పని చెయ్యటం మొదలుపెట్టింది 2006-2007 ప్రాంతంలోనే. 200 యేళ్ళుగా నేర్చుకుంటున్న భాషకు, పదేళ్ళుగా నేర్చుకుంటున్న భాషకు వ్యత్యాసం ఉంటుంది.

ఆ విధంగా చూస్తే కంప్యూటర్ ఒక విధంగా తెలుగులో "అమ్మ, లాల్ల (నాన్న)" అని పలకటం మాత్రమే నేర్చుకుని ఉంది. ఆంగ్లంలో సకల శాస్త్రాలు అధ్యయనం చేయడం పూర్తయి ఎంతటి పెద్ద గ్రంథాలైనా క్షణాల్లో రాసి పడెయ్యగల విద్వాంసుడి స్థాయిలో ఉంది. కంప్యూటర్ చేత తెలుగులో అక్షరాలు దిద్దించడం, తియ్యని తెలుగు మాటలు పలికించడం మనందరి కర్తవ్యం. ప్రతి వ్యక్తి కూడా అటు పాశ్చాత్య దేశాల్లో ఇటు ప్రాచ్య దేశాల్లో కంప్యూటరుకు కనీసంలో కనీసం వారి అక్షరాలు నేర్పించేసే పనిని పూర్తి చేసుకున్నారు. కొన్ని చిన్న చిన్న పదాలు కూడా కంప్యూటర్ మాట్లాడేసెయ్యగలదు. భారతీయ భాషలలో కాస్తలో కాస్త ఆ హోదా హిందీకి వచ్చేసింది. దీనికి కారణం ప్రభుత్వం పట్టుబట్టడమే అని వేరే చెప్పనక్కరలేదు. ఐతే వాణిజ్య సంస్థలు చొరవ తీసుకోవాలి లేదా ప్రభుత్వం ఆదేశించాలి, అప్పుడే ఆంగ్లేతర భాషలలో కంప్యూటరులు, ఇతర సాంకేతిక ఉపకరణాలు పని చెయ్యగలవు.

ప్రభుత్వ చొరవ ఎంతో కొంత ఉన్నప్పటికీ, ప్రజలు మారందే ఇది సాధ్యం కాదు. తెలుగులో మాన్యువల్ లేనిదే కుక్కర్-గ్యాస్ స్టవ్ లాంటి వస్తువులను వినియోగదారులు కొనకపోతే, ఆయా కంపెనీలు తప్పనిసరిగా తెలుగును వాడటం మొదలుపెడతాయి. పదే పదే తెలుగులో కాల్ సెంటర్‌లు కావాలన్నందుకే నేడు మనం తెలుగులో మన సమస్యలని మొబైల్ అనుసంధాన సంస్థలైన ఎయిర్టెల్ లాంటి వారికి విన్నవించుకోగలుగుతున్నాం.

**కంప్యూటర్‌కి ఎన్ని భాషలు నేర్పవచ్చు? ఎన్ని భాషలు నేర్చుకోవాలి?**

ఎలాగైతే మనుషులు అవసరాన్ని బట్టి ఇంట్లో మాట్లాడే భాష,

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| **Regular ASCII Chart (character codes 0 - 127)** | | | | | | | |
| 000 (nul) | 016 ► (dle) | 032 sp | 048 0 | 064 @ | 080 P | 096 ` | 112 p |
| 001 ☺ (soh) | 017 ◄ (dc1) | 033 ! | 049 1 | 065 A | 081 Q | 097 a | 113 q |
| 002 ☻ (stx) | 018 ↕ (dc2) | 034 " | 050 2 | 066 B | 082 R | 098 b | 114 r |
| 003 ♥ (etx) | 019 ‼ (dc3) | 035 # | 051 3 | 067 C | 083 S | 099 c | 115 s |
| 004 ♦ (eot) | 020 ¶ (dc4) | 036 $ | 052 4 | 068 D | 084 T | 100 d | 116 t |
| 005 ♣ (enq) | 021 § (nak) | 037 % | 053 5 | 069 E | 085 U | 101 e | 117 u |
| 006 ♠ (ack) | 022 ▬ (syn) | 038 & | 054 6 | 070 F | 086 V | 102 f | 118 v |
| 007 • (bel) | 023 ↨ (etb) | 039 ' | 055 7 | 071 G | 087 W | 103 g | 119 w |
| 008 ◘ (bs) | 024 ↑ (can) | 040 ( | 056 8 | 072 H | 088 X | 104 h | 120 x |
| 009 (tab) | 025 ↓ (em) | 041 ) | 057 9 | 073 I | 089 Y | 105 i | 121 y |
| 010 (lf) | 026 (eof) | 042 * | 058 : | 074 J | 090 Z | 106 j | 122 z |
| 011 ♂ (vt) | 027 ← (esc) | 043 + | 059 ; | 075 K | 091 [ | 107 k | 123 { |
| 012 ♀ (np) | 028 ∟ (fs) | 044 , | 060 < | 076 L | 092 \ | 108 l | 124 \| |
| 013 (cr) | 029 ↔ (gs) | 045 - | 061 = | 077 M | 093 ] | 109 m | 125 } |
| 014 ♫ (so) | 030 ▲ (rs) | 046 . | 062 > | 078 N | 094 ^ | 110 n | 126 ~ |
| 015 ☼ (si) | 031 ▼ (us) | 047 / | 063 ? | 079 O | 095 _ | 111 o | 127 ⌂ |

వ్యవహార భాష, వాణిజ్య భాష, రాజకీయ భాష ఇలా నేర్చుకోవలసి వస్తుందో (ఉదాహరణకి ఆంధ్రలో పుట్టి మణిపుర్‌లో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి ఇంట్లో తెలుగు, వ్యవహారంలో మణిపురి, వాణిజ్యానికి అస్సమీ/బంగాళీ, పని వద్ద హిందీ లేదా ఇంగ్లిష్ మాట్లాడటం అవసరం కాబట్టి అన్ని భాషలు నేర్చుకోవాలి), అలాగే కంప్యూటరు కూడా అవసరాన్ననుసరించే కొత్త భాషలు నేర్చుకుంటుంది.

మొదట్లో కంప్యూటరుకు ఆంగ్ల అక్షరాలు–రెండు బదులు, అంకెలు, ?, ., <, > లాంటి కొన్ని చిహ్నాలు నేర్చుకుంటే సరిపోయేది. ఈ చిహ్నాలు A, a, B, b, Z, z, !, @, $ తో సహా కంప్యూటరుకు అర్థం కావు. కంప్యూటర్ కు అర్థమయ్యేది సున్న–ఒకటి మాత్రమే. మనింట్లో ఉండే బల్బుకి అర్థమయ్యేది కూడా అంతే. ఆర్పేసినపుడు సున్న, తిరిగి వెలిగించినపుడు ఒకటి. ఇలా సున్నలు ఒకట్లలోనే కంప్యూటరు అర్థం చేసుకుంటుంది. ఈ విధంగా ఇంగ్లిష్‌లో A అనే అక్షరాన్ని 01000001 గా, అంటే ఒకటి ఏడు స్థానాలలో ఉన్న లైటు వెలిగి ఉంది, మిగితావి ఆర్పేసి ఉన్నాయి. తెలుగు అ అక్షరాన్ని ఇదే పద్ధతిలో రాస్తే 00111111 అని కంప్యూటరుకు చెప్పాలి.

మరి ఈ సున్నాలు–ఒకట్లలో రాస్తేనే కంప్యూటరుకు అర్థమవుతుందంటే మనం ఒక వాక్యం రాయటానికి ఒక రోజు కన్నా ఎక్కువ పట్టొచ్చు. కానీ అలా జరగట్లేదే అక్షరాన్ని నేరుగా కీబోర్డుపై టైపుతే కంప్యూటర్ స్క్రీన్ మీద పడిపోతుంది కదా. అక్కడే చమత్కారం ఉంది. మన మధ్య దుబాసీలుండి తర్జుమా చేస్తున్నట్టే మనం అనుకునే విషయాలను కంప్యూటరు అర్థం చేసుకునేందుకు ఎన్నో దుబాసీ ప్రోగ్రాములు రాసి ఉంటాయి. ఆ ప్రోగ్రాముల పని మనం చెయ్యాలనుకున్న పనిని కంప్యూటరుకు చేరవేయటం. స్క్రీన్ మీద ఎరుపు రంగు చూపించాలన్నా, ఒక పేజీ ప్రింటు చెయ్యాలన్నా, ఇలాంటి దుబాసీ ప్రోగ్రాములే పని చేస్తాయి.

**మరి ఏ అక్షరానికి ఈ ఒకట్లు సున్నాలు ఎలా పేర్చాలి?**

ఇదే ప్రశ్న కంప్యూటర్ శాస్త్రజ్ఞులకు వచ్చింది. సమస్యనెలా తీర్చాలి అనుకున్నారు. అన్ని అక్షరాలు, చిహ్నాలని మళ్ళీ అంకెలుగానే మార్చి కంప్యూటర్ ప్రోగ్రాముకు ఒక దానికిస్తే అది ఈ అంకెలను సున్నాలు–ఒకట్లున్న అంకెలుగా మార్చి కంప్యూటరుకు ఇచ్చేలా వ్యవస్థ చేసారు. ఒక్కో దేశంలో ఒక్కో శాస్త్రవేత్త ఒక్కో విధంగా అక్షరాలకి సున్నాలు ఒకట్లు పేర్చవచ్చు. అమెరికాలో వాడు A కి 001 అని అంకె ఇస్తే ఈజిప్టు శాస్త్రజ్ఞుడు 100 ఇవ్వవచ్చు. ఇలాంటి అయోమయ పరిస్థితి రాకుండా ప్రభుత్వం నుండి ఆమోదం చేసే సంస్థ కావాలి, ఆమోద నిబంధనలుండాలి (స్టాండర్డ్). అలా మొట్టమొదటగా ఆమోదం పొందిన స్టాండర్డ్(నిక్కచ్చి) ఆస్కీ–ASCII (American Standard Code for Information Interchange).

ఈ స్టాండర్డ్ ప్రకారం ఏమీ లేని ఖాళీని 000 గా మొదలుపెట్టి 047 వరకు వివిధ రకాల చిహ్నాలకు. 048 నుండి 057 వరకు సున్న నుండి ఒకటి, రెండు, తొమ్మిది వరకు అంకెలు. 058 నుండి 064 వరకు మరికొన్ని చిహ్నాలు. 065 నుండి 090 వరకు పెద్దబడి ఆంగ్లాక్షరాలు. 097 నుండి 122 వరకు చిన్నబడి ఆంగ్లాక్షరాలకు అంకితమివ్వడం ఈ స్టాండర్డ్‌లో కనిపిస్తుంది. ఏ చిహ్నానికి ఏ అంకెనో బొమ్మలో చూడగలరు. ఈ స్టాండర్డ్ 1960లో మొదలయి, నేటికి చెలామణిలో ఉంది. కొన్నాళ్ళకి మరికొన్ని చిహ్నాలొచ్చాయి. గ్రీకు అక్షరాలను ఈ ఆస్కీ కి చేర్చాలనే బలమైన ఎద్దేవా శాస్త్రజ్ఞుల నుండి వచ్చి పడింది. మొదట్లో పైనున్న 128లో నుండే రెండు–మూడు–నాలుగక్షరాల కలైకను ఒక గ్రీకు అక్షరంగా చూపించడం లాంటివి చేసారు. అతుకుల గతుకుల బొంతలా తయారయ్యే సరికి. ఇంకొన్ని అంకెలను చేర్చి రెట్టించి, 256 అక్షరాలను ఇముడ్చుకునే ఎక్స్టెండెడ్ ఆస్కీ స్టాండర్డ్‌ను తెచ్చారు. ఇది ఐబీఎం సంస్థ 1981లో ప్రతిపాదించింది. బొమ్మలో ఎక్స్టెండెడ్ ఆస్కీ లోని చిహ్నాల అంకెలను చూడగలరు.

ఇక కాలం కదిలేకొద్దీ వేరే భాషలను కంప్యూటరులో చూపించాల్సిన అగత్యం వచ్చి పడింది. ఏం చేస్తారు? ఉన్న 256 (128 ASCII, 128 Extended ASCII) అక్షరాలను అటు తిప్పి ఇటు తిప్పి వాడటం మొదలు పెట్టారు. • టైపు చేస్తే తెలుగు ఆ వచ్చేలా, sÁa కలిపితే ఝ అని కనిపించేలా ఖతులు తయారు చేశారు (మనకు అక్షరం ఆ గా కనపడుతున్న అది కంప్యూటరుకు • లాగానే కనపడుతుంది. ఇక్కడ దుబాసీ ఖతి – ఫాంట్ అన్నమాట) ఒక పేజీలో ఒక భాషున్నంతవరకు ఇది చెల్లింది. ఒకే పేజీలో రెండు భాషలు చూపించాల్సి వచ్చినపుడు ఇద్దరు దుబాసీలను ఒక ఆసనంలో కూర్చోమనడం ఎంత అసౌకర్యమో ఒక పేజీలో రెండు ఫాంట్లను

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| **Extended ASCII Chart (character codes 128 - 255)** | | | | | | | | |
| 128 Ç | 143 Å | 158 ₧ | 172 ¼ | 186 ║ | 200 ╚ | 214 ╓ | 228 Σ | 242 ≥ |
| 129 ü | 144 É | 159 ƒ | 173 ¡ | 187 ╗ | 201 ╔ | 215 ╫ | 229 σ | 243 ≤ |
| 130 é | 145 æ | 160 á | 174 « | 188 ╝ | 202 ╩ | 216 ╪ | 230 µ | 244 ⌠ |
| 131 â | 146 Æ | 161 í | 175 » | 189 ╜ | 203 ╦ | 217 ┘ | 231 τ | 245 ⌡ |
| 132 ä | 147 ô | 162 ó | 176 ░ | 190 ╛ | 204 ╠ | 218 ┌ | 232 Φ | 246 ÷ |
| 133 à | 148 ö | 163 ú | 177 ▒ | 191 ┐ | 205 ═ | 219 █ | 233 Θ | 247 ≈ |
| 134 å | 149 ò | 164 ñ | 178 ▓ | 192 └ | 206 ╬ | 220 ▄ | 234 Ω | 248 ° |
| 135 ç | 150 û | 165 Ñ | 179 │ | 193 ┴ | 207 ╧ | 221 ▌ | 235 δ | 249 · |
| 136 ê | 151 ù | 166 ª | 180 ┤ | 194 ┬ | 208 ╨ | 222 ▐ | 236 ∞ | 250 · |
| 137 ë | 152 ÿ | 167 º | 181 ╡ | 195 ├ | 209 ╤ | 223 ▀ | 237 φ | 251 √ |
| 138 è | 153 Ö | 168 ¿ | 182 ╢ | 196 ─ | 210 ╥ | 224 α | 238 ε | 252 ⁿ |
| 139 ï | 154 Ü | 169 ⌐ | 183 ╖ | 197 ┼ | 211 ╙ | 225 ß | 239 ∩ | 253 ² |
| 140 î | 155 ¢ | 170 ¬ | 184 ╕ | 198 ╞ | 212 ╘ | 226 Γ | 240 ≡ | 254 ■ |
| 141 ì | 156 £ | 171 ½ | 185 ╣ | 199 ╟ | 213 ╒ | 227 π | 241 ± | 255 |
| 142 Ä | 157 ¥ | | | | | | | |

వాడాలనుకోవటం కూడా అంతే మూర్ఖత్వం. ఇందులో ఉన్న బాధ ఏమిటో అను వాడే వాళ్ళకి తెలుస్తుంది. అంటే అను ఫాంట్స్, పేజి మేకర్ లాంటివి 80ల నాటి సాంకేతికాలనమాట.

ఒక పేజీలో రెండు భాషలు, 256 అక్షరాల్లో తెలుగు అక్షరాలు, గుణింతాలన్నీ ఇమడ్చడం అటు చేసి ఇటు చేసి సాధించొచ్చేమో గానీ, చైనీస్ కొరియన్ లాంటి భాషలైతే ఎలా? మన అక్షరాలు అచ్చులు హల్లులు కలిపి 56-58, గుణింతాలు కలుపుకుంటే 600 అనుకుందాం. ఆ 256 అటు ఇటు చేసి 600 అక్షరాలుగా చూపించటం పెద్ద కష్టమవలేదు అను ఫాంట్స్ వాడికి హ అని వ్రాయటానికి ఎ కి తలకట్టు దీర్ఘం కలిపి చేర్చేస్తాడు. ప్రా రాయాలన్న ఎ కి దీర్ఘం ర వత్తు. ఘ అంటే ఎ కి తలకట్టు, కొమ్ము, మహాప్రాణ చిహ్నం కలిపేస్తాడు. ఇలా ఉంటుందీ వరుస. తెలుగు కాబట్టి సరిపోయింది. చైనా వారి భాషలో అక్షరాల సంఖ్య ఒక లెక్క ప్రకారం ఏడు వేలయితే మరో లెక్కలో యాభై నాలుగు వేల పై చిలుకే ఇంకో లెక్క ప్రకారం లక్షా ఆరువేల రెండొందల ముప్పై. ఎంత అటు ఇటు చేసినా ఆ 256తో ఇన్ని అక్షరాలు రాయటం దాదాపు అసాధ్యం.

ఈ సమస్య పెరిగి పెరిగి యూనికోడ్‌కు దారితీసింది. యూనికోడ్ 100 కాదు 1000 కాదు ఏకంగా లక్షా పది వేల నూట ఎనభై ఏడు అక్షరాలను ఇముడ్చుకునే శక్తిని కంప్యూటరుకిచ్చింది. ఈ ప్రక్రియ 1995లో మొదలయింది. ఎక్కువ అక్షరాలున్న కొరియన్ - చైనా భాషలకు పంట పండింది. వారు కొద్ది సమయంలోనే దాదాపు అన్ని కోడ్ పాయింట్లను వాడేసి యూనికోడ్‌లో మిగతా భాషలకు చోటు లేకుండా చేసే స్థాయికి ఎదిగిపోయారు. అమరావతి శివలింగాన్ని మేకుకొట్టి ఆపినట్టు, యూనికోడ్ కన్సార్టియం అనే సంస్థను ఏర్పాటు చేసి గుణింతాలను అక్షరాలుగా గుర్తించట్లేదు లాంటి ప్రతిపాదనలతో అన్ని ప్రపంచ భాషలకు యూనికోడ్‌లో స్థానం కలిపించారు.



తెలుగుకు ఈ వరుసలో 3072 నుండి 3199 వరకు నూట ఇరవై ఎనిమిది గడులు రిజర్వ్ చేశారు. అన్ని అక్షరాలు (గుణింతాలు కాదు) చేర్చినా, లుప్తమైన లాంటి అక్షరాలు, అర, పావు, నాలుగో వంతుకి ప్రాచీన కాలంలో తెలుగువాళ్ళు వాడిన గుర్తుల్ని చేర్చినా మరో 31 అక్షరాలను చేర్చుకునే సదుపాయంతో యూనికోడ్ ఉంది. కింద బొమ్మలో తెలుగులోని అన్ని యూనికోడ్ పాయింట్లు చూడొచ్చు.

యూనికోడ్ వల్ల లాభమేంటి? పైన చెప్పుకున్న దుబాసీ ఫాంటు యూనికోడ్‌లో కేవలం అక్షరాల ఆకృతిని మాత్రమే మనకి చూపిస్తుంది. మనకైనా కంప్యూటరుకైనా ఆ అక్షరం ఆ అక్షరమే. ఆస్కీలో లాగా మనకు కనిపించేది ఒక అక్షరం కంప్యూటరుకు అర్థమయ్యేది ఒక అక్షరం లాంటి పరిస్థితి ఉండదు. దీని వల్ల ఎన్నో లాభాలు. విడిగా సాఫ్టువేరు దుబాసీలు ఇన్‌స్టాల్ చేసుకోనక్కరలేదు. ఒక్క ఫాంటు ఉన్నా చాలు.

ఇదంతా అంతర్జాతీయ స్థాయి విషయం. దేశీయంగా మన పురోగతి ఏమైనా ఉందా? లేదనే చెప్పాలి. తెలుగుభాషను అధ్యయనం చేసే వాళ్ళు కంప్యూటరును నేర్చుకోవడం లేదా కంప్యూటరును నేర్చుకునే వారు తెలుగు భాషపై ఆసక్తి కలిగి ఉండటం శ్రీకృష్ణుడు చెప్పిన తీపిగా ఉన్న ఔషధం లాగా చాలా అరుదు. అలా కృషి చేస్తున్న ఆ అరుదైన వారికి శతకోటి నమస్కారాలు.

1991 ప్రాంతంలో అను ఫాంట్స్‌లా ఇంగ్లిష్ అక్షరాల మిశ్రమాన్ని భారతీయ భాషలకు ఒక స్టాండర్డ్‌గా చేసేందుకు ఇస్కీ - ISCII- ఇండియన్ స్టాండర్డ్ కోడ్ ఫర్ ఇన్ఫర్మేషన్ ఇంటర్చేంజ్ అనే సంస్థ ఏర్పడి కొన్ని స్టాండర్డ్‌లను చేర్చింది కానీ అలాంటి స్టాండర్డ్‌లు ఉత్తరభారత భాషలపై ఎంత మమకారంతో ఉంటాయంటే ఎ-ఏ తేడా లేకుండా ఈ స్టాండర్డ్ చాలా రోజులు నడిచింది. అంటే టెస్ట్‌కి టేస్ట్‌కి తేడా ఉండదు. తొలి-తోలికి తేడా లేదు.

విభజనకు ముందున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశీయంగా ఉన్న ఈ ఇస్కీలో సంస్కరణలు తేవడానికి ఎలాంటి కృషి చేసిందా అన్నది మనకు తెలియని విషయం. కానీ యూనికోడ్ కన్సార్టియంలో సభ్యత్వం తీసుకోడం మాత్రం ఒక మంచి చొరవ.

తద్వారా ప్రభుత్వం నుండి జరగాల్సిన కొన్ని పనులు జరిగాయనే చెప్పాలి. నేడు మిగతా భారతీయ భాషలతో పోలిస్తే గూగుల్ సేవలలో తెలుగు కొంచెం మెరుగ్గానే ఉంది.

ప్రభుత్వ పరంగా ప్రభుత్వం చెయ్యాల్సిన పనులకు ప్రభుత్వాన్ని ప్రోత్సహిస్తూ తెలుగు పౌరులుగా మనం నెరవేర్చాల్సిన పనులు మనం నెరపుదాము. ❊

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి రెండు ఉత్తర్వులు

తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్సవ వేదికపై నుండి ప్రకటించిన వాగ్దానాల అమలుకై ఉద్దేశించి, రెండు ఉత్తర్వులను ది.14-9-2016న జీవో నెం.10, 11లను జారీ చేశారు. మొదటి ఉత్తర్వు తెలుగు అభివృద్ధి ప్రాధికార సంఘాన్ని చట్టపరంగా ఏర్పాటు చేయడం కోసం ఇవ్వగా, రెండవ ఉత్తర్వు శిలాఫలకాలపైనా, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ సంస్థల, అంగళ్ళ పేరు పలకలపైనా తెలుగులో తప్పనిసరిగా, ప్రధానంగా వ్రాయడం గురించి ఇచ్చారు. ఆ రెండు ఉత్తర్వుల పూర్తిపాఠం ఈ క్రింద ఇస్తున్నాము. ప్రాధికార సంఘం ఏర్పాటు భాషోద్యమకారులు చిరకాలంగా చేస్తున్న డిమాండు. నిజానికి, తెలుగు భాషోద్యమ సమాఖ్య 2012 డిసెంబరులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వం ముందుంచిన తొమ్మిది నిక్కచ్చు(డిమాండు)ల్లో తొలి అంశంలో భాగం. తెలుగు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పరచాలని, అందులో భాగంగా తెలుగు అభివృద్ధి ప్రాధికార సంఘాన్ని అంటే తెలుగు డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని భాషోద్యమకారుల డిమాండు. అయితే నేతలు మంత్రిత్వశాఖను మాత్రం ఏర్పాటు చేసి దానికి ప్రాణావసరమైన ప్రాధికార సంఘాన్ని పక్కనపెట్టారు. ఇన్నాళ్ళకైనా ఇప్పటి ప్రభుత్వమైనా ఈ దిశగా ముందుకు అడుగు వేసినందుకు సంతోషపడుతున్నాం. త్వరలో ఈ ప్రక్రియను పూర్తి చేసి ప్రాధికార సంఘాన్ని ఆచరణలోకి తెస్తారని ఆశిస్తున్నాం. -సం

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

సంక్షిప్తి

**అధికార భాష - తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధి కొరకు అధ్యయన కమిటీ ఏర్పాటు ఉత్తరువులు జారీ.**

**యువజన అభ్యుదయ పర్యాటక మరియు సాంస్కృతిక (అ.భా) శాఖ**

జి.ఓ.ఎంఎస్.నెం.10 తేదీ : 14.09.2016

ఉత్తర్వు :

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయవాడ దుర్గ ఘాట్ కేంద్ర కంట్రోల్ సెంట్రల్‌లో చర్చించిన సమావేశంలో మరియు ముఖ్యమంత్రివర్యులు తేది: 29-08-2016న విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా తెలుగు భాషా సంస్కృతి అభివృద్ధి కొరకు అధ్యయన కమిటీ ప్రకటించారని తెలిపారు. కమిటీ నెల రోజులలో నివేదిక సమర్పించవలసి వుంది. మరియు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ నామ ఫలకాలు తప్పనిసరిగా తెలుగులో ఉంటాయని ప్రకటించారు.

2. ప్రభుత్వం పై అంశాన్ని ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించిన తరువాత ఈ క్రింది సభ్యులతో, భాషా సాంస్కృతిక అభివృద్ధి అధ్యయన కమిటీ ఏర్పాటుకు ఆదేశించడమైనది.

1. గౌ॥ శ్రీ పల్లె రఘునాథరెడ్డి, భాషా సాంస్కృతిక శాఖామాత్యులు-ఛైర్మన్, 2. గౌ॥ శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఉపసభాపతి, శాసనసభ-సభ్యులు, 3. గౌ॥డా॥ పరకాల ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు-సభ్యులు, 4. డా॥ నాగులాపల్లి శ్రీకాంత్, ప్రభుత్వ కార్యదర్శి, సాంస్కతిక శాఖ-సభ్యులు, 5. డా॥ జి.వి.రామకృష్ణారావు, పురావస్తు శాఖ సంచాలకులు-సభ్యులు, 6. డా॥ డి.విజయభాస్కర్, భాషా సాంస్కతిక శాఖ సంచాలకులు-సభ్య కార్యదర్శి

3. ఈ కమిటీ క్రింది విషయాలను అధ్యయనం చేసి, నెలరోజులలోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించవలెను.

I) సంస్థాగత నిర్మాణం మరియు చట్టాలు:

అ) ప్రస్తుతం వున్న అధికార భాష చట్టం స్థానంలో తెలుగు భాష అభివృద్ధి అధికార భాష అమలుకు తెలుగు భాష ప్రాధికార సంస్థ చట్టం.

ఆ) పురావస్తు శాఖ మరియు ప్రాచీన భాండాగారానికి సంబంధించిన సంస్థాగత ఏర్పాటు.

ఇ) సాంస్కృతిక శాఖకు సంబంధించిన సంస్థాగత నిర్మాణం.

ఈ) ప్రస్తుతం వున్న సంస్థల పునర్వ్యవస్థీకరణ.

2. విభజన చట్టానికి సంబంధించిన సంస్థల విభజన (తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ)
3. విద్యా రంగంలో తెలుగు బోధించడానికి కార్యాచరణ ప్రణాళిక.
4. పాలనా రంగంలో పూర్తిస్థాయిలో తెలుగు వాడకాన్ని అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక.
5. సమాచార సాంకేతిక రంగంలో తెలుగు వినియోగంలో సిఫారసులు.
6. ప్రాచీన భాషా కేంద్రం ఏర్పాటుపై సిఫారసులు
7. ఇతర రాష్ట్రాలు, దేశాలలో తెలుగువారి భాషా/సంస్కృతి పరమైన సమస్యలపై సూచనలు.
8. తెలుగు, సంస్కృతి అభివృద్ధి చెయ్యడానికి చేపట్టవలసిన కార్యక్రమాలు మరియు కార్యాచరణ ప్రణాళిక.

(ఆంధ్రప్రదేశ్ గవర్నరు గారి ఉత్తర్వుల మేరకు వారి పేరిట)

నాగులాపల్లి శ్రీకాంత్

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పూ.అ.బా), సాంస్కృతిక శాఖ

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

సంక్షిప్తి

**అధికార భాష - తెలుగు భాష, శిలా ఫలకాలు, శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవ నామ ఫలకాలు తప్పనిసరిగా తెలుగులో ఉండేలా ఆదేశాల గురించి - ఉత్తరువులు జారీ.**

**యువజన అభ్యుదయ పర్యాటక మరియు సాంస్కృతిక (అ.భా) శాఖ**

జి.ఓ.ఎంఎస్.నెం.11 తేదీ : 14.09.2016

ఉత్తర్వు :

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయవాడ దుర్గ ఘాట్ కేంద్ర కంట్రోల్ సెంట్రల్‌లో చర్చించిన సమావేశంలో మరియు ముఖ్యమంత్రివర్యులు తేది: 29-08-2016న విజయవాడలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో జరిగిన తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా తెలుగు భాషా సంస్కృతి అభివృద్ధి సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ నామ ఫలకాలు తప్పనిసరిగా తెలుగులో ఉంటాయని ప్రకటించారు.

2. పై అంశాన్ని ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించిన తరువాత ఈ క్రింది ఆదేశాలను జారీ చేసింది.

I) పట్టణాలు/నగరాలలో దుకాణాలు, సముదాయాల పేర్లన్నింటిని తప్పనిసరిగా తెలుగులో రాయించుట అమలు పరచవలసిందిగా లేబర్ కమీషనర్ మరియు వాణిజ్య పన్నుల శాఖ కమీషనరును ఆదేశించడమైనది.

II) ప్రభుత్వ పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ నామ ఫలకాలు తప్పని సరిగా తెలుగులో ఉండవలెనని ప్రభుత్వ శాఖలను మరియు శాఖాదిపతులను ఆదేశించడమైనది.

(ఆంధ్రప్రదేశ్ గవర్నరు గారి ఉత్తర్వుల మేరకు, వారి పేరిట)

నాగులాపల్లి శ్రీకాంత్

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (పూ.అ.బా), సాంస్కృతిక శాఖ

(త్రి. చూ)



-డా॥సంకేపల్లి నాగేంద్రశర్మ

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాషా విధానాన్ని ప్రకటించాలి

## నిజామాబాదు సదస్సులో డిమాండ్!

నిజామాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర భాషా విధానాన్ని ప్రవేశపెట్టాలని నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 7న జరిగిన తెలుగు భాషా పరిరక్షణ సమితి సదస్సు డిమాండ్ చేసింది. తెలుగు భాషా విధానంపై నిజామాబాద్ జడ్.పి.హాలులో జరిగిన, చర్చాగోష్ఠిలో పలువురు తెలుగుభాషా సాహితీవేత్తలు, రచయితలు, మేధావులు, సామాజికవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని, మాతృభాషపైన, తెలుగు పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సదస్సు తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు 'జయంతి' సంపాదకులు శ్రీ వెలిచాల కొండలరావు చొరవతో ఏర్పాటయింది.







రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రాథమికస్థాయి బోధన తెలుగు, ఆంగ్ల మీడియంలలో జరగాలని సభలో పాల్గొన్న విద్యావేత్తలు సూచించారు. ఆంగ్లభాష మోజుతో కార్పొరేటీకరణ ప్రభావం శృతిమించిపోయిందని, ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థలో మాతృభాష పరిరక్షణ సమస్య కారాదని, ఇందులకై కేంద్రం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి సమగ్ర భాషావిధానాన్ని రూపొందించాలని చర్చాగోష్ఠిలో పాల్గొన్న తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.సాంబయ్య, ఈ విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆర్.లింబాద్రి, ప్రొ॥లక్ష్మణమూర్తి, డా॥వి.త్రివేణి, జడ్‌పి ఛైర్మన్ దఫేదార్‌రాజు, మేయర్ ఆకుల సుజాత, తెలుగు భాషావేత్తలు డా॥వెల్చాల కొండలరావు, డా॥అంపశయ్య నవీన్, సీనియర్ జర్నలిస్టు సిహెచ్.రాజేశ్వరరావు, ప్రొ॥టి.కిషన్‌రావు, ఆచార్య సి.మృణాళిని, డా॥కాలువ మల్లయ్య, డా॥వి.రాంమోహనరావు, ఇ.శివరామకృష్ణ, డా॥కోదండరామారావు, డా॥జి.బాల శ్రీనివాసమూర్తి, కందుకూరి యాదవరావు, డా॥ ఆయాచితం కోటేశ్వరశర్మ, కరీంనగర్ పారామిత విద్యాసంస్థల అధినేత ప్రసాదరావు, వి.పి. చందన్‌రావు, ఘనాపురం దేవేందర్, కందకుర్తి ఆనంద్ తదితరులు డిమాండ్ చేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు, తెలంగాణ కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, మహిళా విభాగ కార్యదర్శి పూదోట శౌరీలు, రచయిత్రి కాట్రగడ్డ భారతి, పాత్రికేయుడు ఎస్.నాగేంద్రశర్మ పాల్గొన్నారు.

సి.బి.ఎస్.ఇ.సిలబస్‌లో తెలుగు రాష్ట్రాలలో ప్రాథమిక విద్య ప్రయివేట్ రంగంలో ఆంగ్లమీడియంలోకి వెళ్ళిపోయిందని, తెలంగాణలో కొత్తగా పెడుతున్న 250 గురుకులాలలో ఆంగ్ల మీడియాన్ని ప్రవేశపెట్టి, మాతృభాష అయిన తెలుగుకు గండికొడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో సరైన భాషా విధానం లేకపోవడం వల్ల అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని, పార్లమెంటులో విద్యా, భాషావిధానాలపై జరిగే చర్చల్లో తెలుగు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు చురుకుగా పాల్గొని, తమ వాణిని వినిపించాలని సదస్సుకు అధ్యక్షత వహించిన విద్యావేత్త డా॥చుక్కా రామయ్య, ముఖ్య అతిథిగా హాజరైన తెరాస ఎంపి కె.కవితను ఉద్దేశించి అన్నారు. జాతీయోద్యమ కాలం నాటి నుండి మాతృభాషలోనే ప్రాథమికస్థాయిలో బోధన జరుగుతున్నదని, బోధనామాధ్యమం విషయమై స్పష్టమైన నిర్ణయం రావాలని ఆయన ఉద్బోధించారు. భాషా విప్లవాలు వచ్చే కాలం ఆసన్నమైందని సదస్సులో మాట్లాడిన పలువురు భాషావేత్తలు హెచ్చరించారు.

మన రెండు తెలుగు రాష్ట్రాలలో మాతృభాషకు పెద్దఎత్తున 'ద్రోహం' జరుగుతోందని పాలకులతోపాటు, ప్రజల ఆలోచనల్లో మార్పులు రావాలని, మాతృభాషాపరిరక్షణకై ఉద్యమాలు వెల్లువెత్తడానికి, ప్రజల్లో చైతన్యం తీసుకొని రావడానికై తాము ప్రతి జిల్లా కేంద్రాలలో భాషావిధానంపై చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నట్లు తెలుగు భాషాపరిరక్షణ సమితి కన్వీనర్ డా॥వెల్చాల కొండలరావు అన్నారు.

ఉమ్మడి జాబితాలో ఉన్నతవిద్య చేరి వుండటం వల్ల మాతృభాషలకు పెద్ద అడ్డంకిగా మారిందని, పాఠశాల విద్యావిధానం ఆయారాష్ట్రాల పరిధిలోనే వుండాలని, ప్రయివేటు స్కూళ్ళకు ఆంగ్లమాధ్యమం సంపాదనామార్గంగా మారిందని, సి.బి.ఎస్.సి సిలబస్‌లో బోధనామాధ్యమం విధానంలో మార్పులు రావాలని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు భాషావిధానంలో సమన్వయలోపంవల్ల ఎంతో నష్టం జరుగుతోందని కె.జి.టు పి.జి.వరకు కోర్సుల్లో మాతృభాషా మాధ్యమానికి స్థానం లేకుండా నష్టం జరుగుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.

వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రాలలో తెలుగు బోధనావిధానాలపై జరిగిన చర్చాగోష్ఠులు ఎంతో సంతృప్తి నిచ్చాయని, టి.అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, కరీంనగర్ ఎంపి బి.వినోద్‌కుమార్, రాష్ట్ర ఆర్థిక-పౌర సరఫరాశాఖల మంత్రి ఈటెల రాజేందర్, మాజీ వీసీ ఆచార్య శివారెడ్డి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్వీ రామారావు, మహబూబ్‌నగర్ వీసీ ప్రభాకరరావు, ప్రొ॥గారపాటి ఉమామహేశ్వరరావు, ప్రొ॥కోవెల సుప్రసన్న తదితరులు ఈ చర్చాగోష్ఠిలో పాల్గొని మాతృభాషా పరిరక్షణ జరిగి తీరాల్సిందేనని నొక్కి వక్కాణించారని చర్చాగోష్ఠుల

(తరువాయి 29వ పేజీలో)

బయటి తెలుగు బతుకు కతల మాలిక-5



# ఓ సంచారి అంతరంగం

కుప్పె నాగరాజు గారు
కన్నడంలో రచించిన
'అలెమారియ అంతరంగ'కు
రంగనాథ రామచంద్రరావు
(9059779289) గారి
తెలుగు అనువాదం

## అగ్ని పరీక్ష

ఆ ఏడు నేను ఏడవ తరగతికి వచ్చాను. మా మాస్టారు మాకు ఇంగ్లీషు గ్రామర్ బోధించేవారు. ఏడవ తరగతి పబ్లిక్ పరీక్షలు కావటం వల్ల బేసిక్ గ్రామర్ నేర్చుకోవాల్సిన అవసరం ఉండేది. ఆ రోజుల్లో ఇంగ్లీషు వ్యాకరణం మూలపాఠాన్ని నేర్చుకోవటం అటు తరువాత నాకు చాలా ఉపయోగపడింది. అటు తరువాత హైస్కూల్లోనూ మా మాస్టారు బోధించిన స్థాయిలో మరెవరూ ఇంగ్లీషు గ్రామర్ భోధించలేదు. ఏడవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయడానికి మేము హుణసూరుకు వెళ్ళాలి. మా పరీక్షా కేంద్రం హుణసూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల. అప్పట్లో అది తహసీల్దారు పాత కార్యాలయం పక్కన ఉండేది. మా ఆశ్రమ పాఠశాల నుంచి సుమారు ఎని మిది, పదిమంది విద్యార్థులం ఆ పరీక్షలు రాయడానికి ప్రతి రోజూ హుణసూరుకు వెళ్ళాలి. హుణసూరు నుంచి నల్లూరుపాల సుమారు ఎనిమిది, తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతి రోజూ హుణసూరుకు వెళ్ళిరావడానికి వ్యాను, బస్సు సౌకర్యాలు ఉండేవి. కానీ నా దగ్గర బస్సులో వెళ్ళిరావడానికి డబ్బులు ఉండేవి కావు. రోజూ బస్సు ఛార్జీ చెల్లించి బస్సులో ప్రయాణించటానికి నాకు సాధ్యం కాదు. ప్రతీ రోజు పరీక్ష ఉదయం 10 గంటలకు ఉండేది. నేను ఉదయమే తొందరగా హాస్టల్లో భోజనం ముగించి 8 గంటలకు నల్లూరుపాల నుంచి బయలుదేరేవాడిని. నడుస్తూ, పరుగెడుతూ పరీక్షా సమయానికి సరిగ్గా పరీక్షా కేంద్రానికి చేరుకునేవాడిని. నా తోటి విద్యార్థులు రోజూ బస్సులో వెళ్ళి వచ్చేవారు. నాకు కనీసం బస్సు ఛార్జీ చెల్లించి బస్సులో వెళ్ళి రావడానికి సాధ్యం కాదు కదా అని అనేక సార్లు మనస్సుకు బాధ కలిగేది. అయితే ఇంటి ఆర్థిక పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండటంతో నేను తప్పనిసరిగా నడచి వెళ్ళాల్సి వచ్చేది. ప్రతీరోజు నడుచుకుంటూ హుణసూరు చేరి పరీక్షలు రాసి మళ్ళీ కాలినడకనే హాస్టలకు సాయంత్రానికి చేరేవాడిని. పరీక్ష జరిగినన్ని రోజులూ అలాగే చేశాను. తల్లితండ్రులను డబ్బుల కోసం పీడించలేదు.

ఆ రోజు రానే వచ్చింది. గడిచిన అయిదేళ్ళ నుంచీ అన్నం పెట్టి, విద్యను అందించి, ఆశ్రయమిచ్చి నా జీవిత చిత్రాన్నే మార్చిన ఆ పవిత్రమైన పాఠశాలకు వీడ్కోలు చెప్పాల్సి వచ్చింది. ఆ రోజు మాకు పాఠశాల నుంచి వీడ్కోలు చెప్పటానికి ఒక చిన్న సమావేశం ఏర్పాటు చేశారు. ఆ పాఠశాలలో మేమే ఏడవ తరగతి ముగించి బయటికి వెళుతున్న మొదటి బ్యాచ్ విద్యార్థులం. మా శివణ్ణ మాస్టారు ఆ రోజు ఒక ఫోటోగ్రాఫర్‌ను పిలిపించి మా గ్రూప్ ఫోటో తీయించి మాకందరికి మంచి జరగాలని ఆశీర్వదించారు. ఆ రోజు తీయించిన గ్రూప్ ఫోటోను నేను తీసుకోలేకపోయినందుకు నాకు ఇప్పటికీ బాధగా ఉంది. పరీక్షలన్నీ ముగిసి, విద్యార్థులంతా వేసవి సెలవులకు తమ తమ ఊళ్ళ వైపు బయలుదేరారు. నేను కూడా పాఠశాల మొత్తం సిబ్బందికి, నా సహాధ్యాయులందరికీ వీడ్కోలు చెప్పి బయలుదేరటానికి నా పెట్టె సర్దుకున్నాను. మాస్టారుగారి శ్రీమతిగారైన లలితమ్మగారికి నేను ఊరికి వెళుతున్న విషయం చెప్పి, వాళ్ళు ఇన్నాళ్ళు నాకు ఇచ్చిన సహకారానికి, నన్ను తమ్ముడికన్నా ఎక్కువగా చూసుకున్న ఆ మాతృహృదయానికి నా నమస్కారాలు చెప్పటానికి ఆ రోజు రాత్రి వారింటికి వెళ్ళాను. మరుసటి రోజున నేను ఊరికి వెళుతున్న విషయాన్ని ప్రస్తావించాను. మాస్టారుగారి భార్య, "లేదు, నీవు ఊరికి వెళ్ళకు, నా వెంబడి మా పుట్టింటికి రా, అక్కడి నుంచి మీ ఊరికి వెళ్ళొచ్చు. మా వాళ్ళు నిన్ను చూడాలనుకుంటున్నారు. మర్నాడు మనం మండ్యకు వెళదాం" అని అన్నారు. నేను మారు మాట్లాడకుండా ఒప్పుకున్నాను.

ఏడవ తరగతి పరీక్ష రాసి ఆ ఆశ్రమపాఠశాల అన్నం ఋణం తీరిపోయి నేను ఊరికి తిరిగొచ్చాను. తరువాత ఏమిటి? ఎలా? అనే విచారం కానీ, నా ముందు ఎలాంటి చిన్న కల్పన కానీ గురి గమ్యం కానీ ఉండలేదు. భవిష్యత్తు గురించి ఆలోచించే వయసు కూడా నాకుండలేదు. హాస్టల్‌లో ఎలాంటి చింత లేకుండా దొరుకుతున్న రాత్రి భోజనం, మధ్యాహ్నం ఇస్తున్న అమెరికా నుంచి వస్తున్న "కేర్ ఫుడ్". ఇకపై ఎక్కడ దొరుకుతుంది అలాంటి ఆతిథ్యం? ఆ కారణంగా ఇంటికి వచ్చిన వెంటనే నన్ను పట్టి పీడిస్తున్న చింత పొట్ట గురించే ! హాస్టల్‌లో లభిస్తున్నట్టు ఇంట్లో భోజనం దొరికేది కాదు! ఒక రోజు భోజనం ఉంటే మరొక రోజు ఉపవాసం ఉండాల్సి వచ్చేది!

## నాన్న హస్తకౌశలం

కోతల కాలంలో పల్లెపల్లెలను తిరిగి పోగు చేసిన ధవస ధాన్యాలు తొలకరి వర్షాలు మొదలయ్యేవరకు సరిపోయేవి. నాలుగు చుక్కలు భూమి మీద పడగానే రైతులు పొలం, ఇంటి పనుల్లో నిమగ్నమయ్యేవాళ్ళు. ఆ సమయంలో పల్లెలో జనం దొరికేవాళ్ళే కాదు. జోలె నిండకపోతే మా కడుపులు నిండేవి కావు. తొలకరి వానలు ప్రారంభమైనపుడు నాన్న తన జోలెను మూలన పడేసేవాడు.

కావలసినంత వర్షం కురిసి, చెరువులు, వాగులు నిండుతుండగా, కొత్త నీరొచ్చి చేపలు, పీతలు కొట్టుకొచ్చేవి. ఆ సమయంలో రైతులు చేపలను వేటాడేవారు. కొత్త వలలను అల్లటంలో, చిరిగిపోయిన వలలను మరమ్మత్తు చేయటంలో నాన్న సిద్ధహస్తుడు. ఈ పనులకు చాలా గిరాకీ ఉండేది. చుట్టుపక్కల ఉన్న అనేక పల్లెల్లో నాన్నను ఈ పనులకు పిలిచేవాళ్ళు. ఒక ఊరికి వెళితే పరిచయస్థుల ఇంటి అరుగుమీద నాన్న తన సామాను సరంజామా సమేతంగా మకాం పెట్టేవాడు. ఆ ఊళ్ళోని చిరిగిపోయిన వలలన్నీ ఈయన కూర్చున్న అరుగు మీద రాసులుగా పడేవి. నాన్న ఆ వలలను పరిశీలించి చిరిగిన వాటిని ఒక క్రమపద్ధతిలో కత్తిరించి దానికొక ఆకారమిచ్చి ఆ భాగాలను కొత్తగా అల్లి మరమ్మత్తు చేసేవాడు. ఆ వలలూ చిత్ర విచిత్రంగా ఉండేవి. ఒక దానికి కింది మట్టిపూస, దానికి కూర్చిన లావాటి దారం తెగివుంటే, మరొకదానికి పైభాగపు బెండుకున్న దారం తెగిపోయి ఉండేది. ఇలా రకరకాలుగా తెగిపోయిన, చిరిగిపోయిన వలలను క్రమబద్ధంగా దాని పొడవు, వెడల్పులలో తేడా రాకుండా నాజూకుగా పునఃసృష్టి చేయడంలో నాన్న తల ప్రాణం తోకకొచ్చేది.

ఈ తెగిపోయిన వలలను మరమ్మత్తు చేయడానికి మునుపు తగినంత పూర్వ సిద్ధతలను నాన్న చేసుకునేవాడు. వేరు వేరు కొలతల కండెలను (దారాలను చుట్టుకునే సాధనం), దారాన్ని పురి చేసుకోవడానికి కావలసిన ఉడుకుబిల్ల, వల కంటి కొలతలకు సరిపడా 1 నుంచి 4 అంగుళాల వరకు రకరకాల కొలతల వెదురు బద్దలు, వల కింది భాగానికి అమర్చే మట్టిపూసలు, నీళ్ళల్లో వల మునగకుండా పైభాగాన కూర్చుతున్న బెండులు, కత్తిరించటానికి కావలసిన పదునైన కత్తి- వీటన్నిటిని తన వెంబడి తీసుకుని వెళ్ళేవాడు.

వలకు కావలసిన మట్టిపూసలను, బెండులను స్వయంగా తానే చేసుకునేవాడు. మృదువైన బంకమట్టిని తెచ్చి నీటిలో కలిపి, చక్కగా పిసికి చిన్నచిన్న గోళాకారపు ఉండలుగా చేసి, ఆ ఉండల మధ్య ఒక చిన్న వెదురు కడ్డీతోనో లేదా ఇనుప మేకుతోనో రంధ్రం చేసి వాటిని పొయ్యిలో పెట్టి బాగా కాల్చేవాడు. ఇలా కాలిన ఉండల్లాటి పూసలు నీళ్ళల్లో మునిగినా కరిగేవి కావు. వలపై భాగాన ఉపయోగిస్తున్న బెండులను సామాన్యంగా బూరుగచెట్టు కొమ్మల నుంచి తయారుచేసుకునేవారు. వాటి కొమ్మలను పొలం పక్కని అడవులు, పచ్చికబయలు తిరిగి తెచ్చేవాడు. రెండు నుంచి మూడు అంగుళాలు పొడవున కత్తిరించుకుని దాని లోపలి గుజ్జును తీస్తే దారం కూర్చటానికి కావలసిన రంధ్రం ఏర్పడేది. ఇలా కత్తిరించి గుజ్జు తీసిన బెండులను



ఎండలో బాగా ఆరబెట్టి సంచిలో నింపి పెట్టుకునేవాడు.

ఇంకా వలకు కావలసిన దారాన్ని తయారు చేసుకోవడం కూడా నైపుణ్యంతో కూడిన పని. నాన్నకు గాంధీతాత గురించి తెలుసో తెలియదో కానీ ఆయనలాగే నాన్న చరఖా ఉపయోగించేవాడు. మా గుడిసె మూలలో దానికొక చోటు ఉండేది. నాన్న అంగడి నుంచి తెచ్చిన నూలును ఆ చరఖాను చుట్టి తనకు కావలసిన ప్రమాణంలో దారపు పోగులను రాట్నం తిప్పి విడదీసుకునేవాడు. ఇలా విడదీసిన దారపు పోగులను మరొక మొరటైన వెదురు కర్రకు చుట్టుకునేవాడు.

ఉదుకుబిల్లను ఉపయోగించి ఈ దారాన్ని పేనటమనే ప్రక్రియ కూడా కళాత్మకంగా ఉండేది. ఉదుకుబిల్ల కొక్కికి దారపు పోగులను చిక్కించి వేలాడబడిన పంచెను పైకి లాక్కుని ఆ ఉదుకుబిల్లను తొడ పై భాగాన పెట్టుకుని అరచేత్తో పేనితే అది గిరగిరా తిరిగుతూ పురులు తిరిగేది. పురితిరిగిన దారాన్ని వేరువేరు కొలతలుగల కండె లకు చుట్టుకుని వలలు అల్లేవాడు. ఉదుకుబిల్లతో దారాన్ని తీసే పని కూర్చుని చేసేటటువంటిది కాదు. తిరుగుతూ పేనాల్సి వచ్చేది. తాము ఎక్కడైనా ప్రయాణమై బయలుదేరినపుడో, పల్లెలలో తిరుగు తున్నప్పుడో ఈ పని చేసుకునేవాడు. నేను కుతూహలంతో ఆయనలా దారాన్ని పేనటానికి ప్రయత్నించి, దారమంతా ముడులుపడి నాన్న చేత తిట్లు దెబ్బలు తినేవాడిని. మా అన్న మాత్రం వీటన్నిటి గురించి తల పాడుచేసుకోకుండా రైతులతో కలసి మేకలు, గొర్రెలు, పశువు లను మేపటానికి బయలు ప్రాంతానికి తీసుకెళుతూ, పొలం, ఇంటి పనులు నేర్చుకోవటంలో ఆసక్తి వహించేవాడు. ఈ పనులలో తల్లి తండ్రుల చేతులూ కలిసేవి. మా సముదాయంలోని చాలామంది సామాన్యంగా వర్షాకాలంలో ఈ పనులు చేసేవారు. దాంతోపాటు పాతగొడుగులు, తాళాలు, హార్మోనియం మొదలైనవాటిని రిపేరీ చేసేవారు. ఆడవాళ్ళు గాజుల వ్యాపారం చేస్తే, కొందరు మగవాళ్ళు ఫోటోల రిపేరీ చేస్తూ జీవనాన్ని సాగించేవారు.

## అమ్మ బాధ్యత

అక్కడ నాన్న ఏదో ఊళ్ళో ఎవరి అరుగు మీదనో పాత వలలు రిపేరీ చేస్తూ వారాలు పొడవునా ఇంటి వైపు తిరిగి చూడ కుండా తన వృత్తిలో నిమగ్నమైవుంటే, ఇక్కడ అమ్మ మట్టి కుండల అడుగుకు చేరిన రాగినో, వడ్లనో విసరి కడుపుకు ఆధారం చేసేది. కుండలు ఖాళీ అవుతున్నట్టే అమ్మకు పిల్లల కడుపులు నింపాల్సిన చింత వేధించేది.

తొలకరి వర్షపు జల్లు వల్ల భూమాత పచ్చదనంతో కళ కళలాడుతున్నట్టే పొలాల, కంచెల పక్కన ఆకులు అలమలు పెరిగి నుంచునేవి. అమ్మ అక్కడంతా తిరిగి ఆకుకూరలు కోసుకుని తన కొంగు నింపుకుని తెచ్చి శుభ్రం చేసి ఉడికించేది. వేగిన ఆకుకూరను రోట్లో వేసి రుబ్బి దానికి పావో, పడినో రాగిపిండి కలిపి రొట్టెలు చేసి పెట్టేది. ఇవి మా జఠరాగ్నిని కొంతవరకు శాంతపరిచేది. కొన్ని సార్లు ఆకుకూరలతోపాటు అలసంద గింజల్ని ఉడికించి దాని మీద ఉప్పు చల్లి ఇచ్చేది. నాకు ఆ ఆకు కూరలంటే వాంతికొచ్చేది. దాంతో నేను ఆ కూరను వదలి కేవలం గింజలను ఏరుకుని తినేవాడిని.

అమ్మ గుణవల్లనో, నాన్నపట్ల ఆ ఊరివారికి ఉన్న అభిమానం వల్లనో అమ్మ వెళ్ళి అడిగితే ఊరివాళ్ళు రాగులో, అలసందలో అప్పుగా ఇచ్చేవాళ్ళు. ఈ సమయంలో అమ్మ చీరకొంగు పట్టుకుని నేనూ, నా తమ్ముడు వెళ్ళేవాళ్ళం. అమ్మ వాళ్ళ ఇళ్ళల్లో ఏదైనా చిన్నాచితక పని అంటే గింజలు విసరటం, రాగులు చెరిగి శుభ్రం చేయటం వంటి పనులు చేసిపెట్టేది. మా ఆకలి ముఖాలు చూసి వాళ్ళు మాకు ఏదైనా తినటానికి రొట్టెనో, రాగిముద్దో పెట్టేవారు. మేము తినేవాళ్ళం. అయితే అమ్మ మాత్రం అలా వాళ్ళు ఇచ్చింది తను తినేది కాదు. మాకే పెట్టేది. రాగులు తెచ్చి విసరి వంట చేసి మా అందరికీ పెట్టి తను తినేది. నాన్న ఇల్లు వదలి వారం అయినా ఇటువైపు తిరిగి చూడలేదు. మా నలుగురి పిల్లల కడుపులు నింపడానికి అమ్మ ఇలా తీవ్ర ప్రయత్నాలు చేసేది.

మాతోపాటు ఉన్న దాసరుల కుటుంబాల పరిస్థితి కూడా ఇంతే. అందువల్ల ఎవరూ ఎవరికీ సహాయం చేసే స్థితిలో ఉండలేదు. ఆ రోజు తెల్లవారుతుండగా నన్ను, అన్నను వెళ్ళి నాన్నను చూసుకుని ఒకిన్ని ధవసధాన్యాలు ఉంటే తీసుకుని రండని అమ్మ అంది.

## నాన్నను వెదుకుతూ...

పొద్దుపొడవటానికి ముందే నన్ను, అన్నను లేపింది. అప్పు డప్పుడే సూర్యుని కిరణాలు భూమిని స్పర్శిస్తున్నాయి. మేమిద్దరం చెరువు గట్టు వెంబడి మా ప్రయాణం సాగించాం. తొలకరి వర్షం సమృద్ధిగా కురవటం వల్ల మా ఊరి చెరువు నిండి, పొంగి పొర్లి కాలువగా ప్రవహిస్తోంది. ఆ కాలువను దాటి మేము ముందుకు పోవాలి. కాలువలో ప్రవహించే నీళ్ళలో మేము కాళ్ళుచేతులు కడు క్కుని కాలకృత్యాలు ముగించుకున్నాం. అదే సమయంలో మా మామయ్య సల్లాపురి ముత్తయ్యగారు ఒక భుజానికి జోలెను, మరొక భుజానికి ఏకతార వేలాడదీసుకుని ఆ దారిగుండా పల్లెలకు భిక్షాటనకు బయలుదేరారు. మమ్మల్ని చూడగానే "యక్కడికి పోతావుండారు" అని అడిగారు. అందుకు మా అన్న, "యాడకు లేదు మామా, అబ్బా పోయి అప్పడే ఒక వారము అయింది. వాళ్ని సూస్కని వస్తాము అంట పోతావుండాము. అమ్మ అంపించింది" అన్నాడు. దానికి మామయ్య, "నేను ఆ తొట్నే పోతా ఉండాను. రాండి, మిమ్మలిని రంగయ్య కొప్పల్ గంట ఇడసి ముందరికి దావ్ సూప్తాను" అని మమ్మల్ని పిలుచుకుని పోయాడు. ఆ రాళ్ళుముళ్ళ దారిలో మామయ్య వెనుక మేము అడుగులు వేస్తూ ముందుకు సాగాం. రంగయ్య కుగ్రామం చేరగానే రామేనహళ్ళి, బోళనహళ్ళికి వెళ్ళే కాలిదారిని చూపించి, తమ ఏకతారను శృతి చేసుకుని రాగయుక్తంగా తాను పాడుతున్న అనేక గేయకథలలో ఒకటైన కోణవేగౌడ పదం పాడుతూ ఒక ఇంటి గుమ్మం ముందు నుంచున్నాడు. మాపాటికి మేము మామయ్య చూపించిన దారిలో ముందుకు సాగాం.

సల్లాపురి ముత్తయ్యగారిది నిండు కుటుంబం. పేదరికానికి పిల్లలెక్కువ అంటారుకదా, అలా! దేవుడి తల మీద పువ్వులు తప్పినా, మా మామయ్యకు పదాలు పాడి, భిక్ష యాచించడం తప్పేది కాదు. మా వాళ్ళు ఆడుతున్న బయలు నాటకాల్లో ఈయన ముఖ్యంగా కంసుడు, హిరణాక్ష్యుడు మొదలైన రాక్షస పాత్రలను అభినయించే వాడు. కంసుడి పాత్ర ఈయనకు ఎంతో ఇష్టమైన పాత్ర. ఈయన పాడుతున్న కోణవేగౌడ, బాలనాగమ్మ, గంగె-గౌరి మొదలైన పదాలను ఎంతగానో మెచ్చుకునే జనం ఈయనను పిలిపించుకుని, కూర్చోబెట్టి

కుని పాడించుకునేవారు.

మామయ్య చూపించిన కాలిదారిలో పొలంగట్ల ఎగుడుదిగుడు దారులలో నడుస్తూ, ఆ హొసే రామేనహళ్ళి అనే ఊరిని చేరాం. మైసూరు మహారాజు కావేరి నదికి అడ్డంగా కన్నంబాడి డామ్ కట్టించడం వల్ల సముద్రతీరానికి దగ్గరగా ఉన్న రామేనహళ్ళి జలాశయపు నీట మునిగి ఇక్కడికి స్థలాంతరం చెంది హొస రామేనహళ్ళిగా మారింది. ఈ పల్లె పక్కనే లక్ష్మణతీర్థ నది ప్రవహిస్తోంది. ఈ ఊళ్ళో నాయక (తండా) జనాంగంవారు నివసిస్తున్నారు. వీళ్ళు అన్నిరకాల వేటల్లో నిష్ణాతులు. అందులోనూ చేపల వేటంటే వీళ్ళకు ప్రాణం. నాన్న ఈ ఊరివాళ్ళకు వలలు మరమ్మత్తు చేసిస్తూ, కొత్త వలలు అల్లిపెడుతూ బాగా పరిచయమయ్యారు.

మేము ఆ ఊరు చేరుతుండగా మాకు ఎదురుగా ఎద్దుల మీద నాగలి, కాడిమానులను ఎక్కించుకుని పొలం దున్నటానికి, పొలం పనులకు వెళుతున్న రైతులు, ఉదయమే పశువుల కొట్టంలోని పేడను బుట్టలో నింపుకుని తల మీద మోసుకుని దిబ్బమీద పారవేయటానికి వస్తున్న ఆడవాళ్ళు, మగవాళ్లు, ఆ దారి ఇరువైపులా చడ్డీలు విప్పి చేతుల్లో పట్టుకుని వరుసగా దొడ్డికి కూర్చున్న చిన్నచిన్న పిల్లలు, వాటి గబ్బు వాసన–ఇవన్నీ మాకు ఎదురుపడ్డాయి. వాటన్నిటిని దాటుకుని ఆ ఊళ్ళో చొరబడ్డాం. ఆ ఊరు బాగా పెద్దది. మా నాన్న ఏ వీధిలో, ఏ అరుగు మీద కూర్చున్నాడో మాకెలా తెలుస్తుంది? ఆ వీధిలోనే భుజాల మీద నాగలి మోసుకుని వస్తున్న ఒక రైతును మా అన్న పలకరించి, "మేము కుప్పె నుంచి వచ్చిందాం. మా నాయిన ఈ ఊళ్ళో వలలు రిపేరీకి వచ్చిందాడు. ఎవరి అరుగు మీద కూర్చున్నాడో చెప్పన్నా" అన్నాడు. అతను సమాధానంగా "ఓ మీరు వలలు రిపేరీ చేసే కోడంగయ్య పిల్లలా? అదిగో ఇలాగే సూటిగా వెళ్ళి ముందు కుడివైపు తిరగండి. మారెమ్మ గుడి వీధిలో తమ్మినాయకుల ఇంటి అరుగు మీద మీ నాన్న ఉన్నాడు" అన్నాడు. అతను చెప్పినట్టే మేము ఆ దారి వెంబడి ఆ వీధి చేరాం. నాన్న ఆ ఇంటి అరుగు మీద తన చుట్టూ రిపేరీకి తెచ్చిన వలలను పరుచుకుని తన పనిలో నిమగ్నమై ఉన్నాడు.

మా ముఖాలు చూడగానే నాన్న కంగారుపడ్డాడు. ఏదో జరగరానిది జరిగివుండాలని, లేకపోతే పిల్లలు ఇంత దూరం వెదుక్కుంటూ ఎందుకొస్తారు అని అనుకుని కంగారుగా, "ఏమండబ్బా ఊరతట్టు ఏమాన తొంద్రయ్యిందా"అని అడిగాడు. అందుకు నేను, "ఏమీ లేదబ్బా, అమ్మ సూసుకుని రాండి అంట పంపింది. నెన్నటి నింక ఇంట్లో కదుపికి ఏమి ఊంద్లేదు. రాత్రికి ఉపవాసం పండుకున్నాం" అన్నాను. నాన్న చాలా బాధపడి, ప్రేమగా మా ఒళ్ళు తడివి, పక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

మాతో నాన్న మాట్లాడటం చూసిన ఆ ఇంటి యజమానురాలు వచ్చి మా గురించి విచారించి, "వీళ్ళు నీ పిల్లలా?" అని అడిగింది. నాన్న అవునన్నట్టు తలూపి, "పిల్లలు ఆకలితో వచ్చారు. తినటానికి ఏమైనా ఉంటే పెట్టండమ్మా" అన్నాడు. ఆమె "పొలానికి తీసుకుని పోవటానికి రొట్టెలు చేస్తున్నాను. మీకూ ఇస్తాను ఉండండి" అని లోపలికి పోయింది. నాన్న మమ్మల్ని అక్కడే కూర్చోబెట్టి, తాను రిపేరీ చేసిచ్చిన వారి నుంచి ధాన్యం గింజలు, డబ్బులు వసూలు చేసుకుని రావడానికి గిరాకీల ఇళ్ళకు వెళ్ళాడు. కొన్ని రాగి గింజలు, కొన్ని డబ్బులు తెచ్చాడు. అంతలో ఆ ఇంటి యజమానురాలు మాకు రొట్టె, నువ్వులపొడి, పెరుగు తెచ్చి ఇచ్చింది. నేనూ, అన్నయ్య కడుపు నిండా తిని నీళ్ళు తాగి మనస్సులోనే ఆ తల్లికి నమస్కరించాం.

ఒక చిన్న సంచిలో రాగులు, మరొక సంచిలో వడ్లు వేసి పురుకోసతో బిగించి గట్టిగా కట్టాడు. ఈ రెండు సంచులను పిల్లలమైన మేము మోసుకుని అంత దూరం వెళ్ళటం నాన్నకు సమస్యగా కనిపించింది. దానికొక పరిష్కారం కూడా ఆయనకు స్ఫురించింది. మా ఊరి గౌడల్లో కొందరికి కృష్ణపుర బయలులో కొన్ని వరిమడులు ఉన్నాయి. వాళ్ళు పొలం దున్ని, విత్తు నాటటానికి ఊరి నుంచి బండ్లు కట్టుకుని సామాను సరంజామాతో వచ్చి పొలం పనులు ముగించుకుని సాయంత్రం వెనుతిరిగేవారు. ఆ బండ్లు ఈ ఊరి దారి వెంబడి బండిదారిలో శ్యానుభోగనహళ్ళి దాటి కుప్పె చేరేది. నాన్న ఆ దారిలో వస్తున్న ఓ బండిని ఆపి ఆ బండిలో సంచులను వేసి, మమ్మల్ని ఎక్కించి పంపాడు. ఆ బండివాళ్ళు మా ఊరివాళ్ళు, మాకు పరిచయస్థులే కావటంతో మేము ఎలాంటి ఇబ్బంది లేకుండా ఊరు చేరాం.

అమ్మ పొద్దు మునిగినప్పటికీ పిల్లలు ఇంకా రాలేదని మా కోసం ఎదురుచూస్తూ కూర్చునివుంది. మేము కుప్పె ఊరు నుంచి ఆ ధాన్యాపు గింజల సంచులను మా తలల మీద పెట్టుకుని మా గుడిసెలు చేరాం. ఇంకా వారం రోజుల పని ఉండటం వల్ల నాన్న వారానికి గాని రాడని అమ్మకు చెప్పి, ఆ ఇంటి యజమానురాలు మాకు తినటానికి రొట్టె, గురునువ్వుల చట్నీ, పెరుగు ఇవ్వటం, నాన్న బండి ఎక్కించి మమ్మల్ని పంపటం, అన్నయ్య చడ్డీ జేబులో కొంచెం డబ్బులు పెట్టి దానికొక పిన్ను వేసి, అమ్మకు చూపించు, అమ్మనే విప్పుకుంటుంది, నీవు దాన్ని ముట్టకు అని చెప్పటం–ఈ అన్ని వివరాలను అప్పజెప్పాం. ఇంట్లోని ఖాళీ కుండలు రాగులతో, ధాన్యంతో నిండటం చూసి అమ్మ సంతృప్తిగా నిట్టూర్పు విడిచింది.

**(ఇంకా వుంది)**

---

**నిమాబాబాదు సదస్సు**–25వ పేజీ తరువాయి

సమన్వయకర్త ఆచార్య కె.యాదగిరి అన్నారు. దేశంలో భాషావిధానంపై విద్యావేత్తలతో ఒక కమిటీని వేయాలని, భాషపై పట్టున్న ముఖ్యమంత్రి కేసీఆర్ తెలుగుభాషా వికాసానికి పాటుపడాలని, ఒక భాషను సక్రమంగా నేర్చుకోవాలంటే, మాతృభాషలో ప్రావీణ్యం వుండి తీరాలన్నది సార్వత్రిక సత్యమని ఆంగ్లభాషా ఆచార్యులు ఎస్.లక్ష్మణమూర్తి అన్నారు.

**కేసీఆర్ డ్రీం ప్రాజెక్ట్‌లో ద్విభాషా బోధనకు సిఫారస్ :**

నిజామాబాద్ ఎంపి కె.కవిత

రాష్ట్రంలో కేజీ టు పీజీ కోర్సుల కొరకు ప్రవేశబెడుతున్న 250 గురుకులాలలో ఆంగ్లమే బోధనా భాషగా వుందని, అది సిఎం కేసీఆర్ 'డ్రీం ప్రాజెక్ట్' అని ఎం.పి.కవిత అన్నారు. నిజామాబాద్ భాషా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై, తాను మాట్లాడాక, ప్రముఖులు మాట్లాడేవరకు రెండు గంటలు సదస్సులో వుండి వక్తల అభిప్రాయాలను ఆమె శ్రద్ధగా విన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆంగ్లమాధ్యమం నడుస్తోందని, విదేశాల్లో ఉద్యోగాలకు ఈ ఆంగ్లమే మూలకందంగా వుందని, దీనివల్ల మాతృభాషకు సరైన స్థానం లభించడం లేదన్న వాస్తవంలో తప్పులేదని అన్నారు. కొత్తగా వచ్చే గురుకులాలలో ఆంగ్లంతోపాటు, తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టాలని కోరతానని, సిఎం కేసిఆర్‌కు నివేదిస్తానని చెప్పారు. పార్లమెంటులో భాషా విధానంపై జరిగే చర్చల్లో, తెలుగు భాష సంరక్షణ కోసం మాట్లాడుతానని సదస్సు నిర్వాహకులకు ఎంపి కవిత హామీ ఇచ్చారు. ❋

-డా॥నాగసూరి వేణుగోపాల్
94929 60868

# సమన్వయమూర్తి విద్వాన్ విశ్వం



(జయంతి 1915 అక్టోబరు 21-వర్థంతి : 1987 అక్టోబరు 20)

**తెలుగునాట విద్వాన్ విశ్వంగారిది ప్రత్యేకస్థానం. వీరి జీవితంలో ఉద్యమం, సాహిత్యం, జర్నలిజం ముప్పేటగా కలిసిపోయాయి. ప్రాకృతం, సంస్కృతం, ఆంగ్లం, తెలుగు భాషలను ఆకళింపు చేసుకొన్న పాండిత్యం ఆయన సొంతం. వామపక్ష ఆలోచనలనూ, భారతీయ లోచనాన్నీ కలిపి చూసిన సమన్వయవాది విద్వాన్ విశ్వం.**

ఛాందసమెరుగని సంప్రదాయవాది,
ఆవేశంలేని ఆధునికవాది,
మనసున్న మానవతావాది విశ్వం.

జీవిత చిత్రణలో, భాషలో, భావ వ్యక్తీకరణలో రాయలసీమకు ప్రాతినిధ్యం కావ్యం అనదగిన "పెన్నేటి పాట విశ్వంగారి విశేష కావ్యం. వచనాన్నీ పద్యాన్ని అనువాదాన్ని ఏకకాలంలో గొప్పగా సృజించిన సాహిత్యశిల్పి కూడా ఆయన. తెలుగు వారపత్రికల తీరును ప్రభావితం చేసిన సంపాదకుడు, పత్రికల్లోని శీర్షికలను చక్కగా మలచిన పాత్రికేయుడు.

కానీ, విద్వాన్ విశ్వం అనగానే చాలామందికి మాణిక్యవీణ కాలమ్ గుర్తుకు వస్తుంది. అలాగే ఎంతోమందికి పెన్నేటి పాట, ఒకనాడు కావ్యాలు స్ఫురించవచ్చు, ఇంకొందరికి బాణభట్టు కాదంబరి, కాళిదాసు మేఘసందేశం అనువాదాలు జ్ఞప్తికి రావచ్చు, వేదాలకు ఆయన చేసిన అనువాదాలు, మరెన్నో ఆంగ్ల రచనలకు చేసిన అనువాదాలు స్ఫురణకు రావచ్చు. అయినా, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక సంపాదకుడుగానే ఆయన సుప్రసిద్ధులు. విద్వాన్ విశ్వం మొదట సంస్కృత ప్రాకృతాలను లోతుగా అధ్యయనం చేసి తర్వాత ఉపాధ్యాయుడుగా స్థిరపడకుండా, రాజకీయ ప్రవేశం చేసి అటు తర్వాత పాత్రికేయుడుగా, సంపాదకుడుగా మన్నన పొందారు.

విద్వాన్ విశ్వం అనే పేరులో విద్వాన్ అనేది ఆయన పొందిన విద్యా సంబంధమైన పట్టా. ఆయన పాండిత్యం అంత హాయిగా, కవితాత్మకంగా కలిసిపోయి ఇంటిపేరుగా మారిపోయింది. విద్వాన్ విశ్వం పూర్తి పేరు మీసరగండ విశ్వరూపాచారి. అయితే, ఈ పేరు విద్వాన్ విశ్వరూప శాస్త్రిగానూ, విద్వాన్ విశ్వరూప శాస్తులుగానూ మనసు కొన్ని పుస్తకాల్లో పలకరించవచ్చు. అయితే, విశ్వం కొంత కాలం విశ్వరూప శాస్త్రి పేరుతో రచనలు చేశారు. విశ్వరూపాచారి, విశ్వరూపశాస్త్రి చివరకు అదృశ్యమై కులాతీతమైన, అనంతమైన 'విశ్వం' అనే పేరు స్థిరపడిపోయింది. ఆయన పుస్తకాలమీద విద్వాన్ విశ్వం అని ఉన్నా పత్రికా రచనలను చూస్తే కేవలం "విశ్వం' అని మాత్రమే ఏకరీతిగా కనిపిస్తుంది.

రాయలసీమలో కరువు పిలిస్తే పలుకుతుందని, అనంతపురం ప్రాంతంలో అయితే పిలవకపోయినా కరువు పలుకుతుందని అంటారు. అటువంటి అనంతపురం జిల్లాలోని తరిమెల గ్రామంలో 1915 అక్టోబర్ 21న జన్మించిన మీసరగండ విశ్వరూపాచారి తాత నుంచి ఎంత సంస్కృత పాండిత్యం గడించారో, అదే సమయంలో అక్కడి కఠోర సామాజిక వాస్తవాలను కూడా ఆయన ఆకళింపు చేసుకున్నారు. తల్లి లక్ష్మమ్మ తండ్రి మునిరామాచార్యులు ఆ గ్రామ సీమల్లో మద్యపాన నిషేదం, రైతు మహాసభ వంటి కార్యక్రమాలు చేసి సన్మార్గ బోధిని వంటి సంఘం నెలకొల్పి జాతీయ భావాలు ప్రజ్వలింపజేసిన మహనీయుడు. తండ్రి తన మూడవ ఏటే గతించడం వల్ల ఆ ప్రభావం విశ్వరూపాచారి మీద ఉండకపోదు. తల్లి చేతుల్లో పెరిగిన విశ్వంలో మార్దవం, లాలిత్యం ఉండడంలో ఆశ్చర్యం లేదు. విశ్వంగారు స్వగ్రామంలో, కర్నూలు, ప్రొద్దుటూరులలో పూర్తి సంప్రదాయ పద్ధతుల్లో సంస్కృత కావ్య నాటకాలంకారాలను, తర్కశాస్త్రాన్ని పఠించారు. మదరాసు విశ్వవిద్యాలయం నుంచి విద్వాన్ పట్టా పుచ్చుకున్నారు.

తరిమెల అనగానే నాగిరెడ్డి గుర్తుకు వస్తారు. నాగిరెడ్డితో ఒకే కంచం, ఒకే మంచం అనే స్థాయి మైత్రి ఉంది. వామపక్షాల సిద్ధాంతాలు, ఆలోచనలు పాదుకోవడానికి ఈ మైత్రీబంధమే కారణం కావచ్చు. అప్పట్లో వామపక్ష ఆలోచనలకు అనంతపురం ఒక కేంద్ర బిందువుగా ఉండేది. కల్లూరి సుబ్బారావు, పప్పూరి రమాచార్లు, చిలుకూరి నారాయణరావు వంటి మహనీయుల తోడ్పాటుతో విద్వాన్ విశ్వం జీవనపథం సాగింది. పాండిత్యం, ఉద్యమం, పాత్రికేయత్వం ఇదీ విశ్వం బాట. ఆ పాండిత్యం కూడా రెండు పాయలుగా మనకు

కనబడుతుంది. సంస్కృత అధ్యయనం పూర్వరంగం కాగా, వామపక్ష భావజాలం అదనంగా అమిరింది. అయితే, దేన్నీ ఏదీ కప్పివేయలేదు, లేదా అతిక్రమించలేదు. హృదయం, మేధస్సు లేదా ఆలోచన, ప్రణాళిక ఏ విధంగా ముడిపడి ఉంటాయో విద్వాన్ విశ్వంలో ప్రాచ్య పాశ్చాత్య ఆలోచనలు సదా సమ్మిళితమై ఉంటాయి. అందుకే వామపక్ష భావజాలాన్ని వివరించే వ్యాసం మహత్తరమైన శ్లోకపాదంతో ముగుస్తుంది. గోర్కీని ఎంత గొప్పగా ఆదరిస్తారో, కాళిదాసు కవిత్వాన్నీ బాణుడి వచనాన్ని అదే స్థాయిలో ఆరాధిస్తారు. విశ్వం అనగానే గొప్ప సమన్వయం మనకు తారసపడుతుంది.

ఆ సమన్వయం చాలా రకాలుగా మనం చూడవచ్చు. పాండిత్యానికి, రాజకీయానికి పొసగుతుందా? రాజకీయం, పాత్రికేయత్వంతో కలిసి సాగుతుందా? అనే విషయమే కాదు, ఆయన సాహితీ సృజనలో కూడా గద్యంతో పద్యం విభేదించలేదు, అనువాదంతో విమర్శ ఘర్షణ పడలేదు. ఆయన కావ్యం రాసినా, వ్యాసం రాసినా, నవలను అనువదించినా, పద్యాన్ని రాసినా అందులో వస్తు సమగ్రతతోపాటు శిల్ప సమైక్యత కూడా మనకు దర్శనమిస్తుంది.

ఉద్యమం, ఉపన్యాసం మాత్రమే కాకుండా మరింత లోతుగా రాజకీయాలు శాస్త్రీయ పద్ధతిలో వివరించాలని పాత్రికేయ జీవితాన్ని ఎన్నుకున్నారు. దాంతో ఉపాంగం ప్రధాన వృత్తిగా పరిణమించింది. ఫలితంగా కార్యస్థానం అనంతపురం, హైద్రాబాద్, విజయవాడ, మదరాసు, చివరగా తిరుపతి. ఇదీ ఆయన ప్రస్థానం. తన ప్రేమకొద్దీ రచన చేసినా ఉద్యోగ బాధ్యతగా రచన చేసినా అందులో ఆయన తెలుగు వాక్యానికి లేదా కవితా పాదానికి చెక్కిన నగిషీ గొప్పగానే నిలబడుతుంది. ఆయన భావానికి భాష హాయిగా సహకరించడమే కాదు మరింత అందంగా అమిరి లయను సిద్ధింపచేస్తుంది.

చివరిదాకా తన ఆలోచనలు, తన గమ్యం ఎటువంటి గందరగోళం లేకుండా సాగాయి. అదే సమయంలో చేసిన కృషి వాసి పరంగానే కాకుండా రాసి పరంగా కూడా చాలా గొప్పది. తిరుమల-తిరుపతి దేవస్థానం ప్రచురణ విభాగం ప్రధాన సంపాదకులుగా వేదాలతోపాటు మరెన్నో సంస్కృత గ్రంథాలకు సంబంధించి విద్వాన్ విశ్వం చేసిన అనువాదాలు అనుపమానమైనవి. వేలాది పేజీలుగా సాగిన ఆయన కృషి మొత్తం ఎంతో చెప్పలేని పరిస్థితి ఉంది. అలాగే దాదాపు ఐదు దశాబ్దాల పత్రికా జీవితంలో పనిచేసిన పత్రికలు చాలా ఉన్నా ఆంధ్రప్రభ వారపత్రిక సంపాదకుడుగానే 1967 నుంచి 1980 దాకా ఉన్నారు. విశ్వం"పాత్రికేయుడుగా, సంపాదకుడుగా చేసిన రచనలు ఎన్ని అని కాని, పత్రికా రూపకల్పనలో చేసిన సృజన ఎంతో నేడు బేరీజు వేయడం అంత సులువు కాదు. విద్వాన్ విశ్వం మీజాన్ పత్రికలో చేరకముందు నవ్య సాహిత్య మాల, పుస్తక, పత్రికా ప్రచురణ, ఆకాశవాణి పత్రికా నిర్వహణ, పప్పూరి రామాచార్లు సాధనలో వ్యాసరచన, భారతిలో వ్యాస ప్రచురణ వంటి పాత్రికేయ ప్రయోగాలు చేశారు. అడవి బాపిరాజుగారి "మీజాన్లో అసిస్టెంట్ ఎడిటరుగా 1945లో చేరిన విద్వాన్ విశ్వం ఎంతోకాలం అక్కడ పనిచేయలేదు. తర్వాత ప్రజాశక్తి పత్రికలో అసిస్టెంట్ ఎడిటరుగా దాదాపు మూడేళ్లు పనిచేశారు. పిమ్మట విశ్వం మదరాసుకు తరలి వెళ్లారు. అక్కడ బాలభారత్ విద్యాలయంలో సంపాదకుడుగా పనిచేసి 1952 ఆగస్టు 15న ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక ప్రారంభమైనప్పుడు ఎడిటర్ ఇన్ చార్జిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. నార్ల వెంకటేశ్వరరావుగారు ఎడిటరుగా ఉన్నా విద్వాన్ విశ్వం పూర్తిస్థాయి కార్యనిర్వాహక సంపాదకుడుగా 1959లో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక తాత్కాలికంగా ఆగేదాకా పని చేశారు. ఈ కాలంలో విద్వాన్ విశ్వం "తెలుపు-నలుపు' పేరుతో ఫీచర్ రైటింగుకు శ్రీకారం చుట్టడమే కాక తన కాలమ్‌కు ఒక స్పష్టమైన రూపు కల్పించుకోగలిగారు.

1959లో మదరాసులోనే ఆంధ్రపత్రిక దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటరుగా చేరారు. ఈ సమయంలో ఆయన 'అవీ..ఇవీ." పేరుతో శీర్షిక నిర్వహించారు. 1959లో నార్లగారు ఆంధ్రప్రభ నుంచి తప్పుకుని 1960లో విజయవాడ నుంచి ఆంధ్రజ్యోతి ప్రారంభించారు. విశ్వంగారు ఆంధ్రపత్రికలో కేవలం కొంతకాలం మాత్రమే పనిచేసి ఆంధ్రజ్యోతిలో చేరారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేస్తున్నప్పుడే 'ఇవ్వాళ' పేరుతో శీర్షికను నిర్వహించారు. మళ్లీ 1963లో ఆంధ్రప్రభ దినపత్రికకు అసోసియేట్ ఎడిటరుగా చేరారు. 1967 నుంచి ప్రారంభమైన 'మాణిక్యవీణ" 1967లో వారపత్రికకు బదిలీ అయ్యింది. ఈ మాణిక్యవీణ 1987లో విశ్వంగారు మరణించే దాకా కొనసాగింది.

దాశరథి గారికి తెలంగాణమంటే ప్రాణం లేచివచ్చినట్టు విశ్వం గారికి రాయలసీమ అంటే పంచప్రాణాలు. భాష గురించి, వ్యక్తీకరణ గురించి, మాండలిక పదప్రయోగం గురించి చర్చిస్తున్నప్పుడు ఆయన తప్పకుండా రాయలసీమ ప్రాంతపు పలుకుబడుల గురించి వివరిస్తారు. తెలుపు-నలుపులో విశ్వం భాష గురించి, పలుకుబడుల గురించి చేసిన చర్చ అప్పట్లో సాహిత్యవేత్తల్లో గొప్ప ఆసక్తిని రేపింది.

సంస్కృతంలో, తెలుగులో అమోఘమైన పాండిత్యంగల విద్వత్కవి విశ్వం. పత్రికారంగంలో కాలిడిన తర్వాత భాషా పరంగా ఎలా సామాన్యీకరింపబడింది మనకు ఆయన వ్యాసాలను క్రమంగా పరిశీలిస్తే బోధపడుతుంది. అందువల్లనే ఆయన పాండిత్యానికి, దానికి పుష్పించిన సహృదయతకు ఈ పత్రికా వ్యాసాలు పట్టుగొమ్మలుగా మనం పేర్కొనవచ్చు. నిజానికి వీటిని అధ్యయనం చేసి ఆనాటి-సామాజిక, రాజకీయ, సాహిత్య దృక్పథాలను తెలుసుకోవడంతోపాటు తెలుగు పత్రికా శీర్షికలు ఎలా పరిణమించి ప్రాభవం పొందాయో గమనించవచ్చు. అయితే ఆయన ఆ మూల అనంతపురం వాసి అనో, లేదా మరో వర్గానికో చెందిన వ్యక్తి అనో, లేదా తన ప్రాచుర్యం కోసం ప్రాకులాడని కారణంతోనో విద్వాన్ విశ్వం పాత్రికేయుడుగా, సంపాదకుడుగా తగినంత కీర్తి పొందలేదు. విద్వాన్ విశ్వం గారి తాలూకూ చిన్న వాక్యాలూ, వాక్యాల్లో అంతర్లీనంగా సాగే లయ, ఇంకా ఆయన రచనల్లో ఉండే తార్కికత, తాత్వికత ప్రేమించేను నవలలో స్పష్టంగా కనబడతాయి. ప్రేమ అనేది వైయక్తిక స్థాయిని దాటి సామాజిక స్థాయికి వెళ్ళి అవలోకిస్తే ఖచ్చితంగా సామాజిక ప్రయోజనం కోసం నిలబడాలి అని సులువుగా తెలుస్తుంది. అదే సమయంలో సమాజంలో ఉన్న అంతరాలు, అవరోధాలూ గురించి వాటితోపాటు ఉండే సమస్యలు గురించి విశ్వం చాలా వాస్తవికంగా మనకు తెలియజేస్తారు. కేవలం ఈ కారణంతోనే ఈ నవలకు సార్వత్రికత ఉంది. ఇంకో రకంగా చెప్పాలంటే ప్రేమించామని, తిరస్కరించారని చెబుతూ చంపాలనో, చావాలనో ప్రయత్నించే

వారికి ఇటువంటి నవల గొప్పగా కళ్లు తెరిపించగలదు.

రాయలసీమ గత వైభవానికి గర్విస్తూ దాన్నే స్తుతిస్తూ ఆగిపోలేదు విద్వాన్ విశ్వం, విశ్వానికి–వల్లంపాటి వెంకటసుబ్బయ్య వ్యాఖ్యానించినట్టు – ఆ కీర్తి పట్ల పలవరింతగానీ, వెర్రి వ్యామోహం కానీ లేవు. అందుకే, పెన్నేటి పాటలో ఇలా అంటారు విద్వాన్ విశ్వం –

ఇది గతించిన కథ; వినిపింతునింక
నేటి రాయలసీమ కన్నీటి పాట
కోటి గొంతుల కిన్నెర మీటుకొనుచు
కోటి గుండెల కంజరి కొట్టుకొనుచు

అని చాలా వాస్తవిక చిత్రాన్ని పాఠకులను అందిస్తారు.

స్థూలంగా పరిశీలిస్తే మాత్రాఛందస్సు, సూక్ష్మంగా గమనిస్తే పద్య సొగసు కనబడడం పెన్నేటిపాట గొప్పదనం. నిజానికి పద్యానికి మాత్రా ఛందస్సు జోడించి విద్వాన్ విశ్వం కొత్త బాట వేశారు. తిప్పతీగె, రేణుగంప, తుమ్మతోపు, చిట్టీత, తంగేడు, పల్లేరు గాయలు, గూబమూలు తీతువు, పాపరకాయలు వంటి పదప్రయోగాలతో పూర్తి సజీవచిత్రణతో విశ్వం కవిత సాగుతుంది. చాలా సాధారణమైన పదాలు పద్యంలో చేరి అలవోకగా కలిసిపోతాయి. విషాదాంత ఇతివృత్తాన్ని కావ్య వస్తువుగా చేసుకోవడం రాయలసీమ కవులకు అలావాటే. నిజానికి ఇది చాలా మంది సాంప్రదాయక కవుల అలంకార శాస్త్ర నిబంధనలను అతిక్రమించడమే. ప్రాంతీయ జీవితాన్ని చిత్రించిన, ప్రాంతీయ భాషలో వ్యక్తీకరించిన సాహిత్యమే ప్రశస్తమైన సాహిత్యం అని నేడు పరిగణిస్తున్న పరిస్థితి వుంది. ఆ దృష్టితో చూసినా పెన్నేటిపాట మహత్తర కావ్యం. విద్యాన్ విశ్వం గారి పేరును గొప్పగా లిఖించే కావ్యం కూడా పెన్నేటి పాటే.

విద్వాన్ విశ్వం సొంత జిల్లా అనంతపురం ప్రాంతానికి ప్రాణప్రదమైన పెన్నేటి నేపథ్యంతో 1955లో 'పెన్నేటిపాట' సృజించిన తర్వాత అనంతపురం ప్రాంతపు వీరుడి గాథ ఆధారంగా 'ఒకనాడు' కావ్యాన్ని రాశారు. ఈ కావ్యం మొదట ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించబడి, తర్వాత 1965లో పుస్తకరూపం ధరించింది. వస్తు, కాల, దేశ పాత్రాదులకు అనుగుణమైన భాషాచరచ్ఛందోరీతులతో ఈ కావ్యం సింగారింపబడిందని కవి పేర్కొంటారు. 'ఒకనాడు' కావ్యాన్ని చిరస్మరణీయంగా రచించి హంపన్న ధీర గుణానికి మరింత ఆయువు పోశారు విద్వాన్ విశ్వం.

క్రీస్తుశకం 603 నుంచి 648 వరకు పాలన చేసిన శ్రీ హర్షవర్ధనుని ఆస్థాన కవి బాణుడు రచించిన 'కాదంబరి' మహాకావ్యాన్ని విద్వాన్ విశ్వంగారు తెలుగువారికి చక్కని తెలుగులో అందించారు. కాదంబరితో పాటు కిరాతార్జునీయం, మేఘ సందేశం, దశకుమార చరిత్రకు విశ్వంగారు అనువాదాలు చేశారు. కాదంబరి–ఆరొందల పైచిలుకు పుటల తెలుగు అనువాదాన్ని చదవడం మొదలెడితే ఏకధాటిగా చదివిస్తుంది. మనం కాదంబరిలో మునిగి ఆ రచనా ప్రవాహంలో పడి సాగిపోతున్నప్పుడు బాణుడి ప్రతిభకు విస్మయం, ఆనందం ఒకేసారి కలగడం గాక, విశ్వంగారు ఎలా తెలుగు అంత గొప్పగా చేయగలిగారోనని మరింత ఆశ్చర్యపోతాము. మూల రచనా శైలికి ఏమాత్రమూ భంగం వాటిల్లకుండా అనువదించడం విశ్వం గారి శైలి. నిజానికి తెలుగు కాదంబరిని చదివి అభినందించినప్పుడు అందులో ఎంత శాతం బాణుడికి, ఎంత శాతం విశ్వానికో అంత సులువుగా తేల్చలేం. మూల రచయితతో అంతగా మమేకమై రచన చేయడం బహుశా విశ్వంగారికే సాధ్యపడవచ్చు.

ఇంగ్లీషు చదువుల ద్వారా మార్క్సిజానికి సంబంధించిన వాళ్ళు చాలామంది ఉండవచ్చు. కానీ, ప్రాచ్య విద్యలు లోతుగా చదివి ప్రముఖులుగా కనపడటమే కాక సాంప్రదాయానికి, ఆధునికతకు గొప్ప సమన్వయవాదిగా మనకు దర్శనమిస్తారు. విశ్వం గారి ఆలోచనా విస్తృతి, హృదయ వైశాల్యం ఎంతో కూడా మనం బేరీజు వేసుకోవచ్చు. మృదువుగానే మాట్లాడుతూ విరుద్ధమైన అభిప్రాయం చెప్పడం విశ్వంగారికి బాగా తెలుసు. ఆధునికతను ఆహ్వానిస్తూనే సంప్రదాయంలోని ఔచిత్యాన్ని విడమరచి చెప్పడం అతనికి చేతనవును.

డెబ్బయి రెండేళ్ళ పూర్ణ జీవితం గడిపిన విద్వాన్ విశ్వం తెలుగు సాహిత్యానికి తన కావ్యాల ద్వారా, నవలల ద్వారా, అనువాదాల ద్వారా, పత్రికా వ్యాసాల ద్వారా ఎనలేని సేవ చేసి ముద్ర వేశారు. వాదాలతో గిడసబారిపోయే ప్రస్తుత పరిస్థితిలో విద్వాన్ విశ్వంగారి విశాల దృక్పథం నేడు ఎంతో వాంఛనీయం. అది వర్తమాన పత్రికారంగానికి, సాహిత్యరంగానికి అని మాత్రమే కాకుండా మొత్తం సామాజిక జీవితానికీ తప్పక ఉపకరిస్తుంది. ❋





తెలుగుజాతి ట్రస్టు ప్రచురణం
పుటలు : 254
వెల : రు.200/–లు

**మీరు చదివారా? చదవకపోతే, వెంటనే చదవండి.**

రెండు తెలుగు రాష్ట్రాలకు బయటి రాష్ట్రాలలోని తెలుగువారి గురించి ఎన్నో విశేషాలు తెలుసుకోండి. తెలుగు సమాజ పరిశోధకుడు, నిరంతర అన్వేషి **స.వెం.రమేశ్** వ్యాసాల సంపుటి.

**'ఎల్లలు లేని తెలుగు'**

పుస్తకం కావలసినవారు రు.200/–లను ఎం.ఓ గాని, బ్యాంక్ డ్రాఫ్టు గాని పంపాలి. సొమ్ము చేరిన వెంటనే పుస్తకాన్ని కొరియర్ ద్వారా గాని రిజిస్టర్డు బుక్‌పోస్టుగా గాని పంపగలము. చిరునామా, ఫోన్ నెంబరుతో సహా తెలియపరచాలి.

డా॥సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు), 8–386, జీవక భవన్, అంగలకుదురు, తెనాలి–522 211, ఫోన్ : 94404 48244

హైదరాబాదులో : నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదురు సందు, కాచిగూడ క్రాస్‌రోడ్స్ దగ్గర, ఆర్ట్స్ అండ్ లెటర్స్, ఇందిరాపార్క్ క్రాస్‌రోడ్స్ వద్ద లభించును.

-రమేష్ పట్నాయక్
94409 80396

# జాతీయ విద్యావిధానం 2016 ముసాయిదా

## ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ విశ్లేషణ

**ముసాయిదా విద్యావ్యాపారాన్ని కొనసాగిస్తుంది, విస్తరిస్తుంది. మనువాదాన్ని ముందుకు తీసుకువెళుతుంది. రిజర్వేషన్లను, విద్యార్థి మద్దతు చర్యలను సందిగ్ధంలోనికి నెట్టివేస్తుంది. లిబరల్, ప్రొఫెషనల్ కోర్సులను కొన్ని వర్గాలకే పరిమితం చేసి మిగిలిన వారిని ఎటువంటి విలువలేని నైపుణ్యవిద్యకు పరిమితం చేస్తుంది. విద్యను కొనగలిగే వారే కళాశాలలలో, విశ్వవిద్యాలయాలలో ఉంటారు. మిగిలిన వారికి ఆరుబయట విద్యే. శాస్త్రీయ దృక్పథానికి, లౌకిక ప్రజాస్వామిక విలువలకు మాతృభాషలకు ఈ ముసాయిదా గోరీ కడుతుంది.**

**పరిచయం :** కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నూతన విద్యా విధానం రూపొందించే ప్రకటిత లక్ష్యంతో గత సంవత్సరం జనవరి 26న ఒక ప్రకటన విడుదల చేసింది. మార్చి 21న సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. అంతకు ముందే పాఠశాల విద్యపై 13 అంశాలతో, ఉన్నత విద్యపై 20 అంశాలలో ప్రశ్నావళిని రూపొందించి విడుదల చేసింది. బ్లాక్ స్థాయి నుంచి, అఖిలభారత స్థాయివరకు అనేక సమావేశాలు నిర్వహించింది. ఇదంతా బయట నుండి చూచిన వారికి దేశంలో ఒక గొప్ప ప్రజాస్వామిక ప్రక్రియ వికసిస్తుందని పిస్తుంది. అయితే, ప్రభుత్వం నిర్వహించిన ప్రతి సమావేశంలో అధి కారులకు పాలక వర్గ అనధికారులకు మాత్రమే ప్రాధాన్యత లభిం చింది. అనేక ప్రజాసంఘాలకు ఆహ్వానం లేదు. ఆహ్వానించబడిన వారికి తగిన సమయం కేటాయించబడలేదు. సమయం యివ్వబడిన సందర్భాలలో కూడా చెప్పబడిన అభిప్రాయాలు మినిట్స్‌లో చేర్చబడ లేదు. ఇక ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా కూడ అభిప్రాయాలు సేకరిం చింది. సుమారు 2 లక్షల మంది తమతమ అభిప్రాయాలు ప్రభుత్వానికి పంపారు. మొత్తం ఈ నాటకాన్ని ముగించడానికి ప్రభుత్వం అక్టోబరు 31న టి.ఎస్.ఆర్. సుబ్రమణియన్ కమిటీని నియమించింది. ఈ కమిటి 2016 ఏప్రిల్ 30న తన నివేదిక ప్రభుత్వానికి అందజేసింది.

**టి.ఎస్.ఆర్.సుబ్రమణియన్ కమిటీ నివేదిక :** సుబ్రమణియన్ గతంలో కేబినెట్ సెక్రటరీగా పనిచేశారు. 5 మంది సభ్యులు గలిగిన ఈ కమిటీలో ఆర్.ఎస్.ఎస్. కార్యకర్త అయిన ప్రొ॥, జె.యస్. రాజ్‌పుట్ (వాజ్‌పేయీ ప్రభుత్వ కాలంలో NCERT డైరెక్టరుగా నియమించ బడిన విషయం తెలిసిందే) గాక మిగిలిన ముగ్గురూ బురాక్రాట్లే! టి.ఎస్.ఆర్. సుబ్రమణియన్ కమిటి నివేదిక విద్యావ్యాపారాన్ని వ్యతిరేకించలేదు, ప్రశ్నించలేదు. అయితే, నియంత్రించవలసిన అవసరాన్ని గట్టిగా నొక్కి చెప్పింది. అలాగే ప్రస్తుత ప్రభుత్వం కోరుకున్న స్థాయిలో కాషాయీకరణకు పెద్దపీటవేయలేదు. ఈ కమిటీలో ప్రొ॥ రాజ్‌పుట్ మాట పెద్దగా చెల్లినట్లు లేదు. ఈ కారణాల వలననే కావచ్చు ప్రభుత్వం ఈ కమిటీ నివేదికను అటకెక్కించింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహించిన సమావేశాలలో వ్యక్తమైన అభిప్రాయాలకు, సుమారు 2 లక్షలమంది పౌరులు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన అభి ప్రాయాలకు సుబ్రమణియన్ కమిటి తన నివేదికలో ఎంత ప్రాతి నిధ్యాన్ని కల్పించిందన్న విషయం ఒకటైతే ప్రభుత్వం ఈ నివేదికను అటకెక్కించడంతో మొత్తం ఈ ప్రజాస్వామిక వ్యాయామాన్ని అట కెక్కించినట్లయింది. ఈ నివేదికను బయట పెట్టమని కమిటి చైర్‌పర్సన్ సుబ్రమణియన్ ప్రభుత్వంపై బహిరంగంగానే ఒత్తిడి తెచ్చారు. ఈ నివేదిక లీకైన మాట వేరే విషయం.

**జాతీయ విద్యావిధానం - 2016 ముసాయిదా :** సుబ్రమణియన్ కమిటి నివేదికను అటకెక్కించిన కేంద్ర మానవ వనరులశాఖ తనే ఒక 43 పేజీల పత్రాన్ని విడుదల చేసింది. ప్రభుత్వం తన 43 పేజీల పత్రానికి 'ముసాయిదా NEP-2016' అని పేరు పెట్టక పోయినా బలమైన ప్రజావ్యతిరేకత నిర్వహించబడకపోతే అదే జాతీయ విద్యావిధానం కానున్నది. ఈ పత్రానికి ప్రభుత్వం పెట్టిన పేరు జాతీయ విద్యావిధానం 2016 ముసాయిదా కొరకు కొన్ని ప్రాతిపదికలు' (Some inputs for Draft National Policy on Education - 2016) అయితే మనం దీనిని క్లుప్తంగా ముసాయిదా విద్యావిధానం అని, ముసాయిదా అని వ్యవహరిద్దాం. ఈ పత్రంలో పొందుపరచిన విషయాలపై అభిప్రాయాలు తెలియజేయవలసిందిగా తిరిగి ప్రజలను కోరింది. ప్రత్యామ్నాయం ఏమీలేని ప్రజలు ప్రభుత్వానికి తిరిగి తమ తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. అఖిలభారత విద్యాహక్కు వేదిక నిన్ననే (12.09.2016) తన అభిప్రాయాన్ని ఒక పత్రం రూపంలో ప్రభుత్వానికి అందజేసింది.

**ముసాయిదాలో ఏముంది?:** ఏదైనా విమర్శ సహజంగానే ప్రత్యా మ్నాయంతో కూడుకుని ఉంటుంది. మీరు విమర్శిస్తున్నారు గాని ప్రత్యామ్నాయం చూపించడంలేదని కొందరంటారు. అది అంత అర్థ వంతమైన మాటకాదు. ఏదేమైనా ఈ పత్రం మేరకు ప్రతి విభాగంలో ప్రస్తుత దుస్థితి, ప్రజల అవసరాలు, ముసాయిదా ప్రతిపాదనలను పరిశీలిద్దాం. అయితే వీటిని వేరువేరుగా ఉపశీర్షికలుగా పెట్టలేదు.

**విద్యాలక్ష్యం :** జాతీయ విద్యావిధానం - 1986, అనంతరం వచ్చిన జనార్ధన రెడ్డి కమిటీ (1992), అంబానీ, బిర్లా నివేదిక (2000) మరియు ఇతర ప్రభావాలు మొత్తంగా విద్యకు సామాజిక లక్ష్యాలు లేని పరిస్థితి ఏర్పడింది. స్వదేశీ, విదేశీ కార్పొరేటు సంస్థలకు అవసర మైన మానవ వనరులను ఉత్పత్తి చేయడంగా విద్యా లక్ష్యాలు మార్పు పొందాయి. విద్య వ్యక్తి వికాసానికి, సామాజిక ప్రగతికి దోహదం చేయాలనే ప్రజాస్వామిక లక్ష్యాలు కనుమరుగై పోయాయి. ఈ ముసా యిదా ప్రస్తుత పరిస్థితిని మార్చడానికి బదులు దానిని వ్యవస్థీకృతం చేయనున్నది.

**చరిత్ర విశ్లేషణ :** చాతుర్వర్ణ వ్యవస్థ, మనుధర్మం అమలు జరిగిన

ఈ దేశంలో శూద్రులకు, అతిశూద్రులకు విద్య నిరాకరించబడింది. బౌద్ధ, జైన వంటి వేదబాహ్య మతాలు మాత్రమే వాటి వాటి ప్రభావం ఉన్న కాలంలో అందరికీ విద్యననుమతించాయి. అయితే, అవకాశాలు మాత్రం పరిమితమే. అదలా ఉండగా విద్య అందిన వారికి కూడా ప్రధానంగా అలౌకిక విద్య మాత్రమే అందింది. లౌకిక శాస్త్రాలు చాలా పరిమితులలో మాత్రమే బోధించబడ్డాయి. నిజానికి శూద్రులు, అతి శూద్రులు అనబడేవారే కులవృత్తుల ద్వారా, శ్రమ ద్వారా, ప్రకృతిపై పనిచేయడం ద్వారా విస్తారమైన లౌకిక ఆచరణాత్మక పరిజ్ఞానం కలిగి ఉండేవారు. దుర్భర అణచివేత, విద్యనిరాకరణ కారణంగా ఈ పరిజ్ఞానం విజ్ఞానంగా రూపొందలేదు. ఈ వాస్తవాలను ముసాయిదా కుప్తంగానైన ప్రస్తావించలేదు.

నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాలను (ఇవి బౌద్ధులు స్థాపించి నిర్వహించినవి) వేదవిద్యను కలగలిపి ఈ ముసాయిదా చరిత్రను వక్రీకరించింది. అత్యధికంగా ఉండిన శ్రమజీవులకు సహస్రాబ్దాల కాలం విద్య నిరాకరించబడిన వాస్తవాన్ని గుర్తించని ఈ ముసాయిదా భవిష్యత్ కార్యాచరణలో సామాజిక రక్షణలు, వెనుకబడిన వారు తమ హక్కులను స్వాయత్తం చేసుకోవడానికి అవసరమైన మద్దతుచర్యలు కనిపించవు. ఈ భారత జాతి పాలకవర్గాల ప్రయోజనాలను తీర్చడానికి సహస్రాబ్దాల పాటు మూఢనమ్మకాలలోనికి నెట్టివేయబడిందని, కుసంస్కారాలకు గురయ్యిందనే విషయాలను ఈ ముసాయిదా గుర్తించలేదు. ఆ కారణాన, సహజంగానే విద్య శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే సాధనంగా సమాజ సంస్కరణను ప్రోదిచేసేదిగా ఉండాలని ఈముసాయిదా ప్రతిపాదించలేదు. మారుతున్న మార్కెట్ అవసరాలకు, సంస్కృతి పేరుతో మనువాద పునరుద్ధరణకు ఈ ముసాయిదా ప్రాధాన్యత నిచ్చింది.

**విద్యావకాశాల విస్తరణ :** ఈ ముసాయిదా మొత్తంపై మనకు ప్రధానంగా కనిపించేది వివృత విద్య (Open Education) మరియు నైపుణ్య విద్య (Skill Education). ఈ ముసాయిదా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తూంది, మరింతగా విస్తరిస్తుంది. ఈ నివేదిక క్రొత్తగా ప్రభుత్వరంగంలో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పెట్టేది లేదని తెగేసి చెప్పింది. ఆ కారణంగా విద్యను విస్తరించడానికి ఈ ముసాయిదాకు ఒకే ఒక మార్గం కనిపించింది. అదే వివృత విద్య. ఈ ముసాయిదా 46 నెంబరు విభాగంలో అవకాశాలిచ్చినా అందరూ అందుకోలేరని ప్రకటిస్తుంది. వారివారి సామాజిక పరిస్థితులే అందుకు ప్రధాన కారణంగా చూపుతుంది. మనదేశంలో సామాజిక పరిస్థితులంటే కులము, మతమే. శూద్రులు, అతి శూద్రులు, గిరిజనులకు విద్య అందించినా ప్రయోజనంలేదు, వారు విద్యలో ఎలా రాణిస్తారు? అటువంటి వారికి లిబరల్ విద్య (సామాజిక, ప్రకృతిశాస్త్రాలు) వృత్తి విద్యలు (ఇంజనీరింగ్, మెడిసిన్ వంటివి) కాకుండా నైపుణ్య విద్య (Skill Education) మాత్రమే అందించాలని ఈ ముసాయిదా ప్రతిపాదిస్తుంది. చిన్న తరగతులలోనే పరీక్షలు పెట్టి తప్పినవారిని, సామర్థ్య పరీక్షలు పెట్టి వాటిలో తప్పినవారిని కౌన్సిలింగ్ ఇచ్చి మరీ నైపుణ్య విద్యకు పంపించాలని ఈ పత్రం ప్రతిపాదిస్తుంది. పేదలను, దళితులను, బలహీన వర్గాలవారిని, మైనారిటీలనూ, గిరిజనులను అధికాధికంగా సాధారణ, వృత్తి విద్యలకు దూరంచేసి వివృత విద్యకు నైపుణ్య విద్యకు పరిమితం చేయడం ఈ ముసాయిదా లక్ష్యంగా కనిపిస్తుంది.

**పూర్వప్రాథమిక విద్య :** పూర్వప్రాథమిక విద్య ఆవశ్యకతను వివరించనవసరంలేదు. ముసాయిదా కూడా పూర్వ ప్రాథమిక విద్య ఆవశ్యకతను గుర్తించింది. అయితే, ప్రైవేటురంగంలో నడుస్తున్నపూర్వ ప్రాథమిక విద్యను, అదే విధంగా ప్రైవేటురంగంలోనే కొనసాగించడాన్ని ఆమోదించింది. ప్రైవేటురంగం యాజమాన్యాలకు పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాథమికవిద్యకు వ్యత్యాసమే తెలియదు. ఆ విషయమై ముసాయిదాకు ఎటువంటి పట్టింపులేదు. సరే, ప్రైవేటు రంగానికి వెళ్ళలేని పేద, దళిత, మైనారిటీ వర్గాల వారికైనా ప్రభుత్వ రంగంలో పూర్వ ప్రాథమిక విద్యను ఈ ముసాయిదా ప్రతిపాదిస్తుందా అంటే అదీ లేదు. బాలలకు అంగన్‌వాడీలలోనే పూర్వప్రాథమిక విద్య అందించాలని, అంగన్‌వాడీ కార్తకర్తలకు అందుకవసరమైన శిక్షణ ఇవ్వాలని అంగన్‌వాడీలను పాఠశాలల ఆవరణలోనికి లేదా పాఠశాలల దరిదాపులలోనికి మార్చాలని మాత్రమే ఈ ముసాయిదా ప్రతిపాదిస్తుంది. నిజానికి మాతాశిశు సంక్షేమశాఖ నిర్వహించే అంగన్వాడీలు పూర్వ ప్రాథమిక విద్యకు సరియైన కేంద్రాలు కావు. అందులో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం వలన ప్రయోజనం ఏమీ ఉండదని, నిజంగా బాలలకు పూర్వ ప్రాథమిక విద్య ఇవ్వాలనుకుంటే పాఠశాల, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక, ప్రాథమికోన్నతపాఠశాలల ఆవరణలో ప్రధానోపాధ్యాయుని అధికార పరిధిలో నడిచే ఎర్లీచైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కేంద్రాలలో మాత్రమే అది సాధ్యం. మనం ECCE కేంద్రాల కొరకే డిమాండ్ చేయాలి. గతంలో APSCERT కూడా ఆ మేరకు ప్రతిపాదన చేసి ఉంది. అదలా ఉంటే ముసాయిదా రెండు సంవత్సరాల (3-5) పూర్వప్రాథమిక విద్యను ఒక సంవత్సరానికి (4-5) కుదించడం ఒక విశేషం. బాలలను 3వ ఏటవరకే అంగన్‌వాడీలలో ఉంచి 3-5 వయోపరిమితి బాలలను ECCE కేంద్రాలలో చేర్చాలన్న డిమాండ్‌ను ఈ ముసాయిదా పట్టించుకోలేదు. ఇంత పొడువుగా పూర్వప్రాథమిక విద్య గురించి చర్చించిన ముసాయిదా, దానిని బాలలకు అందించే బాధ్యతను ఒక రకంగా రాష్ట్రప్రభుత్వాల మీదకి నెట్టివేసి, అవి వాటి వీలును బట్టి చేయాలని సూచించింది. మొత్తంపైన పూర్వ ప్రాథమిక విద్య హళ్ళికి హళ్ళి సున్నాకు సున్నా అయింది.

**పాఠశాల విద్య :** విద్యాహక్కు చట్టం - 2009 ప్రకారం బాలలకు విద్యా హక్కు 1 నుండి 8వ తరగతి వరకు ఉంటుంది. ఈ చట్టాన్ని 10వ తరగతి వరకు విస్తరించాలని ముసాయిదా ప్రతిపాదిస్తుంది. నిజానికి విద్యాహక్కు చట్టం చాలా లోపభూయిష్టంగా ఉంది. దానిని 10వ తరగతి వరకు విస్తరించడం వలన ఏమైనా ప్రయోజనం ఉంటుందా? విద్యాహక్కు చట్టం-2009" పాఠశాల విద్యలో వ్యాపారాన్ని నిషేధించలేదు. కనీసం నియంత్రించలేదు. ఆ మాట అలా ఉంచితే ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికైనా ఆ చట్టంలో అవసరమైన నిబంధనలు ఉన్నాయా? ప్రాథమిక పాఠశాలలలో PIRను 20:1గా అభివృద్ధిచేస్తేనే గాని కనీసం 50% ప్రాథమిక పాఠశాలలకు మూడు ఉపాధ్యాయ పోస్టులు రావు. విద్యా హక్కు చట్టం, నిబంధనల ప్రకారం 60 మంది విద్యార్థుల వరకు ఇద్దరే ఉపాధ్యాయులు అన్న విధానంతో ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న బాలలు నష్టపోతున్నారు. తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు అన్న స్థితినుంచి మనం చాలా దూరంగా ఉన్నాము. PIRను 20:1 చేయకుండా తరగతికొక టీచరు కొరకు పాఠశాలలను విలీనం చేస్తే విలీనమైన పాఠశాలలు తక్షణమే మూతపడతాయి, విలీనంచేసుకున్న పాఠశాలలు క్రమంగా మూతపడతాయి. ఉపాధ్యాయ పోస్టులు కూడా క్రమంగా రద్దవుతాయి. ఆంధ్రప్రదేశ్

# ఇంగ్లీష్‌కు భయపడి బాలిక ఆత్మహత్య



ఇంగ్లీష్ మీడియం మీద భయం ఓ బాలిక ప్రాణం తీసేసింది. 7వ తరగతి వరకు తెలుగు మీడియంలో చదివి, 8వ తరగతి నుంచి ఇంగ్లీషు మీడియంలో చేరిన బాలిక అర్థంకాని భాషలో రాణించలేక తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర సంఘటన వరంగల్ జిల్లా ములుగు మండలం ఇంచర్లలో జరిగింది. అలకుంట సుజాత జనార్దన్ దంపతులకు రాజేష్ రమ్య సంతానం, ప్రైవేటు బడిలో 7వరకు చదివింది. 8వ తరగతిలో ఇంగ్లీషు మీడియంలో చేరింది. ఒక్కసారిగా భాష మారడంతో పాఠాలు అర్థంకాక ఇబ్బందిపడేది. ఇదే విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. వార్షిక పరీక్షల్లో నాలుగు సబ్జెక్టులు తప్పడంతో రమ్య తీవ్ర మనోవేదనకు గురైంది. కూతురు ఇబ్బందిని గమనించిన తల్లిదండ్రులు ములుగులోని మరో స్కూల్‌లో చేర్పించారు. అక్కడ కూడా ఇంగ్లీషు మీడియంలోనే బోధన ఉండటంతో తనవల్ల కాదని, తెలుగుమీడియంలోనే చదువుతానని తండ్రి జనార్దన్‌కు చెప్పింది. బుధవారం ఉదయం తల్లిదండ్రులు ఇంటి దగ్గర లేని సమయంలో రమ్య తలుపులు వేసుకుని ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించు కుంది. స్కూల్‌బస్సు రావడంతో కూతురును సాగనంపేందుకు ఇంటికి వచ్చిన జనార్దన్ అక్కడి పరిస్థితి చూసి కుప్పకూలిపోయాడు. అప్పటికే పూర్తిగా కాలిపోయిన రమ్య మృతిచెందింది. *(ఆంధ్రజ్యోతి-28-9-2016)*

నుంచే నేర్చుకున్నారేమోగాని కేంద్రం రూపొందించిన ఈ ముసాయిదా కూడా స్కూలు మ్యాపింగ్ మరియు విలీనాల గురించే ప్రతిపాదించింది. భౌతిక వనరుల, బౌద్ధిక వనరుల సహేతుక వినియోగం గురించే మాట్లాడింది. బాలలు ఎందుకు బడిమాని వేస్తున్నారు, వారి నిలుపుదల సాధించే విషయంగాని, నిబంధనలు పాటించిన ప్రైవేటు పాఠశాలలను మూసివేయడం, స్వాధీనం చేసుకోవడం గురించి గాని ఎటువంటి ప్రతిపాదన చేయని ఈ ముసాయిదా ప్రభుత్వ పాఠశాలలు మూసివేయ డమే సహేతుకమని' భావిస్తూంది.

ప్రాథమికోన్నత విభాగానికి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు పోస్టులుంటే విద్యాహక్కు చట్టం మూడు పోస్టులే మంజూరు చేస్తుంది. ఉద్యమ ఒత్తిడి ఫలితంగా మన రాష్ట్రప్రభుత్వం 4వ పోస్టును కూడా కొనసాగి స్తూంది. ఇటువంటి విద్యా హక్కు చట్టాన్ని 10వ తరగతి వరకు విస్తరిస్తే వచ్చే ప్రయోజనం ఏమిటి? నష్టం కూడా ఉండవచ్చు. విద్యా హక్కు చట్టం చివరిలో ఇవ్వబడిన షెడ్యూలులో పాఠశాలలో ఉండ వలసిన కనీస వసతుల గురించి ఇచ్చిన విషయం తెలిసిందే. నిజానికవి చాలా తక్కువ స్థాయిలో ఉన్నాయి. వాటిని కూడా అమలు చేయడం లేదు. పాఠశాలలలో కనీస వసతులను వెంటనే అమలు జరపాలని ప్రతిపాదించడానికి బదులు ఈ ముసాయిదా ఆయా రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు వారి వారి పరిస్థితులను బట్టి వసతుల నిబంధనలు మార్చుకోవచ్చని ప్రతిపాదించింది. ఈ ముసాయిదా ప్రకారం అర కొరగా ఉన్న వసతుల నిబంధనలు కూడా నీరుకారిపోతాయి. విద్యా హక్కు చట్టాన్ని ఒకవైపు సెకండరీ విద్యకు విస్తరించాలని ప్రతిపాదిస్తున్న ముసాయిదా రెండవవైపు బడిమానివేసిన వారు, బాల కార్మికులు పూర్తి కాలపు రెగ్యులర్ పాఠశాలలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా వారి కొరకు వివృత పాఠశాలల వ్యవస్థను విస్తరించాలని ప్రతిపాది స్తుంది. అంటే విద్యాహక్కు వివృత పాఠశాలల ద్వారా అన్నమాట. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'బాలకార్మికత (నిషేధం,నియంత్రణ) సవరణ చట్టం 2016 కూడా 14-18 వయోపరిమితి వారికి ప్రమాద కరం కాని పరిశ్రమలలో పూర్తికాలపు కార్మికులుగా పనిచేయడానికి అవకాశం ఇచ్చింది. ఈ ముసాయిదా మరొక అడుగు ముందుకు వేసి 5వ తరగతి పూర్తిచేసిన బాలలు పూర్తికాలపు బడికి రావలసిన అవసరం లేదని ప్రతిపాదిస్తుంది. 6వ తరగతిలో పరీక్ష తప్పిన వారు నైపుణ్య విద్యకు వెళ్ళాలని, అప్రెంటిస్ షిప్‌కు వెళ్ళాలని ఈ ముసాయిదా భావిస్తుంది. వారు సాయంత్రం బడులలో చదువుకోవాలి. అందరూ చదువుకు పనికిరారన్న భావజాలమే ఈ ముసాయిదాకు ప్రాతిపాదక.

**ఉన్నత విద్య :** ఉన్నత విద్యలో నమోదు మొత్తం మీద చూస్తే సంబంధిత వయోపరమితిలో 23.6 శాతమేనని, యస్.సి.లలో తక్కువగా 18.5%, యస్.టి.లలో ఇంకా తక్కువుగా 13.3 శాతం ఉందని ఈ ముసాయిదా అంగీకరించింది. 2017-18 నాటికి నమోదును 30% పెంచాలని ప్రతిపాదిస్తుంది. ఈ లక్ష్యం చాలా తక్కువ స్థాయిలో ఉన్నమాట ఒకటైతే యస్.సి., యస్.టి.ల పరంగా ప్రత్యేక లక్ష్యాలు కూడా ప్రకటించలేదు. క్రొత్తగా కళాశాలల స్థాపనకు నిరాకరిస్తున్న ముసాయిదా విద్య విస్తరణకు వివృత కళాశాల విద్యపైనే ఆధారపడు తుంది. ఉన్నత విద్యలో ప్రమాణాలకు సంబంధించి అధ్యాపక పోస్టులు నింపుతామని హామీ ఇస్తున్న ఈ ముసాయిదా విశ్వవిద్యాలయాలు ఫీజులు పెంచి నిధులు సమకూర్చుకోవాలని ప్రతిపాదిస్తుంది. అంటే విశ్వవిద్యాలయాలు ప్రమాణాలు పెరగడటంమాట అటుంచి పేదలకు మరింత దూరం అవుతాయి. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి ఈ ముసాయిదాకు అంత ప్రధానమైన విషయం కాదు. విశ్వవిద్యా లయాల పాలక మండళ్ళలో కార్పొరేటు ప్రతినిధులకు చోటు కల్పించా లని ఈ ముసాయిదా ప్రతిపాదిస్తుంది. అంతేకాక, కళాశాలలకు, విశ్వవిద్యాలయాలకు ఫలితాలపై ఆధారపడి మద్దతు ఇవ్వాలని సూచి స్తుంది. ఫలితాల మాపనానికి కొలబద్దలు మార్కెట్ మరియు మను ధర్మం అని వేరుగా చెప్పనసరం లేదు. అఖిల భారత విద్యా సర్వీసు IESను ప్రారంభించి కేంద్రప్రభుత్వంచే నియంత్రించబడే ఈ అధికారు లతో రాష్ట్రాలలో విద్యాపాలన చేయాలని ముసాయిదా ప్రతిపాదిస్తుంది. ఇది ఫెడరల్ సూత్రాలకు విరుద్ధం. అదలా ఉంచితే ఈ ముసాయిదా విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను నిషేధించకపోయినా వారి కార్య క్రమాలను నియంత్రించడానికి విశ్వవిద్యాలయాల యాజమాన్యాలకు అధికారాలు కల్పిస్తుంది. అన్నింటి కంటే ప్రధానంగా ఈ ముసాయిదా రిజర్వేషన్లు విస్తరించడం మాట అటుంచి రిజర్వేషన్లను కొనసాగించా లని కూడా ఎటువంటి సూచనలు చేయలేదు. ఈ విషయమై బయట

ప్రశ్నలు వచ్చేసరికి కేంద్ర మానవ వనరుల శాఖామంత్రి జవదేకర్ రిజర్వేషన్లు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అది అలా ఉంటే ఈనాడు, దేశంలో సుమారు 33 మిలియన్ల మంది యువతీ, యువకులు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో అత్యధికులు స్కాలర్‌షిప్ గాని, స్టైపండ్ గాని ప్రభుత్వ లేక ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజు రీయింబర్స్‌మెంట్ గాని పొందుతున్నారు. అనేకమంది విద్యార్థులు హాస్టల్ వసతి పొందుతున్నారు. ఈ మద్దతు చర్యలు కొనసాగించనున్నట్లు ఈ ముసాయిదాలో ఎక్కడా పేర్కొనలేదు. ఇది చాలా ఆందోళనకరమైన విషయం. వెనుకబడినవర్గాల విద్యార్థులకు ఒక మిలియన్ స్కాలర్ షిప్పులు, మెరిట్" విద్యార్థులకు ఒక మిలియన్ స్కాలర్‌షిప్పులు ఇవ్వాలని ఈ ముసాయిదా ప్రతిపాదించింది. ఇటువంటి విభజన చాలా ప్రమాదకరమైనది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి స్కాలర్ షిప్పులు ఇచ్చినప్పుడు కూడా మంజూరైన స్కాలర్‌షిప్పుల కంటె దరఖాస్తులు ఎక్కువగా ఉంటే అందులో మెరిట్ ఉన్నవారికే ఇస్తారు. అది వేరు. ఈ ముసాయిదా ప్రతిపాదిస్తున్న విధానం వేరు. ఈ ముసాయిదా వెనుకబడిన వారిలో మెరిట్ ఉండదన్న భావజాలంపై ఆధారపడి ఉన్నది. పరిమాణాత్మకంగా చూస్తే పెద్ద సంఖ్యలో ప్రస్తుతం ఉన్న స్కాలర్ షిప్పులు రద్దయి, రెండు మిలియన్ల స్కాలర్ షిప్పులు మాత్రమే మిగులుతాయా అన్న ఆందోళన విద్యార్థులలో నెలకొని ఉంది. నిజానికి స్కాలర్‌షిప్పులు, హాస్టల్ వసతులు మరింతగా పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

విద్యావ్యాపారీకరణను కొనసాగిస్తున్న ఈ ముసాయిదా విద్యావ్యాపారాన్ని ప్రపంచీకరణ చేయడానికి అవసరమైన చర్యలు ప్రతిపాదించింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగంగాగాని, లేదా దాని బయటగాని అఖిలపక్ష లేదా బహుళపక్ష విద్యా వాణిజ్య ఒప్పందాలు జరగాలంటే అందుకు సిద్ధమైన దేశాలు విద్యారంగ వాణిజ్యపరమైన వ్యాజ్యాలను సాధారణ కోర్టులనుంచి తప్పించి ట్రైబ్యునళ్ళకివ్వవలసి ఉంటుంది. అలాగే, విద్యా ప్రమాణాలను ప్రపంచీకరించవలసి ఉంటుంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ఈ ముసాయిదా విద్యాట్రైబ్యునళ్ళ స్థాపన మరియు అక్రెడిటేషన్ అంతర్జాతీయీకరణలను ప్రతిపాదించింది. విదేశీ విశ్వవిద్యాలయాలను దేశంలో అనుమతించటానికి ఒక చట్టం తీసుకురావాలని ప్రతిపాదించింది.

**భాషా సంస్కృతుల సమస్య :** అన్ని భాషల అభివృద్ధికి సంస్కృతం సహకరించిందని ఈ ముసాయిదా పేర్కొంది. సంస్కృతం నీడలో అన్ని భాషల అభివృద్ధి ఆగిపోయిందన్న మాట చారిత్రక వాస్తవం. ప్రజల భాషలో గ్రంథరచన, కవిత్వం తక్కువ స్థాయివిగా పరిగణించబడ్డాయి. అందుకే నన్నయ్య, నన్నెచోడుడు వచ్చేవరకు తెలుగు గ్రంథాలేవు, అదలా ఉంటే, ఈనాడు అత్యున్నత స్థాయిలలో ఉన్న మేధావులంతా మాతృభాషామాధ్యమంలో చదువుకుని పైకి వచ్చిన వారే. అభివృద్ధికి ఆంగ్లమాధ్యమం అవసరమని ప్రైవేటు పాఠశాలలు చేసిన ప్రచారంలో ప్రజలు కూడా పడ్డారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేసుకుని ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలన్నీ మాతృభాషామాధ్యమాన్ని అమలు చేయాలని విధాన నిర్ణయంచేస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఈ ముసాయిదా జ్ఞానసముపార్జనకు మాతృభాషే ఉన్నతమైనదని ఒక వైపు ప్రకటిస్తూనే రెండవవైపు ప్రజలు అడుగుతున్నారు కాబట్టి 6వ తరగతి నుంచి ఆంగ్లమాధ్యమాన్నే అమలు చేయాలని ప్రతిపాదిస్తుంది. ఐదవ తరగతి వరకు ఆయారాష్ట్రాల అభీష్టం మేరకు మాతృభాషా మాధ్యమాన్ని అమలుచేయవచ్చని వెసులుబాటు ఇచ్చింది. అంటే 5వ తరగతి వరకు కూడ మాతృభాషా మాధ్యమం తప్పనిసరి కాదన్నమాట. సంస్కృతాన్ని అన్ని స్థాయిలలో బోధించాలని ప్రతిపాదించింది. ఈ విధంగా ఒక వైపు సంస్కృతం మరొక వైపు ఆంగ్లంతో ప్రజల భాషలకు సమాధి కట్టడానికి ఈ ముసాయిదా సిద్ధమైంది. ప్రజల భాషల అభివృద్ధి గురించి ఈ ముసాయిదాకు ఎటువంటి పట్టింపు లేదు.

సాధారణంగా ఒక విద్యావిధానంలో ప్రజాస్వామిక, లౌకిక విలువల గురించి మాట్లాడుతారు. కాని ఈ ముసాయిదా సంస్కృతి గురించి మాత్రమే మాట్లాడుతుంది. భారతదేశ చరిత్ర కూడా వర్గ పోరాటాల చరిత్రే, సంస్కృతులు కూడా వర్గ సంస్కృతులే. ప్రజల సమస్యలు, వారిపోరాటాలు, వారి ఆట, పాట పాలక వర్గాల ఇతిహాసాలలోనికి, ప్రబంధాలలోనికి చేరలేదు. రెండు వర్గాల సంస్కృతులు వేరువేరు పాయలుగానే సాగాయి. సహజంగానే ఈ సంస్కృతుల మధ్య ఘర్షణలు ఉంటూ వచ్చాయి. అలాగే అనేక భాషలు అనేక జాతులు ఉన్న దేశమిది. ఫలితంగా విస్తారమైన సాంస్కృతిక వైవిధ్యం ఉంది. ఈ వైరుధ్యాలకు మరియు వైవిధ్యాలకు దూరంగా భారతీయ సంస్కృతి ఒకటి అఖండంగా ఉందని ఈ ముసాయిదా గూఢార్థం.

ఈ ముసాయిదాకు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించాలనే అలాగే ప్రజాస్వామిక లౌకిక విలువలను సామాజిక స్పృహను పెంపొందించాలనే ఆలోచనేలేదు. ఈ ముసాయిదా వ్యక్తి ఉద్యోగిత, కార్పొరేటు లాభాల వృద్ధి చుట్టూనే తిరిగింది. 'ఉద్యోగిత లేని అభివృద్ధి విధానాన్ని పాటిస్తున్న పాలకులు ముసాయిదా పొడవునా ఉద్యోగిత గురించి మాట్లాడడం హాస్యాస్పదం మాత్రమే కాదు, మోసపూరితం కూడా, నిరుద్యోగ సమస్య ఆర్థిక వ్యవస్థ నుంచి పుట్టుకు వస్తుంది, ఆర్థిక విధానాలనుంచి పుట్టుకు వస్తుంది. విద్యా కోర్సులను మారిస్తే అది పరిష్కారం కాదు.

**ముగింపు :** ఈ ముసాయిదా గురించి మూడుమాటలలో చెప్పాలంటే ఇది విద్యావ్యాపారాన్ని కొనసాగిస్తుంది, విస్తరిస్తుంది. మనువాదాన్ని ముందుకు తీసుకువెళుతుంది. రిజర్వేషన్లను, విద్యార్థి మద్దతు చర్యలను సందిగ్ధంలోనికి నెట్టివేస్తుంది. లిబరల్, ప్రొఫెషనల్ కోర్సులను కొన్ని వర్గాలకే పరిమితం చేసి మిగిలిన వారికి ఎటువంటి విలువలేని నైపుణ్య విద్యకు పరిమితం చేస్తుంది. విద్యను కొనగలిగే వారే కళాశాలలలో, విశ్వవిద్యాలయాలలో ఉంటారు. మిగిలిన వారికి ఆరుబయట విద్యే. శాస్త్రీయ దృక్పథానికి, లౌకిక ప్రజాస్వామిక విలువలకు మాతృభాషలకు ఈ ముసాయిదా గోరీ కడుతుంది. ఈ ముసాయిదాను వీలయినంత తొందరగా ఎండగట్టాలి. ❋

ఏ రాష్ట్రంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా
తెలుగువాళ్ళంతా ఒక్కటే..
తెలుగులో సంతకం...
తెలుగుదనానికి సంకేతం

జాతి సాంస్కృతిక పతాక -మాతృభాష

–చలసాని నరేంద్ర,
98495 69050

# అందుబాటులో లేకపోతున్న న్యాయం... నిస్సహాయంగా న్యాయస్థానాలు !

న్యాయం కోసం కోర్టుల వైపు చూసే పరిస్థితులు మన దేశంలో ప్రస్తుతం నెలకొనడం లేదు.

కోర్టుల్లో పేరుకుపోయిన మొండి కేసులను పరిష్కరించడమే న్యాయ వ్యవస్థ ముందున్న అసలైన సవాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి టిఎస్ ఠాకూర్ ఈ మధ్య ఒక సందర్భంగా పేర్కొనడం గమనార్హం. అంతేకాదు, చిన్న చిన్న కేసులను పరిష్కరించడాన్ని ఇంట్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయడంతో ఆయన పోల్చారు.

తాను పంజాబ్, హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు రెండు రాష్ట్రాల్లో పెద్దఎత్తున లోక్అదాలత్‌లు నిర్వహించి 14 లక్షల కేసులను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. 'అప్పుడు మేము చిన్న చిన్న కేసులను పరిష్కరించడమంటే చీపురు పట్టుకుని ఇంటి చుట్టుపక్కల ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంగా భావించాం. ఏళ్ల తరబడి కోర్టుల్లో మూలుగుతున్న మొండి కేసులను పరిష్క రించడమే అసలైన సవాలు' అని అన్నారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి తాను ఏళ్ల తరబడి నానుతున్న 200 సివిల్, క్రిమినల్ కేసుల వివరాలు అందించాలని రెండు రాష్ట్రాల జడ్జీలను కోరినట్లు ఆయన చెప్పారు. వివరాలు అందాక ఈ పాత కేసులను పరిష్కరించడం ఇప్పుడు మన లక్ష్యమని వారికి చెప్పా నన్నారు. ఆ కేసులను పరిష్కరించడానికి జడ్జీలను యూనిట్ సిస్టమ్ కిందికి తీసుకురావడం ద్వారా వారికి అదనపు వెయిటేజి ఇవ్వడం జరిగిందని, ఫలితంగా ఆరు నెలల్లోనే అంటే తాను సుప్రీంకోర్టుకు వెళ్లే సమయానికల్లా న్యాయాధికారులు 5,500కు పైగా అలాంటి కేసులను పరిష్కరించారని ఠాకూర్ చెప్పారు.

అంతేకాదు కోర్టుల్లో కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయనే విషయాన్ని జడ్జీలు గనుక గ్రహించగలిగితే అన్ని సమస్యలను అధిగ మించవచ్చన్న విశ్వాసాన్ని సైతం ఆయన వ్యక్తం చేశారు. అంటే కోర్టులలో త్వరితగతిన కేసులు పరిష్కారం కాకపోవడానికి న్యాయ మూర్తుల కొరత మాత్రమే ప్రధాన కారణం కాదని, న్యాయమూర్తుల వ్యవహారం, న్యాయవాదుల పనితీరు సహితం కారణం అవుతున్నదని భావించవలసి ఉంది. అంతకు ముందు లోకసభలో ప్రధానమంత్రి సమక్షంలో ఉన్నత న్యాయస్థానాలలో న్యాయమూర్తుల ఖాళీలను ప్రభుత్వం తక్షణం భర్తీ చేయాలి అంటూ ఆవేదనతో ఠాకూర్ అభ్యర్థించడం మొత్తం దేశ ప్రజల దృష్టిని ఆకట్టుకొంది.

ఒక వంక న్యాయమూర్తుల కొరతతో పాటు, పోలీసుల కొరత కూడా సామాన్య ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండకుండా పోవడానికి కారణం అవుతున్నది. దేశంలో మొత్తం మీద పోలీసులలో 24 శాతం ఖాళీలు ఉన్నాయి. ఉన్నత న్యాయస్థానాలలో 1782 మంది న్యాయమూర్తులు ఉండవలసి ఉండగా మంజూరైన ప్రతి మూడవ న్యాయమూర్తి పోస్ట్ ఖాళీగా ఉంది. కిందిస్థాయి కోర్టులలో 5,436 మంది జడ్జీలు ఉండవలసి ఉండగా, ప్రతి నాలుగవ పోస్ట్ ఖాళీగా ఉంది. కింది కోర్టులలో కోటికి పైగా కేసులు పరిష్కరించ వలసి ఉండగా, హైకోర్టు, సుప్రీం కోర్టులలో 20 లక్షల వరకు అపరిష్కృత కేసులు ఉన్నాయి.

కేసుల పరిష్కారంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది అన డానికి జైళ్లల్లో ఉన్న వారిలో 68 శాతం మంది కేసుల విచారణలో ఉన్నవారే కావడం స్పష్టం చేస్తుంది. అంటే శిక్ష పడకుండానే వారు శిక్ష అనుభవిస్తున్నారు. మరో వంక జైలు సిబ్బందిలో సహితం 34 శాతం ఖాళీలను భర్తీ చేయడం లేదు. ముఖ్యంగా మహిళలకు న్యాయం అసలు అందుబాటులో ఉండటం లేదు.

వివిధ నేరాలకు సంబంధించిన కేసులలో ఫిర్యాదు చేసిన మహిళలు, వివిధ నేరాలలో బాధితులైన మహిళలకు సంబంధించిన



వివరాలను ప్రభుత్వ రికార్డులు స్పష్టంగా పేర్కొనడం లేదు. అసలు నేరాలు జరిగినప్పుడు మరొకరి సహాయం లేకుండా నేరుగా కోర్టులు, పోలీసులను ఆశ్రయిస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండటం తెలిసిందే. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదు లను నమోదు చేసుకోవడానికి మహిళా పోలీసులు సామాన్యంగా అందుబాటులో ఉండటం లేదు.

పోలీస్, జైళ్ల పనితీరుకు సంబంధించిన సమాచారం అందించ డానికి సమాచార హక్కు సహకరించడం లేదు. బ్రిటిష్ వలస పాలకులు 1861లో చేసిన పోలీస్ చట్టం, 1894లో చేసిన జైళ్ల చట్టమే ఇంకా అమలులో ఉండటం గమనార్హం. స్వతంత్ర భారతా వనికి అవసరమైన చట్టాలను రూపొందించుకొని ప్రయత్నం చేయడం లేదు. ఈ చట్టాలలో తీవ్రమైన మార్పులు తీసుకు రావాలని పలు సిఫార్సులు అందినా ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

జైళ్లలో, పోలీస్ స్టేషన్‌లలో జరుగుతున్న వ్యవహారాలపై బయటి వారి పర్యవేక్షణకు అసలు అవకాశం ఉండటం లేదు. దేశ వ్యాప్తంగా జైళ్ల సందర్శనకు అనధికారులను నియమించాలని సూచిస్తూ

2011లో కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఒక సూచన చేసింది. అయితే కేవలం దేశంలోని జిల్లా సందర్శకుల బోర్డులలో కేవలం 1 శాతం మందిని మాత్రమే ఆ విధంగా నియమించారు. ఈ ఆదేశాలకు భిన్నంగా పౌర సమాజానికి జైళ్లతో సంబంధం లేకుండా చేసే విధంగా 2015లో హోమ్ మంత్రిత్వ శాఖ మరో ఉత్తరువును జారీచేసింది.

ఎన్నో రక్షణలు కల్పిస్తున్నా రోజువారీ తమ విధులలో పోలీసులు మానవహక్కులను తీవ్రంగా ఉల్లంఘిస్తూ ఉండడం నిత్యకృత్యమై పోతున్నది. నిర్బంధంలో చిత్రహింసలకు గురిచేయడం, అక్రమంగా అరెస్టులు జరపడం, నిరంధంలో మరణాలు జరగడం, చట్టాతీత హత్యలు జరగడం పరిపాటిగా మారింది. పలు సందర్భాలలో పౌర సంబంధ సంస్థలు అటువంటి ఆరోపణలను విచారించి, నిర్దిష్టమైన నివేదికలు సమర్పిస్తున్నా ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోవడం లేదు.

పోలీసుల అకృత్యాలకు, అవినీతికి అణగారిన పేద వర్గాలే ఎక్కువగా గురవుతున్నారు. చట్టంలో గల కొన్ని రక్షణల కారణంగా ఉల్లంఘనలకు పాల్పడిన పోలీస్ అధికారులపై తగు చర్యలు తీసుకోవడం అసంభవం అవుతున్నది. సి ఆర్ పిసి 197వ నిబంధన ప్రకారం..'విధి నిర్వహణ'లో చేసిన ఏపని గురించి అయినా ప్రభుత్వ అధికారులపై విచారణ జరపడానికి ముందుగా ప్రభుత్వ అనుమతి అవసరం. అయితే ఆ విధంగా ప్రభుత్వాలు అనుమతి ఇస్తున్న సందర్భాలు చాలా అరుదుగా ఉంటున్నాయి. దానితో చట్టాలను అమలు చేయవలసిన వారే వాటిని ఎంత తీవ్రంగా ఉల్లంఘించినా పట్టించుకొనే వారు ఉండటం లేదు.

పోలీస్ సంస్కరణల గురించి 2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు ఈ దిశలో పెద్ద ముందడుగు అయినా, ఆచరణలో చెప్పుకోదగిన మార్పుకు దోహదపడటం లేదు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను పలు రాష్ట్రాలు పూర్తిగా అమలు జరపడం లేదు.

సరికొత్త పోలీస్ చట్టాలను 14 రాష్ట్రాలు రూపొందించినా, సుప్రీంకోర్ట్ స్ఫూర్తికి అనుగుణంగా ఒకటి, రెండు రాష్ట్రాలలో మించి ఉండడం లేదు. మూడు అత్యున్నత కమిటీలు మాదిరి పోలీస్ చట్టాలను రూపొందించినా, వారిని ఆమోదించే ప్రయత్నం చేయడం లేదు. అదే విధంగా మాదిరి జైళ్లచట్టాన్ని మూడు కమిటీలు రూపొందించినా, అత్యధిక రాష్ట్రాలలో ఇంకా 1894 నాటి చట్టమే అమలులో ఉన్నది.

ముఖ్యంగా పోలీస్ ఫిర్యాదుల యంత్రాంగం పోలీసులు కానివారితో ఏర్పాటు చేయడం గురించి తగు స్పందన రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఉండటం లేదు. చిత్రహింసలకు సంబంధించి ఇంతవరకు చట్టం చేయడం సాధ్యం కావడం లేదు. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలు పోలీసుల విధి నిర్వహణలో మితిమీరిన రాజకీయ జోక్యానికి అవకాశం కల్పిస్తున్నాయి. పోలీసులు స్వతంత్రంగా పనిచేసే పరిస్థితులు కల్పించడం లేదు.

పేదలకు ఉచిత న్యాయసహాయం అందించడం కోసం వివిధ స్థాయిలలో ఏర్పాటు చేసిన న్యాయసహాయం కేంద్రాలు ఆశించిన రీతిలో ఉపయోగపడటం లేదు. ముఖ్యంగా పోలీస్ నిర్బంధంలో, జైళ్లల్లో ఉన్న వారికి న్యాయసహాయం అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలుజరగడం లేదు. ముఖ్యంగా సి ఆర్ పిసి 41డి ప్రకారం నిర్బంధంలో ఉన్న వ్యక్తులను విచారించే సమయంలో వారి న్యాయవాది ఉండాలి. అయితే ఈ నిబంధన అమలుకు ఎటువంటి మార్గదర్శక సూత్రాలు లేకపోవడంతో ఆచరణకు నోచుకోవడం లేదు.

సాక్షులకు చట్టపరంగా ఎటువంటి రక్షణ కల్పించలేక పోతున్నాము. దానితో పలు కీలక కేసులలో కీలక సాక్షులు హత్యలకు గురికావడాన్ని చూస్తున్నాము. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు రూపొందించిన మార్గదర్శక సూత్రాలు సహితం అమలుకు నోచుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై ఎటువంటి చట్టం చేసే ప్రయత్నం చేయడం లేదు. కొన్ని కేసులలో సుప్రీంకోర్టే జోక్యం చేసుకొని సాక్షులకు రక్షణ కల్పించవలసి వస్తున్నది. ❋



-డా॥ఈమని శివనాగిరెడ్డి
సెల్ : 98485 98446

# విష్ణుకుండినులు

## (క్రీ.శ.385-570)



చిత్రము 288-ఇ. విష్ణుకుండి ఇంద్రవర్మ శాసనము (క్రీ. శ. 6వ శతాబ్దము)

1. స్వస్తి పురనిసగ్గమవాసకాత్ భగవచ్ఛ్రీపర్వతస్వామిపాదానుధ్యాత సకలమహీమణ్డలావనత
2. సామన్తమకుటమణికిరణావలీధవళచరణయుగో విఖ్యాతయశాః శ్రీమన్మహారాజా మాధవవర్మ్మా తస్య
3. క్జీవిత శ్రీ విష్ణుకుణ్డి పార్థివాధిరాజకులాన్వయతిలకసముద్భూతై కాదశాశ్వమేధావభృతావధౌతజగత్కల్మ
4. షః క్రతుసహస్రయాజినః స్నానపుణ్యోదకపవిత్రీకృతశిరసః

**శా**తవాహనుల తరువాత 150 ఏళ్ళకు ఆంధ్రదేశంలో ఎక్కువ భాగాన్ని, కళింగదేశంలో దక్షిణ భాగాన్ని కలిపి పాలించిన విష్ణుకుండినులు తెలుగు రాజవంశీకుల్లో ముఖ్యులు. ఎక్కడివారో ఇంతవరకు సరైన ఆధారాలు లభించని నేపథ్యంలో విష్ణుకుండిన గోత్రానికి చెందిన వారని వేల్పూరు శాసనం తెల్పుతుందనీ, త్రికూట మలయాధిపులనీ, అమరపురీశులనీ, ఈ త్రికూటమలయం, కోటప్పకొండ అనీ, అమరపురి వేల్పూరు అనీ (ఎందుకంటే మాధవవర్మ వేల్పూరు దేశ శాసన అనే బిరుదును ధరించాడు) కాబట్టి వారు బ్రాహ్మణులు కానీ, క్షత్రియులు కానీ కాదనీ, తొలుత బౌద్ధాన్నీ, తరువాత వైష్ణవాన్నీ చివర్లో శైవాన్నీ స్వీకరించారనీ, శూద్రులైనవారు, క్రతువులు నిర్వహించి సాంఘికోన్నతిని సాధించటానికి పూనుకొన్నారనీ చెప్పిన బీయస్ఎల్ హనుమంతరావు గారి వాదన సమంజసంగా తోస్తుంది.

విష్ణుకుండినుల గురించి ఇప్పటిదాకా హల్జ్, కొమర్రాజు లక్ష్మణరావు, నేలటూరి, డీసీ సర్కారు, మారేమండ రామారావు, కె.గోపాలచారి, ఆర్.సుబ్రహ్మణ్యం, బీవీ కృష్ణారావు,నీలకంఠశాస్త్రి, ఎస్.శంకర నారాయణన్, పి.సోమసుందరరావు, బి.యన్.శాస్త్రి, కె.రామమోహనరావు, బి.యస్.ఎల్.హనుమంతరావు, అజయ్‌మిత్రశాస్త్రి, వి.సుందరరామశాస్త్రి, కృష్ణప్రసాద్‌బాబు రకరకాల పరిశోధనలు చేసి ఎవరి వాదనలు వారు వినిపించారు. అయితే అన్ని పరిశోధనలల్లోని ప్రామాణిక ఆధారాలను స్వీకరించి ఆచార్య వెలమకన్ని సుందర రామశాస్త్రి 'విష్ణుకుండినులు-వంశ కాలానుక్రమణిక' అన్న అంశంపై నాగార్జున విశ్వవిద్యాలయంలో సమర్పించిన డాక్టరేటు సిద్ధాంత గ్రంథం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకొని, ఆమోదయోగ్యంగా వుంది. అందుబాటులో వున్న అన్ని శాసనాధారాలను వివిధ పరిశోధకుల వాదాలను వడకట్టిన సుందరరామశాస్త్రి గారిచ్చిన విష్ణుకుండిన వంశ కాలానుక్రమణిక కింది విధంగా వుంది.

మొదటి ఇంద్రవర్మ (క్రీ.శ.385-410)
మొదటి మాధవవర్మ (క్రీ.శ.410-435)
గోవిందవర్మ (క్రీ.శ.435-435)
రెండో మాధవవర్మ (క్రీ.శ.475-515)
↓ ↓ ↓
మొదటి విక్రమేంద్రవర్మ (క్రీ.శ.515-525)-- దేవవర్మ --మంచన భట్టారక
↓ ↓
ఇంద్ర (భట్టారక)వర్మ (క్రీ.శ.525-555)--మూడో మాధవవర్మ (క్రీ.శ.508-536)
↓
రెండో (విక్రమేంద్ర)భట్టారకవర్మ (క్రీ.శ.555-570)

విష్ణుకుండిన రాజుల గురించి తెలుసుకోవటానికి వారు విడుదల చేసిన 9 రాగిరేకు శాసనాలు, 1 రాతిశాసనం, కలిపి మొత్తం పది శాసనాలు. వారి సామంతులు, వారసులు విడుదల చేసిన 7రాగిరేకు శాసనాలు కలిపి వారు విడుదల చేసిన కీసరగుట్ట, అమరావతి, పెదవేగి, నాగార్జునకొండ వద్ద దొరికిన నాణాలు ఉపయోగపడతాయి. మొదటి గోవిందవర్మ మొదటి రాగిరేకు శాసనం, రెండో మాధవవర్మ వేల్పూరు రాతి శాసనం, రెండో మాధవవర్మ మొదటి ఈపూరు రాగిరేకు శాసనం, రెండో మాధవవర్మ ఖానాపూర్ రాగిరేకు శాసనం, మూడో మాధవవర్మ రెండో ఈపూరు రాగిరేకు శాసనాలు, ఇంద్రవర్మ రామతీర్థం రాగిరేకు శాసనం, రెండో విక్రమేంద్రవర్మ చిక్కుళ్లో రాగిరేకు శాసనం, తుమ్మలగూడెం రెండో రాగిరేకు శాసనం, తుండి రాగిరేకు శాసనం, నాలుగో మాధవవర్మ పోలమూరు రాగిరేకు శాసనం, పృధ్వీమూలుని మొదటి గోదావరి రాగిరేకు శాసనం, రెండో గోదావరి రాగిరేకు శాసనం, తూర్పుగాంగ

కవిత

# మహాత్మా!

మందరపు హైమవతి
సెల్ :9441062732

గాయపడిన అహింసా హంసకు
ప్రాణభిక్ష పెట్టిన సిద్ధార్థుడా!
జీవితమంతా సత్య సిద్ధాంతాన్నే
అసిధారావ్రతంగా ఆచరించిన దృఢచిత్తుడా!
సాధారణ మానవునిగా జన్మించి
కఠోర సాధనతో బలహీనతలను జయించి
మనీషిగా మారిన ఓ మహాత్మా!
వేషభాషలకే ప్రాముఖ్యమిచ్చే సమాజంలో
కొల్లాయి బట్ట కట్టి
చేత కర్రబట్టి
చిరునవ్వు నెలవంకతో
కోట్లాది ప్రజల హృదయాలను
కొల్లగొట్టిన ధీరోదాత్తుడా!
ఇంద్రియాల జవనాశ్వాలను బంధించి
కళ్ళాలు వెయ్యడమెంత కష్టం
ఆహారంలో నిగ్రహం



ఆహార్యంపై నిర్మోహం
లోకానికి ఆదర్శం నీ మార్గం
అవినీతి మరకలంటని
ఆడంబరం అట్టహాసాలు లేని
తెరచిన పుస్తకం నీ జీవితం
గుండెల్లో తుపాకీ గుండు దూసుకెళ్ళినా
హేరామ్ అంటూ శత్రువుని క్షమించిన
ఔదార్యమూర్తీ!
స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులైనా
అందరికీ అభివృద్ధి ఫలాలు
అందరాని చందమామ లైనపుడు
చిత్తశుద్ధి, క్రమశిక్షణ
మాకు అలవడాలని
అవినీతి పంకిలంలో నుంచి
నీతి కమలాలు విచ్చుకోవాలని
లంచగొండితనం, మాలిన్యం లేని
సోమరితనం మురికి లేని
అచ్చమైన భారతం
అందరికీ కనువిందు చేయాలని
మహాత్మా! మరొకసారి నీవు
మహీతలంపై ఉదయించాలని
శాంతి చంద్రికలు వెదజల్లాలని
ముక్తకంఠంతో కోరుతున్నాం!

ఇంద్రవర్మ జిర్జింగ్ రాగిరేకు శాసనం, రెండోపులకేశి మారుటూరు రాగిరేకు శాసనం, వేంగీ చాళుక్య మొదటి జయసింహుని పొలమూరు రాగిరేకు శాసనాలు విష్ణుకుండిన వంశ చరిత్రకు శాసనాధారాలుగా వున్నాయి.

దొరికిన చారిత్రకాధారాలును బట్టి విష్ణుకుండినులు తెలంగాణాలోని హైదరాబాదు సమీపంలోని కీసరగుట్టను రాజధానిగా చేసుకొని తెలంగాణా, రాయలసీమ, తీరాంధ్రమంతా కలిపిన భూభాగాన్ని పాలించారనీ, ఒక్కసారి మాత్రం రేవానది (నర్మదా) తీరం వరకూ వెళ్ళి వెనుదిరిగి వచ్చారనీ చెప్పొచ్చు. పరాక్రమ వంతులైన ఈ రాజులు శ్రీపర్వతస్వామి పాదాలనుద్యాతులమని చెప్పుకోవటం వల్ల, శ్రీపర్వత-విజయపురి (నాగార్జునకొండ) లోని బుద్ధభగవానుని భక్తులని చెప్పొచ్చు. విష్ణుకుండిన రాజులు, **రాజ, మహారాజ, జనాశ్రయ పరమసౌగత, మహాకవి, త్రికూట మలయాధిపతి, విష్ణుకుండి వాకాటక వంశద్వయాలంకార జన్మ, చాతుర్దంత సమర విజయాధి గణాశేష చక్రవర్తి క్షేత్రాధిపతి, సకల భువన రక్షాభరణై** లాంటి బిరుదుల్ని ధరించారు.

వీరిలో మాధవవర్మ **మహారాజు, శతసహస్ర క్రతుయాజి, పరమేష్టి, సకల మహామండలావనత సామంత మకుటమణి కిరణావలీఢ చరణయుగ, వినయ సంపన్న, సకల మదీమండల మనుజపతి ప్రతిపూజిత శాసన, త్రిభువన నగర భవనగత యువతీ హృదయ నందనుడు, త్రివర నగర భవన గత పరమ యువతీ జన విహరణరీతి, విద్వద్విజగురువృద్ధతపస్వి జనాశ్రయుడు పాలకక్షిణా పరంబోనిధి రేవా పరిత్సలిల వలయ విభూషణా యాభువో భర్తు బిరుదులు ధరించాడు. తరువాత, గోవిందవర్మకు మహారాజ, స్వనయ భుజబలోత్సాహ ప్రభావానురాగాలచే రాజ్యాన్ని పొందినవాడు, శౌర్య ధైర్య ప్రతాపానుభావాలచే సామంత రాజ్యాల నాక్రమించినవాడు, సకృత్యర్వస్వత్యాగి, సకల శాస్త్రార్థశ్రమణ పరిజ్ఞానాలతో ఇహపరాలను చూసేవాడు, విద్యశ్చూరమహాకులీన జనసమాశ్రయుడు, మహాబోధి చిత్తుడు** అనే బిరుదులతో ప్రశంసించబడినాడు. అంతేకాదు, **షడభిజ్ఞ ప్రాతిహార్య దర్శనానుగ్రహాజనిత సుగత శాసనాభిప్రసాదుడు, బ్రహ్మ పుణ్య సంభారుడని** కూడా కీర్తించబడినాడు. రెండో మాధవవర్మకు **త్రికూట మలయాధిపతి, మహారాజు, నయ వినయ సత్వసంపన్నుడు, భగవచ్ఛ్రీపర్వతస్వామి పాదానుద్యాతుడు** అనే బిరుదులున్నాయి. అతని తరువాత రాజైన మొదటి విక్రమేంద్రవర్మ **మహారాజు, మహాకవి, పరమ సౌగతుడని (వాకాట కమహాదేవీ సుతస్య మహాకవేః పరమ సౌగతస్యమహారాజశ్రీ విక్రమేంద్రవర్మ** అని కీర్తించబడినాడు. ఇతని తరువాత దేవవర్మ కుమారుడైన మూడో మాధవవర్మ రాజైనాడు. ఇతనికి **మహారాజ, త్రికూట మలయాపతి** అనే బిరుదులున్నాయి. ఇతని తరువాత రాజైన ఇంద్రభట్టారకవర్మ **అనేక చాతర్దన్త సమర సంఘట్టవిజయిన పరమమాహేశ్వరస్య పరమ బ్రాహ్మణస్య యధా విధి వినిర్యాపిత ఘటికావాప్త పుణ్య సఞ్చయాస్య ధర్మ విజయినో మహారాజ భట్టారకవర్మణ** అని తుండి రాగిగేకు అతని బిరుదుల్ని తెలియజేస్తుంది. ఇంకా **విజయాధిగతాశేష చక్రవర్తి క్షేత్రాధిపతి** అనే బిరుదును కూడా ఇతడు ధరించాడు. ఇతని తరువాత రాజైన రెండో విక్రమేంద్రభట్టారకుడు **శౌర్యాతిశయ సమస్త రాజర్షి గుణ సంపద్యోగ సామర్థ్యాత్ప్రకృతి మండలేనశైశవారోపితరాజ్యభారః పరమధార్మికో ధర్మ విజయీా ప్రణతానేక సామంతమకుటమణి మయూఖా ద్భాభిత వరచరణయుగతః శ్రీమాన్విక్రమేంద్రభట్టారక వర్మణాః** అని ప్రశంసిచబడినాడు. ఇతనికి **ఉత్తమాశ్రయుడనే** బిరుదుంది. ఇతని తరువాత రాజైనాడనుకొంటున్న నాలుగో మాధవవర్మకు **జనాశ్రయుడనే** బిరుదుంది. ఇతడు సంస్కృతంలో **ఛందోవిచ్ఛిత్తి** అనే గ్రంథాన్ని రాశాడనీ, అందుచేతనే ఈ గ్రంథానికి **జనాశ్రయఛందో విచ్ఛిత్తి** అనే పేరొచ్చిందని బి.యన్.శాస్త్రి అభిప్రాయపడినారు.

❋



కె.వి.ఆర్.తో త్రిపురనేని మధుసూదనరావు

# తత్వశాస్త్రాన్ని జనరంజకం చేసిన త్రిపురనేని

–కె.రాజశేఖరరాజు
సెల్ : 73964 94557

"వ్యక్తిగా, సాహిత్య విమర్శకుడిగా, విప్లవ సాహిత్యోద్యమ నాయకుడిగా ఆయన ప్రయాణంలోని ప్రతి చలనాన్ని, భావాన్ని, ప్రభావాన్ని, పార్శ్వాన్ని, అందులోని మహాద్భుతమైన శక్తిని, బలహీనతలను, వెలుగు నీడలను, సృజనాత్మక–యాంత్రికతలను, భిన్న ప్రకటనలను, బాధించే వైఖరులను, తనకూ–తన ప్రాణప్రదమైన ఉద్యమానికీ ఇబ్బంది కలిగించే వ్యాఖ్యలను మహత్తరమైన క్రమశిక్షణలోనే దాగి ఉన్న క్రమశిక్షణా రాహిత్యాన్ని, అత్యున్నత తాత్విక మేధోజీవిలోనే నేలపై కించిత్ అరాచకత్వాన్ని...ఎప్పటికైనా నిశితంగా, గతితార్కికంగా అంచనా వేసినప్పుడే నక్సల్బరీ శ్రీకాకుళాల ఉద్వేగపూరితమైన తరంలో ఒకరిగా, ఆయన నుంచి ఇవ్వాల్టికీ, రేపటికీ ప్రవహించగల విప్లవాంశను స్వీకరించినట్లవుతుంది. ఆయన నిస్సందేహంగా మూడు తరాలను ప్రకంపనాలకు గురిచేసి విప్లవ, విప్లవ సాహిత్యోద్యమాలకు తిరుగులేని జీవశక్తిని అందించారు. నిర్మాణాలకు దూరమైనా ఎర్రజెండాను గుండెలో పదిలంగా దాచుకుని, విప్లవంలో అరుదైన జీవన సంస్కృతిని ప్రకటించారు. వాద వివాదాలతో విప్లవంలోకి వచ్చి, ఒక లక్ష్యం కోసం జీవిత పర్యంతం వాద వివాదాలను సాగించారు. ఇప్పుడు మధుసూదనరావు గురించి మాట్లాడ్డం, అంచనా వేయడం కూడా ఒక అద్భుతమైన అవసరమైన వాదోపవాదమే"

ఆయన కన్నుమూసిన తర్వాతి నెలలో అంటే 2004 నవంబర్లో త్రిపురనేని మధుసూదనరావుపై తీసుకొచ్చిన 'అరుణతార' ప్రత్యేక సంచిక సంపాదకీయంలో విరసం ఆయనను ఎలా అర్థం చేసుకోవాలని వేసిన అంచనా నేటికీ ప్రాసంగికమైనదనే చెప్పాలి.

**జీవిత వివరాలు:**

త్రిపురనేని విప్లవ రచయితల సంఘం నాయకుడు, వక్త, సాహిత్య విమర్శకుడు. 1970ల నుంచి 90ల మొదటిదాకా వక్తగా ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని వేల చోట్ల బహిరంగ సభల్లో, సెమినార్లలో, ప్రజాసంఘాల వేదికల్లో మాట్లాడి, విప్లవ, సాహిత్యోద్యమాలను ప్రచారం చేయడంలో విద్యార్థి యువజనులను విప్లవంవైపు ఆకర్షించడంలో అద్వితీయ పాత్ర నిర్వహించారు. తత్వ శాస్త్ర బోధకుడిగా, ప్రత్యేకించి మావో ఆలోచనా విధానం ప్రచారకుడిగా ఆయన నిర్వహించిన పాత్ర అపారమైనది. సన్నిహితులకు మధు, విద్యార్థులకు మాస్టారు, ప్రత్యర్థులకు తిరుపతి మావో, త్రిమూర్తి, త్రిమరాసురుడు అనే బోలెడు పేర్లతో చలామణి అయిన త్రిపురనేని సికింద్రాబాదు కుట్రకేసులో, తిరుపతి కుట్రకేసులో నిందితుడు మాత్రమే కాకుండా ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో 19 నెలలపాటు నిర్బంధం పాలయ్యారు. తిరుపతి గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కాలేజీలో తెలుగు అధ్యాపకుడిగా వృత్తి జీవితం గడిపారు. ప్రవృత్తి రీత్యా జీవితాంతం మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా, తత్వశాస్త్ర ఉపాధ్యాయుడిగా, నిత్య, నిరంతర అధ్యయనశీలిగా నిలిచారు. 1992 నుంచి అనారోగ్యంతో, వ్యక్తిగత కారణాలతో క్రియాశీల ఆచరణలో పెద్దగా పాలుపంచుకోకపోయినా స్థానికంగా విద్యార్థులకు రాజకీయ, సాహిత్య, తాత్విక బోధను కొనసాగించారు. 2004 అక్టోబర్ 8న అనారోగ్యంతో కన్నుమూసిన త్రిపురనేని రెండు దశాబ్దాలు విరసం కార్యవర్గ సభ్యుడిగా విప్లవ సాహిత్యోద్యమ నిర్మాణ నాయకత్వ బాధ్యతలు వహించారు. తెలుగునేల నలుచెరగులా కళాశాలల్లో వేలాది సభల్లో పాల్గొని విద్యార్థులను ఉత్తేజితులను చేసిన ఈ అద్వితీయ ఉపన్యాసకుడిని, తాత్వికుడిని, మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంత కర్తను మరోసారి గుర్తు చేసుకోవడంలో భాగమే ఈ వ్యాసం.

**సాహితీ విందు భోజనం**

బాల్యంలో మా ఊరుకు వచ్చి పలకరించిపోయిన ఆరెస్సెస్ కార్యకర్తలు నేర్పిన భావజాలంలో పెరిగి, పీజీ చదువు కోసం తిరుపతి వచ్చాక మార్క్సిజం సిద్ధాంతం పట్ల ఆసక్తి ఏర్పడ్డమే కాకుండా దాదాపు ఆరేళ్లపాటు బహిరంగ జీవితంలోనే నేను ఎంతో కొంత ఆచరణలోనూ పాల్గొన్న క్రమంలో నేనూ నాలాంటి ఎందరో విద్యార్థులం త్రిపురనేనిని ఆయన ఇంట్లోనూ, బయట సాహిత్య సభల్లోనూ, విశాలాంధ్ర బుక్‌షాపులోనో, తిరుపతి చుట్టుపక్కల పల్లెల్లో ఆర్ఎస్ఎస్‌తో సహా ప్రజాసంఘాల కార్యక్రమ సభల్లో తరచుగా కలిసేవాళ్లం. గ్రామాలకు తరలండి అంటూ ఉద్యమం పిలుపునిచ్చిన క్రమంలో పల్లెల్లో విద్యార్థి, యువజనులు నిర్వహించే సభలకు ఒక్కోసారి టీఎమ్ఎస్ వచ్చి ఉపన్యసించేవారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత బస్సుకోసం కిలోమీటర్ల కొద్దీ దూరం

నడిచిన సమయాల్లో, ఒక్కోరోజు నడి రాత్రి దాటాక, తిరుపతికి తిరిగి రావడానికి బస్సు ఉన్న చోటుకు ప్రయాణించేటప్పుడు, తర్వాత రాత్రంతా బస్సులోనే కూర్చుని చర్చలు జరపడంలో టీఎమ్మెస్‌తో మేం గడిపిన క్షణాలు అపూర్వమైనవనే చెప్పాలి.

అప్పట్లో మదనపల్లె కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు టీఎమ్మెస్‌ను కలవడానికి వచ్చినప్పుడు యాదృచ్ఛికంగా మేమూ అక్కడ ఉండటం తటస్థించినట్లయితే, మాకందరికీ ఒక సాహితీ విందుభోజనమే దక్కేది. విరసం ప్రతినిధిగా చేసే నిబద్ధ ప్రకటనలను, రాతలను పక్కనబెట్టి సాహిత్యాంశాలపై ఇతరులతో చర్చించేటప్పుడు టీఎమ్మెస్ అంత ఓపికగా ఇతరుల అభిప్రాయాలను ఎవరూ వినలేరనిపిస్తుంది. పుట్టపర్తి నారాయణాచార్యుల వారి అధ్యయన ఆసక్తిని వల్లంపాటి ఆకాశానికి ఎత్తిపట్టి కథలు కథలుగా వర్ణిస్తుంటే టీఎమ్మెస్ అలా వింటూండి పోయేవారు. జీవితం చరమ దశలోనూ అవసరం అనుకుంటే కంప్యూటర్ శాస్త్రలోతులను మథిస్తానని, అవసరం లేకుంటే ఎంత కొత్త శాస్త్ర అంశాన్నైనా పట్టించుకోనని పుట్టపర్తి చెప్పే వారంటూ వల్లంపాటి టీఎమ్మెస్‌తో చెబుతుంటే మేం ఆలాగే వింటూండి పోయేవాళ్లం. విరసం అవతల వ్యక్తులూ, వారి సాహిత్య నేపథ్యం గురించి తెలుసుకోవడానికి, అంచనా వేయడానికి ఎంత విశాల దృక్పథం ఉండాలో ఆలాంటి చర్చా సందర్భాలు మాకు పాఠం నేర్పేవి.

**అనితరసాధ్య వాగ్ధాటి**

పాటలో గద్దర్.. వచన సాహిత్యంలో అల్లం రాజయ్య... మార్క్సిస్టు విమర్శకుల్లో, ఉపన్యాసకుల్లో త్రిపురనేని మధుసూదనరావు.. తెలుగు నాట విప్లవోద్యమం వల్ల చరిత్ర ఆవరణలోకి వచ్చిన గొప్ప లెజెండ్స్ అంటూ విరసం సీనియర్ రచయిత్రి నల్లూరి రుక్మిణిగారు వేసిన అంచనా టీఎమ్మెస్‌పై పరమ ప్రామాణిక అంచనాగానే చెప్పాలి. అలనాటి కళాకారులు బళ్లారి రాఘవ, వేమూరి గగ్గయ్యల తర్వాత మైకు అవసరం లేకుండానే వందలాదిమంది సభికులను కంచుకంఠంతో మంత్రముగ్ధులను చేసిన ఏకైక తెలుగు ఉపన్యాసకుడు త్రిపురనేని అంటే అక్షరం కూడా అతిశయోక్తి కాదనే చెప్పాలి. తాను గురిపెట్టిన ప్రత్యర్థిని, శత్రువును చీల్చి చెండాడటం, ఎవరి కోసం తాను ఉపన్యసిస్తున్నాడో వారిలో మహోత్తేజం కలిగిస్తూ నేరుగా యుద్ధరంగంలోకి దిగేలా వారిని సమాయత్తం చేయగలగటంలో విప్లవ సాహిత్య శిబిరంలోనే త్రిపురనేని అంత మహోధృత ప్రసంగకారిని చూడలేదనే చెప్పాలి. తన సమకాలీనుల్లో జ్వాలాముఖి ఉన్నప్పటికీ త్రిపురనేనికే ఈ విషయంలో అగ్రాసనం లభిస్తుంది.

రాడికల్ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా నిలిచిన వరంగల్, కరీనంగర్ వంటి తెలంగాణ జిల్లాల్లోని కళాశాలల్లో త్రిపురనేని అడుగు పెడితే శాంతిభద్రతలను కాపాడలేమని 1980లలో పోలీస్ శాఖ నేరుగా ప్రకటించిందంటే ఆయన ఉపన్యాసం విద్యార్థులను ఆకర్షించే తీరు ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. వేలాది తెలంగాణ విద్యార్థులు ఆయన ప్రసంగ ఉధృతి ప్రభావానికి లోనవుతున్న వైనం పోలీసు శాఖను భయాందోళనలకు గురిచేసింది. చివరకు త్రిపురనేని తెలంగాణ కళాశాలల్లో అడుగుపెట్టకుండా చేయడంలో కోర్టు ఆర్డర్ కూడా తెచ్చుకున్న పోలీసులు గెలుపు సాధించారు కానీ.. ఒక రకంగా చూస్తే తెలుగు ఉపాధ్యాయ ప్రపంచం మొత్తంగా గర్వించదగిన క్షణాలవి. ఒక అధ్యాపకుడి గొంతుకు రాజ్యవ్యవస్థే ఆందోళనకు గురైన ఘడియ అది. ప్రపంచ విప్లవాల్లో చాలా వాటికి టీచర్లే నాయకత్వం వహించారన్నది చెరిపేస్తే చెరగని సత్యం. తెలుగునేలపై విప్లవోద్యమం తయారు చేసిన అలాంటి ఉద్యమ ఉపాధ్యాయుడే టీఎమ్ఎస్. ఈరోజు ఫేస్ బుక్‌లు, వాట్సప్‌లు, యూట్యూబ్‌లు వ్యక్తుల జీవితాల్లోని ప్రతి క్షణాన్ని రికార్డు చేస్తూ వస్తున్నాయి. కానీ టీఎమ్ఎస్ వంటి గతించిన విశిష్టవ్యక్తుల స్వరాలు కూడా మనకు ప్రస్తుతం అందుబాటులో లేకుండా పోవడం విచారకరం. పదాల్ని అస్త్రాలుగా మార్చి ప్రత్యర్థిని దునుమాడిన, ప్రజలను ఉత్తేజితులను చేసిన ఆ ఉపన్యాస ఝరి ఇంకా ఎక్కడైనా ఆడియో, వీడియో రూపంలో మిగిలిఉంటే వాటిని సేకరించి డిజిటల్ రూపంలో భద్రపర్చవలసిన అవసరం తెలుగు సమాజ బాధ్యత.

**నిబద్ధ ఉపన్యాసకుడు**

మాట్లాడటం, చదవటం, రాయడం అనే మూడు జ్ఞానదాయిక కళలను సమానంగా కలిగిన వారు ప్రపంచంలో చాలా అరుదు అని చెబుతుంటారు. సభల్లో మాట్లాడినా, ఏదైనా రాసినా తాను చెప్పదల్చుకున్న విషయాన్ని నిక్కచ్చిగా చెప్పడం ఒకటే తెలిసిన వాడిలా త్రిపురనేని కనిపించేవారు. ఆయన రూపం శత్రువును ఎదుర్కోవడానికి సర్వదా సన్నద్ధంగా ఉండే విప్లవ సైనికుడిలా కనిపించేది. మాటల్లో, రాతల్లో ఎంతటి సాధికారత ఉండేదంటే ఇదే సిద్ధాంతం, ఇక దీనికి తిరుగు లేదన్నట్లుగా ఉంటాయి. నమ్మిన సిద్ధాంతంపై అచంచల విశ్వాసం, ప్రత్యామ్నాయాలతో అవసరం లేని ఆలోచనా విధానం ఉద్యమ మేధావులకు ఎంత సౌకర్యాన్ని ఇస్తుందంటే ఇక భాషకోసం తడుముకోవలిసిన పనిలేదు. మాటలు సూటిగా ఉంటాయి. శ్రోతలను అట్టే ఆకట్టుకుంటాయి. ఈ కోవలోనే 1970ల ప్రథమార్థంలో విరసంకు చేరువైన త్రిపురనేని ఉపన్యాసాన్ని తన జీవితకాలంలో ఒక కళగా అభివృద్ధి చేశారు. 'ఆ లావుపాటాయన మాట్లాడుతుంటే ఎంతో ధైర్యం వస్తుంది, ఆర్నెల్లు బతికేయవచ్చు, ఆయన మీటింగు ఉన్నప్పుడల్లా నన్ను కూడా తీసుకెళ్లరా' అంటూ ఆనాటికి ఉద్యమాల్లో పాల్గొంటున్న యువకుల తల్లులు ఒత్తిడి చేసేవారంటే త్రిపురనేని ఉపన్యాసం ఏ శిఖరాలకు చేరిందో అర్థమవుతుంది. సాహిత్యంలో చెడు ధోరణుల నిర్మూలన కార్యక్రమం త్రిపురనేనిదయితే, ఆయన నేలను చదును చేసింతర్వాత వరవరరావు నిర్మాణ కార్యక్రమం చేపట్టి ఆ నేలలో విత్తనాలు చల్లుకుంటూ పోయేవాడని అప్పట్లో ప్రతీతి. సీపీఎం తత్వవేత్త నండూరి ప్రసాదరావు పుస్తకంలో తొలి వాక్యం చరాచర ప్రపంచంలో... అని మొదలవుతుంది. విజయవాడ న్యూ ఇండియా సెంటర్లో అప్పట్లో జరిగిన ఒక సభలో చలనమే పదార్థ లక్షణం, ఈ చలనం లేని పదార్థం నీకెక్కడ దొరికింది నండూరి ప్రసాద్ అంటూ వేదాంతంలో మాత్రమే ఉండాల్సిన అచర పదార్థాన్ని మార్క్సిస్టు చారిత్రక భౌతికవాదంలో కలిపే కల్తీపనులు చేస్తే మాత్రం ఊరుకోం జాగ్రత్త అంటూ త్రిపురనేని గంటసేపు ఆ ఒక్క అంశంపై చేసిన మహోధృత ఉపన్యాసం చరిత్ర సృష్టించింది. తన ఎదుట ప్రత్యర్థి ఉన్నప్పుడు అతడిపై దాడి చేస్తున్నప్పుడు కనికరానికి పోతే క్యారెక్టర్ చచ్చిపోతుందనే వారాయన. శత్రువు లేదా ప్రత్యర్థి అంతు చూసేవరకు వదలని ఈ తత్వాన్ని చూసే అప్పట్లో పురాణం సుబ్రహ్మణ్య శర్మ త్రిపురనేనికి తిరుపతి మావో అని కొత్త నిర్వచనం కూడా ఇచ్చారు. ఆ పేరు అలా దశాబ్దం పైగా స్థిరపడిపోయింది కూడా. అయితే రాతలో, మాటలో, ఆకారంలో కటువుగా కనిపించే టీఎంఎస్ చర్య, ఉపన్యాసం ముగియగానే సున్నితుడైపోయేవాడు. 'ప్రసాదరావు ఎవరో కాదయ్యా ఆ రోజుల్లో నా గురువే' అంటూ నండూరిని వెనకేసుకురావడం చూసినవారికి ఆశ్చర్యం, నవ్వు రెండూ వచ్చేవి. శ్రామికులపక్షాన జరిపే వర్గపోరాటమే సాహిత్య విమర్శ అని తన భావన. విమర్శ కూడా పోరాటమే అయినప్పుడు ప్రత్యర్థిపై శషభిషలు ఉండకూడదనేవారు.

## సాహిత్య దృక్పథం

సాహిత్యాన్ని సృష్టించడం సాహిత్యాన్ని వివరించడం కంటే సులభంగా కనిపిస్తోంది అనే మాటలు టీఎమ్ఎస్ కాక మరెవ్వరన గలరు? విమర్శకుడు రచయిత కన్నా రెండాకులు ఎక్కువ చదువుకోవాలి అన్న కొకు మాటకు పొడిగింపే కదా ఇది. తాను విమర్శించిన రచయితల కంటే వెయ్యాకులు ఎక్కువ చదువుకున్న అపర అధ్యయనశీలికే ఇలాంటి వ్యాఖ్య సాధ్యమవుతుంది. ఏ విషయం మీద రాసినా మొదట ఆ విషయానికి చెందిన భావనల్ని స్పష్టం చెయ్యడం, దానిమీద అంతకు ముందు జరిగిన చర్చను పరిచయం చేసి విశ్లేషించడం, తర్వాత తన ప్రతిపాదనను చెయ్యడం త్రిపురనేని విమర్శలో మెథడాలజీ. ఒక విషయాన్ని దాని చిట్టచివరిలోతు వరకు వెళ్లి, శోధించి, దాని సారాన్ని పట్టుకుని ఆ తర్వాత దానిపై తనదైన ప్రతిపాదనలను చేయడంలో ఆధునిక సాహిత్యంలో ప్రత్యేకించి మార్క్సిస్టు సాహిత్యంలో త్రిపురనేని తర్వాతే ఎవరినైనా చెప్పాల్సి ఉంటుంది. ఆయన జీవిత పర్యంతం ప్రదర్శిస్తూ వచ్చిన ఈ తీవ్ర అధ్యయన అభినివేశమే మార్క్సిస్ట్ సాహిత్య విమర్శకు ఒక అద్వితీయ తాత్విక భూమికను కల్పించింది. ప్రబంధ సాహిత్యం కేవలం కవుల ఊహల్లోంచి మాత్రమే పుట్టిందని, దాంట్లో సమాజం లేదని పైపై వ్యాఖ్యలు చేయడం చాలామందికి పరిపాటిగా ఉన్న రోజుల్లో విశిష్టాద్వైతమే ప్రబంధాల్లో ప్రధాన వస్తువు అంటూ ఘంటాపథంగా తేల్చిచెప్పినవారు త్రిపురనేని. సాహిత్యమంటే సంధులూ, సమాసాలూ, అందమైన అలంకారాలూ, ఛందస్సుల వయ్యారాలూ మాత్రమే కాదనీ అన్నిటికంటే ప్రధానమైంది రచయిత భావజాలమని తెలిసి వచ్చేలోగా చాలా విలువైన కాలం చేజారిపోయిందనీ, తనకూ తనలాంటి ఎందరికో త్రిపురనేని మధుసూదనరావు వంటి ఒక విమర్శకుడు ఆనాడు లభించి ఉంటే ఇంత సమయం వృధా అయ్యేది కాదనీ, అంతే కాకుండా విశ్వనాథను ఎలా చదవాలో తెలిసి ఉండేదని ప్రముఖ రచయిత, విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్య చేసిన వ్యాఖ్యానం వెనుక త్రిపురనేని అధ్యయన తీవ్రతకు చెందిన విశిష్టాంశం దాగి ఉంది. తనకు కళాశాల రోజుల్లో పాఠం చెప్పిన గురువుగా, అసంఖ్యాక రచనలు చేసిన అద్వితీయ రచయితగా విశ్వనాథ సత్యనారాయణపై త్రిపురనేనికి వ్యక్తిగతంగా ఎంతో గౌరవభావం ఉండేది.

## విశ్వనాథ – రెండు ద్వంద్వాలు

ఎస్వీ యూనివర్సిటీలో పీజీ, పరిశోధన చేస్తున్నప్పుడు వారం వారం తన ఇంట్లో ఆయనను కలిసిన ప్రతి సందర్భంలోనూ త్రిపురనేని మాస్టారు విశ్వనాథ సత్యనారాయణను రెండు కోణాలలో చూడమనేవాడు. అనితర సాధ్యమైన వేగంతో అలవోకగా రచనలు చేసుకుంటూ పోయిన విశ్వనాథను ఒకవైపు, వర్ణధర్మాన్ని పరిరక్షించే లక్ష్యంతో తాను మనస్ఫూర్తిగా నమ్మిన భూస్వామ్య భావజాలాన్ని జీవితం చివరి వరకూ పాటించిన పరమ సాంప్రదాయిక వాది విశ్వనాథను మరోవైపు పెట్టి ఆయన మూర్తిమత్వాన్ని అంచనా వేయడంలో పొరపాటు చేయకూడదన్నది మాస్టారు భావన. వేయిపడగలు శైలి పరంగా, పాఠకాదరణ పరంగా ఎంత ప్రాచుర్యం పొందినప్పటికీ దాన్ని విశ్వనాథ మహా విలాపంగా త్రిపురనేని అభివర్ణించేవారు. ఆ విలాపం వ్యక్తిగతం కాదు. తాను నమ్మిన చాతుర్వర్ణ వ్యవస్థ తన కళ్లముందే కుప్పకూలిపోతున్నప్పుడు, పాత భావాల స్థానంలో కొత్త భావాలు, పాత సమాజం స్థానంలో కొత్త సమాజపు అంకురాలు మెల్లమెల్లగా మొలకెత్తుతున్నప్పుడు ఓటమి తప్పదని అర్థమవుతున్న సంధిదశలో పాతను వదలలేక, కొత్తను అర్థం చేసుకోలేక భూస్వామ్య సమాజం పెట్టిన చిట్ట చివరి ఏడుపే వేయిపడగలు అనేవారు త్రిపురనేని. వేయి సంవత్సరాల వెనుకబాటు ఆలోచనలకు ప్రతిరూపంగా నిలిచిన విశ్వనాథను విమర్శా వైధానిక పరంగా చీల్చి చెండాడుతూనే, అదే సమయంలో.. చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని మన స్ఫూర్తిగా నమ్మి దాన్ని దాని భావజాలాన్ని చివరిక్షణం వరకు కొనసాగించిన విశ్వనాథ సత్యనారాయణ నిజాయితీని త్రిపురనేని మా సంభాషణల్లో ఎంతగానో ప్రశంసించేవారు.

ఆ ప్రశంసలను దాటుకుని విశ్వనాథ సాహిత్యంపై ఆయన సంధించిన ఉగ్రవిమర్శ త్రిపురనేని జీవితంలో ఒక కొత్తకోణాన్ని వివరిస్తుంది. విశ్వనాథలో విమర్శించవలసిన అంశమేదో గుర్తించకుండా ఇతర కోణాల్లోకి చర్చను మళ్లించినవారిపై త్రిపురనేని నిజంగానే నిప్పులు గక్కారు. "ఒక దశలో తెలుగుజాతి కళాచైతన్యాన్ని సర్వనాశనం చేయగలిగిన జగదేక మహా కిరాతక తిర్యగ్ బుద్ధికి ప్రతినిధి విశ్వనాథ" అంటూ అభ్యుదయ సాహిత్య విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి విశ్వనాథపై చేసిన విమర్శను మరింత లోతుల్లోకి తీసుకెళ్లిన క్రమంలో.. 20వ శతాబ్దం పూర్వ, ఉత్తరార్థాల్లో 50 ఏళ్లపాటు విశ్వనాథ సాహిత్యం నిర్వహించిన పాత్రను మదింపు చేయడానికి త్రిపురనేని పదేళ్ల సుదీర్ఘ సమయం వెచ్చించారు. విరసంతో ప్రత్యక్ష సంబంధాలకు దూరమయ్యాక కూడా అధ్యయనాన్ని వదిలిపెట్టని ఆయన విశ్వనాథ కావ్యాలనూ, నవలలనూ సవివరంగా విశ్లేషించడానికే తాను విమర్శకుడయినట్లుగా, అంత కార్యభారాన్ని తలకెత్తుకుని దాదాపు పది సంవత్సరాల కాలం అందులో మునిగితేలినవాడు త్రిపురనేని. విరసం అధికారపత్రిక అరుణతార నవంబర్ 2004 సంచికలో వల్లంపాటి రచన ఈ విషయంలో త్రిపురనేని కృషికి అద్దం పట్టింది. విశ్వనాథను నవ్య సంప్రదాయవాదిగా జీవీ సుబ్రహ్మణ్యం చేసిన ప్రతిపాదనను తిరస్కరిస్తూ నవ్య అన్న మాటే విశ్వనాథకు అతకదని, విశ్వనాథ సంప్రదాయం మనువు సంప్రదాయమని కాదంటే ఆరెస్సెస్ గోల్వాల్కర్ సంప్రదాయమని త్రిపురనేని సోదాహరణగా నిరూపించారు.

విశ్వనాథ రచించిన మహాగ్రంథం వేయిపడగలు రాసిలో ఎంత పెద్దదో ఆయన భావజాలాన్ని పర్వత స్థాయిలో వివరించడంలో కూడా అంతే పెద్దదని చెప్పాలి. విశ్వనాథలో లేని నవ్యతను ఆయన గతించిన తర్వాత ఆయన సమర్థకులు ప్రచారం చేయడంపై టీఎమ్మెస్ మండిపడ్డారు. 'నేను అవిచ్ఛిన్న సంప్రదాయార్థిని' అని అనేకసార్లు విశ్వనాథ చెప్పుకున్నా ఆయన శిష్యులు మాత్రం అతనికి 'నవ్య' తగిలించారు. విశ్వనాథ చనిపోయాడు కాబట్టి వీళ్లు బతికిపోయారు' అంటూ త్రిపురనేని చేసిన వ్యాఖ్య విశ్వనాథలో నవ్య సంప్రదాయవాదిని చూడదలిచిన వారికి నిజంగానే చెంపపెట్టు వంటిది.

**ఏంటా నవ్య సంప్రదాయం? ఏంటా అవిచ్ఛిన్న సంప్రదాయార్థిత్వం? 1930 ప్రాంతంలో హరిజనోద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు, అంతకు పూర్వమే బ్రహ్మ సమాజోద్యమం ఆంధ్రదేశాన్ని ఒక ఊపు ఊపిన నేపథ్యంలో వర్ణాంతర వివాహాలూ, మతాంతర వివాహాలు బహిరంగంగా జరగటం ప్రారంభమైనప్పుడు, వామపక్ష భావాలు విస్తరించి, జమీందారీ వ్యతిరేక పోరాటాలు కూడా ప్రారంభమైనప్పుడు.. అంతవరకు కొనసాగుతున్న భూస్వామ్య సమాజ గర్భంలోంచి పొడుచుకువస్తున్న ఈ నూతన సమాజపు పరిణామాలను చూసి జడుసుకున్న సాహిత్య రూప ప్రతిస్పందనే విశ్వనాథ వేయిపడగలు. ఆ వేయిపడగల సారాంశం అభ్యుదయం కాదూ, నవ్య సంప్రదాయమూ కాదు. పదహారణాల పచ్చి భూస్వామ్య సంప్రదాయం.** ఈ నవలా రాజంలో బయటపడిన రత్నాలను మచ్చుకు కొన్నింటిని చూద్దాం. 'పరపురుష సంగమము వలన భార్య అపవిత్రమైనట్లు, పంచముని దేవాలయ ప్రవేశము వలన దేవుని పవిత్రత చెడును' (వే.ప. 611వ

పేజీ). 'అందరమొక్కటి యను సిద్ధాంతము పశువులన్నియు నొక్కటియే యను సిద్ధాంతము వంటిది' (612). 'ఎవరి పూర్వజన్మ కృత కర్మ ప్రకారము వారు బ్రతుకుదురు' (812). 1930వ దశకంలో కూడా అంటరానితనాన్ని ఇంత బహిరంగంగా సమర్థించిన తెలుగు మేధావి విశ్వనాథ ఒక్కడే. 'ప్రేమయనునది శరీరములో బుట్టు ప్రకృతి దోషము' (చెలియలికట్ట177) అన్నది ప్రేమను గురించి విశ్వనాథ తీర్పు. ప్రేమను నమ్మేవారు వదినల్ని లేవదీసుకుపోతారని ఈ నవలలో జుగుప్సాకరమైన కల్పన చేశాడు విశ్వనాథ. ప్రేమపట్ల ఇంత అసహ్యతను రెచ్చగొడితే తప్ప వర్ణధర్మాలు నిలవవు. విశ్వనాథ రాసిన 'వీరవల్లడు' (ఆనాటికే తెలుగు నేలపై జరుగుతున్న రైతాంగ పోరాటాలను వ్యతిరేకిస్తూ నూజివీడు జమీందారును ఆకాశానికి ఎత్తిపట్టిన నవల), భూపోరాటాలకు వ్యతిరేకంగా వినోబా బావే భూదాన యజ్ఞానికి వత్తాసుగా రాసిన రచన 'శ్రీ కుమారాభ్యుదయం'

తాను రాసిన ప్రతి సామాజిక నవలకూ ఇలాంటి సమకాలీన భూమిక ఉండగా వాటిని కప్పి పెట్టి విశ్వనాథ ఆధునికుడని, కమ్యూనిస్టు సమానత్వాన్ని ప్రబోధించాడని జి.వి. సుబ్రహ్మణ్యం, వల్లభాచారి వంటి సమర్థకులు చేసిన వాదనలను టీఎమ్మెస్ ఏకిపడేశాడు. విశ్వనాథకు వర్తించని, విశ్వనాథది కాని లక్షణాలను ఆయనకు వర్తింపజేస్తూ నవ్య సంప్రదాయ ముసుగులో వక్రీకరణకు దిగిన జీవీ సుబ్రహ్మణ్యం, వల్లభాచార్యుల వ్యాసాలకు త్రిపురనేని ఇచ్చిన సమాధానం తెలుగు సాహిత్య విమర్శలో ఒక మైలురాయని, సాహిత్యాన్ని, సమాజాన్ని అర్థం చేసుకోవాలన్న ప్రతి జిజ్ఞాసువూ అక్కడ ఆగి తాను ఎంత దూరం నడిచివచ్చాడో ఆలోచించుకోక తప్పదన్న వల్లంపాటి అభిప్రాయం అక్షర సత్యం. అలా ఆగిఆలోచించుకున్న కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కేతవరపు రామకోటి శాస్త్రి వంటి విశ్వనాథ వీర శిష్యులు విశ్వనాథ ప్రభావం నుంచి చాలా దూరం నడిస్తే, జీవీఎస్, వల్లభాచార్యుల వంటి వారు విశ్వనాథపై వక్రీకరణల వద్దే ఆగిపోయారు. జీవీఎస్ ప్రతిపాదించిన విశ్వనాథ నవ్య సాంప్రదాయంపై త్రిపురనేని విమర్శ, దీనిపై వల్లభాచార్య విమర్శ, దానిపై త్రిపురనేని విమర్శ అనేది తెలుగు సాహిత్యంలో రెండు ప్రధాన ధోరణుల మధ్య జరిగిన భీకర పోరాటంగా అప్పట్లో పరిణమించింది. త్రిపురనేని ఈ సందర్భంగా చేసిన విమర్శా వ్యాసాలన్నీ 'విశ్వనాథ తిరోగమన సాహిత్యం' పేరిట సంకలనంగా వచ్చాయి.

**తత్వశాస్త్ర అధ్యయన తపస్వి**

కొన్ని పదాలు, భావనలు ఆధునికతకు సరిపడనివిగా కనిపిస్తాయి కానీ వ్యక్తుల విశిష్ట లక్షణాలను పేర్కొన వలసి వచ్చినప్పుడు అలాంటి పదాలను వాడక తప్పని పరిస్థితి చాలా సందర్భాల్లో కనిపిస్తుంటుంది. తత్వశాస్త్ర అధ్యయనాన్ని ఒక తపస్సులాగా త్రిపురనేని సాగించారంటే ఫ్యూడల్ వాసన తగులుతుందేమో కానీ.. ఆయన ఆధ్యయన తీవ్రతను వర్ణించడానికి తపస్సు అనే పదానికి మించిన పదం దొరకటం లేదు. ఆపోసన పట్టటం అంటే కూడా ఇదే అర్థమే వస్తుంది కానీ అది కూడా పాత పదభావజాలమే. విషయానికి వస్తే మార్క్సిజం గురించి చర్చ వచ్చినప్పుడు మార్క్స్ ఎంగెల్స్ లాంటి వాళ్లు రాసిన క్లాసిక్స్ గురించి త్రిపురనేని చెప్పడమే కాదు ఏదైనా సందేహం వస్తే వాటినుంచి తీసి చూపించి చెప్పేవాడు.ఏ రచనలో ఏ అంశం ఉందో చెప్పేవాడు. ఆయన వద్ద ఉన్న అతిపెద్ద లైబ్రరీలో మార్క్సిస్టు క్లాసిక్స్ ఎక్కువగా ఉండేవి. మార్క్స్, ఎంగెల్స్ మూల గ్రంథాలను ఎంత మక్కువగా చదివారో, అంతకుమించి మావో రచనలను చదివాడు. విరసం రచయితల్లో మావోను అంత సాధికారికంగా చదివిన, ప్రచారం చేసిన ఏకైక రచయిత త్రిపురనేని. సాహిత్య విమర్శలో భాగంగా తత్వశాస్త్ర చర్చను విస్తృతంగా సాగించాడు. సమస్యలమీద ఉద్యమాల్లో చర్చలు బయల్దేరి ఏది సరైందో, కాదో తెలుసుకోలేక సందిగ్ధంలో పడిపోయినప్పుడు అలాంటి వాటిపై మార్క్సిస్టు తాత్విక వైఖరి ఏమిటి అనే ప్రశ్న ఎదురైనప్పుడు సమాధానం చెప్పగలిగిన సాధికారిక స్వరం ఆయనదే. ఆ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ అధ్యయన తరగతులు జరిగినా తత్వశాస్త్రంపై క్లాస్ చెప్పాలంటే త్రిపురనేని మాస్టారే పెద్ద దిక్కుగా నిలిచేవారు. ఆయన ముందు, తర్వాత ఫిలాసఫీ చెప్పడానికి, ప్రామాణికంగా బోధించడానికి మరొకరు తయారు కాలేదని ప్రొఫెసర్ శేషయ్య అన్నమాట నిజం. కానీ తత్వశాస్త్ర విమర్శ కుడినని గంభీరంగా, గుంభనంగా ఉండటం ఆయనకు సాధ్యం కాని పని. కార్యకర్తకూ మేధావికీ తేడా లేనట్లే అందరితో ప్రవర్తించేవాడు. మార్క్సిజంపై అడ్డగోలు విమర్శలు చేసినవారిని, సైద్ధాంతిక వక్రీకరణకు పాల్పడినవారిని కత్తివాదరతో ఎదుర్కోవడమే తన పని అన్నట్లు సరికొత్త విమర్శాయుద్ధానికి సిద్ధపడిపోయేవారు. అతిశయోక్తి కాదనుకుంటే తెలుగు సాహిత్య చరిత్రలో తాత్విక అధ్యయనానికి, తాత్విక విమర్శకు తనదైన భూమికను ఇచ్చిన త్రిపురనేని గతించిన తర్వాత విమర్శకు తత్వ విశ్లేషణను అందించే ప్రక్రియ దాదాపు ఆగిపోయిందా అని ప్రశ్నించుకోవలసి వస్తోంది.

**సాహిత్య చరిత్రకు కొత్త భాష్యం**

సాహిత్యం కుట్రకాదు. రచయితలు కుట్రదారులు కాదు అనే సిద్ధాంతపత్రం తనపై రాజ్యవ్యవస్థ మోపిన తిరుపతి కుట్రకేసులో ముద్దాయిగా బోనులో నిలబడి త్రిపురనేని చేసిన కోర్టు ప్రసంగం. మొత్తం వెయ్యేళ్ల తెలుగు సాహిత్యాన్ని వర్గ దృక్పథంతో ఈ వ్యాసంలో విశ్లేషించారు. సంస్కృత సాహిత్యమంతా పీడిత ప్రజలకు వ్యతిరేకమైన పాలకవర్గ సాహిత్యమే, తెలుగులో అపారంగా ఉన్న అనువాద సాహిత్యం అంతా భూస్వామ్య వర్గ ప్రయోజనాలకి అనుగుణంగా మార్పులూ చేర్పులూ చేసి అనువదించిందే వంటి సూత్రీకరణలతో ఈ ప్రసంగం తెలుగు సాహిత్య చరిత్రకు కొత్త దృష్టి కోణాన్ని అందించింది. అలాగే 'సాహిత్యంలో వస్తుశిల్పాలు' అనే పదకొండు వ్యాసాల సంపుటి త్రిపురనేని తెలుగు సాహిత్య ధోరణులపై నిరంతర బహుముఖీన అధ్యయన ఫలితం. సాహిత్యం కోసం సాహిత్యం అనేది సంప్రదాయ దృక్పథమని, సౌందర్యం కోసం సాహిత్యం అనేది ఆధునికత ముసుగులోని సంప్రదాయ దృక్పథమని ఇవి సూచిస్తాయి. తెలుగు కవితావిప్లవాల స్వరూపం అనే వ్యాసం వెల్చేరు నారాయణ రావు గారి సిద్ధాంత గ్రంథం మీద విశ్లేషణాత్మక సమీక్ష. ఆధునిక సాహిత్య విమర్శకులుగా పేరుపడ్డ రారా, ఆర్ఎస్ సుదర్శనంల మీద త్రిపురనేని పెద్ద ఎత్తున పోరాటం చేశారు.

**ముగింపు**

మార్క్సిస్టు ఫిలాసఫీని ప్రచారం చేసిన అద్వితీయ వ్యక్తులలో అగ్రగణ్యుడు త్రిపురనేని. విద్యావంతులకు సైతం ఒక పట్టాన అర్థం కాని, గాఢమైన తాత్విక అంశాలను వీధుల్లోకి తెచ్చి జనంలో ప్రచారం చేసిన ఘనత టీఎంఎస్‌దే. తెలుగు సాహిత్యంలోనే కాదు సామాన్య జనం ముందు కూడా తత్వశాస్త్రాన్ని జనరంజకంగా మలిచిన ఘనత తన సొంతం. తత్వశాస్త్రాన్ని విశ్వవిద్యాలయాల చీకటి గదుల్లోంచి బయటకి లాక్కురండి అనే మావో నినాదాన్ని టీఎంఎస్ కొన్ని వందల సార్లు సభల్లో ప్రస్తావించేవారు. జీవితం చివరి పది, పన్నెండేళ్ల పాటు ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధం లేక, స్తబ్దుగా ఉన్న దశలోనూ కమ్యూనిస్టేతర భావజాలాన్ని ఆయన ఏమాత్రం దగ్గరకు రానిచ్చేవారు కాదంటే మార్క్సిస్టు తాత్విక పునాది ఆయనపై వేసిన ప్రగాఢ ప్రభావమే కారణం. త్రిపురనేని అస్తమయం తెలుగునేలపై తాత్విక విమర్శాపరంపరకు జరిగిన అతి పెద్ద నష్టం. ❋

# గురజాడ 154వ జయంతి- ప్రభుత్వ నిర్లక్ష్యధోరణి




ఈ ఆహ్వానాన్ని చూసి కంగారు పడుతున్నారా? ఆగస్టు 29నే కదా ముఖ్యమంత్రి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఘనంగా గిడుగు రామమూర్తి జయంతిని భాషా దినోత్సవంగా జరుపుకున్నాం... మళ్ళీ 23 రోజులకే అదే ప్రభుత్వం భాషా దినోత్సవం జరుపుతుందేమిటా అని! గురజాడ, గిడుగు- ఇద్దరూ మంచి మిత్రులు. కలిసి ఏకకాలంలో ఆధునిక భాషా సాహిత్య సేవల్ని గొప్పగా తెలుగుతల్లికి సమర్పించారు. అంతమాత్రం చేత ఇలా ఇద్దరి జయంతుల్ని భాషాదినోత్సవాలంటే ఎలా?

గురజాడ వారి ఉద్దేశంలో భాష సాహిత్యం ద్వారానే మారుతుంది. అందుకని ఆయన ఆధునిక నాటకం, ఆధునిక కథ, ఆధునిక గేయం, ఆధునిక కవిత్వం, ఆధునిక బాలసాహిత్యాలకు ఆద్యుడై ఆధునిక తెలుగు సాహిత్యానికి యుగకర్తయ్యాడు. గిడుగు ....ఆధునిక భాషాశాస్త్రవేత్త, ఆధునిక సాహిత్య మొదటి విమర్శకుడు, వ్యావహారిక భాషోద్యమకర్త. అందుకని గిడుగు జన్మదినాన్ని భాషా దినోత్సవంగా, గురజాడ జన్మదినాన్ని ఆధునిక సాహిత్య దినోత్సవంగా భాషోద్యమకారుల, రచయితల కోరిక మేరకు అప్పటి ప్రభుత్వాలు ప్రకటించాయి.

గురజాడ 150వ జన్మదినాన్ని అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాపితంగా ఘనంగా జరిపింది. కానీ గిడుగు 150వ జయంతిని ఎవరూ పట్టించుకోలేదు. ఒక నిబద్ధతతో డా॥సామల రమేష్‌బాబు, డా॥వేదగిరి రాంబాబు కలిసి పర్లాకిమిడి నుంచి ప్రారంభించి ఆయన నడయాడిన అన్ని ప్రాంతాలలోనూ సభలు నిర్వహిస్తూ ఆయన మరణించిన చెన్నయ్‌లో కూడా సభని నిర్వహించి హైద్రాబాదులో ముగింపు సమావేశాన్ని జరిపారు.

ఈ సంవత్సరం ఈ జయంతి వేడుకల్ని ప్రభుత్వం జరిపిందనుకోండి. రాష్ట్ర భాషాసాంస్కృతికశాఖ భాషాదినోత్సవాన్ని (గిడుగు జయంతిని) విజయవాడలో ముఖ్యమంత్రి సమక్షంలో గొప్పగా జరిపింది. కానీ గురజాడ 154వ జయంతిని విజయనగరానికే పరిమితంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ విజయనగరం జిల్లా విభాగం ఆధ్వర్యంలో జరిగింది. అది కూడా సాహిత్యం కన్నా సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ.

సరే ఎలాగోలా ప్రభుత్వం గురజాడ వారి జయంతిని నిర్వహిస్తోందని ఆనందిద్దాం అంటే గురజాడ జయంతి 'ఆధునిక సాహిత్య దినోత్సవమైతే' ప్రభుత్వ ఆహ్వానంలో 'భాషాదినోత్సవం' అని ముద్రించారు. బ్యానర్లు కూడా అలాగే తయారు చేశారు.

కొంతమంది సాహితీవేత్తలు 'ఇది భాషాదినోత్సవం కాదు, ఆధునిక సాహిత్య'మని గోల పెడితే చివరి నిమిషంలో బ్యానర్లను ఆహ్వానపత్రాల్ని తిరిగి రాయించారు. విజయనగరంలోనే ఇలా జరగటం వింతగా లేదూ.

000



మరో సంగతి...పాఠకులకు గుర్తుంటే విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర కూర్చున్న స్థితిలో గురజాడ విగ్రహం ఒకటి ఉండేది. అక్కడ ఫ్లైవోవర్ వేస్తున్నప్పుడు దానిని తాత్కాలికంగా తొలగించారు. ఫ్లైవోవర్ పూర్తయి వాహనాల, మనుషుల రాకపోకలు సాగుతున్నాయి. అయినా గురజాడ వారి విగ్రహం అక్కడ ఉంచాలనే ఆలోచన ఎవరిలోనూ లేదు.

150వ జయంతికి ముందు కొందరు సాహితీవేత్తలు గురజాడ విగ్రహాన్ని మళ్ళీ అక్కడ ప్రతిష్ఠించాలని డిమాండు చేశారు. ఈనాడు, సాక్షి లాంటి దినపత్రికలు ఈ వార్తని తమ మెయిన్ ఎడిషన్స్‌లో ప్రచురించాయి. అయినా కదలిక లేకపోవడంతో ఆ పత్రికల విలేఖరులు అసలు విగ్రహం ఎక్కడుందా అని ఆరా తీయటంతో మున్సిపల్ 'యూజిమి' బుట్టలో పడున్నట్లు గమనించి ప్రచురించారు. సాహితీవేత్తలు ఆ విగ్రహాన్ని శుభ్రం చేసి మళ్ళీ మొదటి ప్రాంతంలో పెట్టాలని ఆందోళన చేశారు. ఫలితంగా 150వ జయంతినాడు హడావిడిగా ఆ కూడలిలోనే గురజాడ విగ్రహాన్ని ప్రతిష్టించారు.

ఇది నాటి మాట. మరి నేటిమాటో..? గురజాడ వారి 154వ జయంతి నాడు విశాఖపట్నంలో వర్షం జోరుగా కురుస్తోంది. అయినా లెక్కచేయకుండా రిటైర్డ్ ఐఏయస్ అధికారి సి.ఎస్.రావు, మాజీ వైస్ ఛాన్సలర్ బాలమోహనదాస్, కొవ్వలి లక్ష్మీనారాయణ, శేఖరమంచి ప్రభాకర్, కోదాడ నుంచి వచ్చిన సుశర్మ, విజయనగరం నుంచి విచ్చేసిన నాగేశ్వరరావు, పార్వతీపురం నుంచి వచ్చిన నారం ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ నుండి వచ్చిన వేదగిరి రాంబాబు, కొంపల్లె శర్మ, కె.బి.లక్ష్మి, పెమ్మరాజు సంధ్యారాణి మొదలైన ముప్పయిమందికి పైగా సాహితీవేత్తలు పొద్దున్నే తొమ్మిది గంటలకు గురజాడ విగ్రహానికి పూలమాలల్ని వేశారు. విచిత్రమేమిటంటే సరిగ్గా ఆ సమయానికి వానజల్లులు ఆగిపోయాయి. ఊరేగింపుగా అక్కడి నుంచి బయల్దేరి పది గంటలకల్లా పబ్లిక్ లైబ్రరీకి చేరుకుని సభను ఘనంగా జరిపారు. స్థానిక ప్రముఖులతో కిక్కిరిసిన ఈ సభ సహృదయ సాహితీ (విశాఖ), శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ (హైదరాబాద్)ల సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ 154వ జయంతి కన్నులపండుగగా జరిగింది.

-వేదగిరి రాంబాబు

# 'తెనుగులెంక'సూక్తులు-15



***కులము వారికెల్ల తలపుండ్లు కడిగించి***
***కూడుపెట్టు మంత్రి కాదెవండు***
***పదవి కొరకు పుట్టినది కులతత్త్వమీ***
***తంత్రమరయుము స్వతంత్రబుద్ధి***

'తెనుగు లెంక' 'అభినవ తిక్కన'
**తుమ్మల సీతారామమూర్తి.**

ప్రపంచంలో నివసించే మానవులందరిదీ ఒకటే కులం. అదే మానవ కులం. అందరి శరీరభాగాలు ఒక్కటే. అందరి నెత్తురూ ఒక్క రంగులోనే ఉంటుంది. అందరి గుండెలు ఒకేలా కొట్టుకుంటాయి. అందరూ బ్రతకడానికే పని చేస్తుంటారు. అందరూ ఆహారం తినే బ్రతుకుతుంటారు. అందరూ గాలే పీలుస్తారు. ఏదేశంలో ఉన్నా, ఏ ప్రాంతంలో నివసించినా, ఏ ఊళ్ళో బ్రతికినా తేడా అనేది కనిపించదు.

మతాలు జీవన విధానాలు. కులాలు వృత్తిసంకేతాలు. కాల క్రమంలో కులమతాలు తమ స్వార్థం కోసం ఉపయోగించు కొనేవారి వలలో చిక్కుకున్నాయి. కొన్నిసంవత్సరాలకు ముందు ఆంధ్రరాష్ట్రంలో ఏ గ్రామంలో నయినా ఏ కులం వారయినా ఇతరకులం వారిని అన్న, మామ, బాబాయి అనో అక్క, అత్త, పిన్ని అనో పిలిచేవారు. సమస్యల్లో ఒక్కటిగా ఉండి గ్రామానికి ఎలాంటి ప్రమాదం జరుగ కుండా కాపాడుకొనేవారు. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ నాయకత్వం వహిస్తే ఆయన కులానికి చెందినవారు మాత్రమే పాలుపంచుకోలేదు.

ఏ కులం వాడయినా తనకులం వాడితోనే మాట్లాడతానని, తన కులం వాడిచేతనే పనులు చేయించుకొంటానని, తన కులం వాడిదగ్గరే పని చేస్తానని, తన కులం వాడితోనే లావాదేవీలన్నీ నిర్వహిస్తానని అనడు. రాజకీయ నాయకుడు కూడా నా కులం వాళ్ళు మాత్రమే నాకు ఓటు వేయండని, నేను గెలిస్తే నా కులానికి మాత్రమే సేవ చేస్తానని, నా కులం వాళ్ళకు మాత్రమే అవకాశాలు కల్పిస్తానని ఉపన్యాసాలు ఇవ్వడు. గెలిస్తే పదవులు పొంది సొంతపనులు చేసుకుంటూ, కుల మత రహితంగా ప్రజాసేవ చేస్తున్నట్టు నటిస్తూ కాలం గడుపుతారు. ఓడిపోతే ప్రజలు తమ పేరు మరచిపోకుండా ఉండడానికి, తన నాయకత్వం నిలబడడానికి ఏదో ఒక మిష కల్పించుకొని ఉద్యమాలు మొదలుపెడతారు.

కులం గురించి చెప్పే వారందరికి కులాభిమానం జన్మతః వచ్చింది కాదు. రక్తంలో చేరింది కాదు. పదవుల కోసం కులాభిమానాన్ని ప్రదర్శించేవారు ఏ లాభాపేక్ష ఉన్నప్పుడు సమస్యలు తీర్చడానికి ముందుకొచ్చారా. అప్పుడు గుర్తుకు రానివన్నీ మంత్రులుగా పదవులు పోగానే గుర్తుకొస్తాయి. వాటి కోసం ఉద్యమాలు చేస్తారు. ప్రజలను రెచ్చగొడతారు. అమాయక జీవుల ప్రాణాలకు ముప్పుతెస్తారు. ప్రజల సొమ్ముతో ఏర్పరచిన ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడానికి సిద్ధపడతారు. అలాంటి వాళ్ళ గురించి తుమ్మల ఈ పద్యం చెప్పారు.

"ఏ మంత్రి కూడా తన కులం వారికి తలపుండు కడిగించి అన్నం పెట్టడం లేదు. ఈ కులతత్వం పదవుల సంపాదన కోసం కొంతమంది రేపెట్టేది మాత్రమే. ప్రజలు ఆ నాయకుల ఉచ్చులో పడకుండా స్వతంత్రంగా ఆలోచించుకోవాలి. ఆ నాయకుల వ్యూహాన్ని గుర్తించి వారి మాయలో పడిపోకూడదు" అని తుమ్మల వారు చెప్పారు.

ఇది నిజం. అధికారంలో ఉన్నప్పుడు చేయలేనివాడికి, అధికారం పోయిన తరువాత దాన్ని గురించి మాట్లాడే హక్కు లేదు. కులాలను రెచ్చగొట్టి, సమాజాన్ని వర్గాలుగా చీల్చేవారిని వాళ్ళు తమకులానికి చెందిన వారైనా ప్రజలు క్షమించకూడదు. వారిని నమ్మి దేశద్రోహానికి ఒడిగట్టకూడదు.

**–డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ,**
98497 99711



డా॥ఎన్.గోపి నానీలకు నలిమెల భాస్కర్ చేసిన తమిళానువాదం 'నానీ కవిదైగళ్' గ్రంథాన్ని మద్రాసు విశ్వవిద్యాలయం (చెన్నయ్)లో తమిళ మహాకవి శిరిపి బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ఎడమనుండి కుడికి తెలుగు శాఖాధిపతి ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్, శిరిపి, డా॥నలిమెల భాస్కర్, డా॥ఎన్.గోపి మరియు డా॥ఒప్పిలా మదివాసన్ ఉన్నారు.




**మ**ల్లెతీగ-కవితా వికాస వేదిక-ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 18 ఆదివారం విజయవాడ హోటల్ ఇలాపురంలో కథ, కవిత, గజల్స్‌పై జరిగిన శిక్షణా శిబిరం మరియు వంద కవితల పండుగలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్. చిత్రంలో బిక్కి కృష్ణ, విహారి, రెంటాల వెంకటేశ్వరరావు, నెల్లుట్ల రమాదేవి, అల్లూరి గౌరీలక్ష్మి, డా॥యం.బి.డి.శ్యామల, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గట్టిం మాణిక్యాలరావు, డా॥వై.మోహన్‌రావు, శ్రీమతి కాంతికృష్ణ వున్నారు.

# 'తెలుగు సాహిత్య చరిత్ర' మరోకోణంలో...

(తెలుగు సాహిత్య చరిత్ర- (భాష- సామాజికత- కులాధిపత్యం) రచన : డా॥కత్తి పద్మారావు, ముద్రణ 2015 ప్రతులకు- కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీవనం, అంబేద్కర్ కాలని, పొన్నూరు-522124. ఫోన్- 08643-241241 : 98497 41695, వెల- 500/- (గ్రంథాలయ ప్రతి- రూ 1000/-)

'తెలుగు సాహిత్య చరిత్రకారులు' అనే పుస్తకాన్ని నేను రచించిన సమయానికి (2011) సంపూర్ణంగా సాహిత్య చరిత్రలు రచించిన వారు 20కి పైగానే లభించారు. ప్రస్తుతం డా॥ కత్తి పద్మారావుగారు ఇంతకుముందు సాహిత్య చరిత్రకారులు రచించిన పద్ధతిలో కాకుండా తనదైన ముద్రతో ముఖ్యంగా భాష, సామాజికత, కులాధిపత్యం అనే అంశాల్ని నేపథ్యంగా తీసుకొని సాహిత్య చరిత్రను రూపొందించే ప్రయత్నం చేశారు. తెలుగుభాషా ప్రాచీనత- చారిత్రక నిరూపణ అనే శీర్షికతో ప్రారంభించి, 'మహాకవి జాషువా- నేను' అనే శీర్షికతో ముగించారు. 42 శీర్షికలుగా సాగిన తెలుగు సాహిత్య చరిత్ర గ్రంథాన్ని రూపొందించటానికి డా॥ కత్తి పద్మారావుగారు పడిన శ్రమ, ముఖ్యంగా విషయ సేకరణలోను, విశ్లేషణలోను, విషయ ప్రతిపాదనలోనూ అక్షరాక్షరంలో ప్రతిబింబిస్తున్నదని చెప్పటం సముచితం.

ఈ గ్రంథానికి మున్నుడి రాస్తూ డా॥సామల రమేష్‌బాబు గారు కత్తి పద్మారావుగారి అన్వేషణ, భాషాసాహిత్యపు లోతుల్లోకి వెళ్లి డొంకను కదిలించింది. నేటి సాహిత్య విద్యార్థులకు, పరిశోధకులకు దారిచూపించగల గ్రంథానికి నేపథ్యం అయ్యింది. కత్తి పద్మారావుగారు ప్రమాణ బద్ధంగా వ్రాసే రచయిత. సామాజిక తాత్త్విక దృక్పథంలో సత్యశోధన నిష్ఠంగా వ్రాసిన గ్రంథం ఇది..... సామాజిక చారిత్రక అన్వయంతో భాషాచరిత్రను చూడాల్సిన అవసరాన్ని విస్పష్టంగా ఎత్తి చూపారు" అని కత్తి పద్మారావుగారి దృక్కోణాన్ని అభినందించారు.

డా॥ కత్తి పద్మారావుగారు తాను తెలుగు సాహిత్య చరిత్రను రచించటానికి గల కారణాన్ని తెలుపుతూ 'తెలుగు భాషాచరిత్రలో ఇప్పటి వరకు బ్రాహ్మణాధికృత కొనసాగిందనిపించి ఈ సమాజాన్ని నిర్మించిన సామాజిక శక్తుల, మూల వాసులభాషా సాహిత్యాలను అణచివేసే ప్రయత్నాన్ని నేను కనుగొన్నాను..' అని స్పష్టం చేశారు. తాను రచించిన గ్రంథమే గొప్పదని చెప్పకుండా "ఇప్పటివరకు వచ్చిన వాటికి ఒక పూరణగ్రంథం ఇది. ఇంకా పూరించాల్సిన అనేక అంశాలు తెలుగు సాహిత్య చరిత్రలో వుండనే వుంటాయి. ఆ అంశాలకు, ఇది ప్రేరణ గ్రంథం అవుతుంది" అని చెప్పటంలో తన వినయం, పరిమితి, ఇంకా జరగాల్సిన కృషిని స్పష్టం చేశారు ఉద్యమ సాహిత్యంలోనూ అగ్రవర్ణాలుగా చెప్పబడే వారి పెత్తనం సాగిన తీరును పద్మారావుగారు నిరసించారు. ప్రాంతీయవాద, స్త్రీవాద, దళిత, మైనార్టీ, ఆదివాసీల సాహిత్యాన్ని సామాజిక దృక్కోణంలో అధ్యయనం చెయ్యవలసిన అవసరం ఉందని చెబుతూ ముఖ్యంగా దళితసాహిత్య కారుల స్వరాల్లో కొన్నిటిని మాత్రమే పలికించినట్లు, ఇంకా ఎండ్లూరి సుధాకర్, సతీష్ చంద్ర వంటి ఎందరి మీదో రాయవలసి ఉంది" అని పలికిన మాటల్ని కూడా గమనిస్తేనే ఈ గ్రంథం పరిమితి అవగాహనకు వస్తుంది.

దళిత, గిరిజన సాహిత్యాన్నంతా జానపద సాహిత్యంగా కొట్టిపార వేసిన అనువాద సాహిత్యాన్ని, భోగ, విరాగ సాహిత్యాన్ని అసలైన తెలుగు సాహిత్యంగా ప్రచారం చేసుకొన్న తీరును పద్మారావుగారు దుయ్యబట్టారు. శ్రీశ్రీ అస్పృశ్యతను గూర్చి రాయక పోవటాన్ని ఆశ్చర్యకరమైన విషయంగా చెప్పారు.




'నడుస్తున్న చరిత్ర' మాసపత్రికలో నిరంతరాయంగా వచ్చిన వ్యాసాల సమాహారం ఈ గ్రంథం. అప్పుడప్పుడు రచించిన వ్యాసాలైనా గ్రంథ ప్రణాళిక దృష్టిలో వచ్చినవి కాబట్టి ఇవి ఒక క్రమంలో ఉన్నట్లు తెలిపారు.

సాహిత్య చరిత్రను భాష, సామాజికత, కులాధపత్యం కోణంలో పరిశీలించారు కాబట్టి ముందుగా తెలుగుభాష, ప్రాచీనత, భాషా సాహిత్యాలు, శాసనాల సమన్వయం, మౌఖిక, లిఖిత భాషలు, సాహిత్య నేపథ్యాల్ని వివరించారు. 'మౌఖిక, లిఖిత సాహిత్య చారిత్రక నేపథ్యం' అనే శీర్షికలో లిఖిత సాహిత్య ప్రస్తావనలో ముందుగా రఘునాథ భూపాలుని, ఆ తర్వాత శ్రీనాథుని గూర్చి మాత్రమే తెలపటంతో ఆ శీర్షిక అసంపూర్ణమనిపిస్తుంది. ప్రబంశ కవుల్లోను తెలుగు పలుకు బదుల ప్రయోగాలు మిక్కుటంగానే ఉన్నాయని గుర్తించాలి. జాషువా మీద రచయిత కొంచెం ఎక్కువ అభిమానాన్ని ప్రకటించినట్లు స్పష్టమవుతుంది.

నన్నయ, నక్నెచోడుడు, పాల్కురికి, తిక్కన ఎర్రన మొదలైన వారిని గూర్చి తెలిపి మళ్లీ మధ్యలో తెలుగు భాషకు ప్రాంతీయ భేదం లేదు అనే వ్యాసాన్ని చేర్చటంలోని ఆంతర్యాన్ని రచయిత వివరించాలి. యానాదులు తెలుగుభాషకు ఆద్యులని, జానపద స్త్రీలు శబ్దకోశాలని, అంబేద్కర్ స్వరం భీమన్న అని, విమర్శలో శూద్ర దృక్పథం రావాల్సిన అవసరం ఉన్నదని ఇంకా ఎన్నో విశేషాల్ని గ్రంథంలో పొందు పరచిన రచయిత అభినందనీయులు.

376వ పుటలో నానీ కవులకు జాషువ 'సందేశం' అనటం కంటే 'స్ఫూర్తి' అంటే బాగుండేది. ఎర్రన కవి- సామాజిక మాండలికత అని 130, 131, పేజీల్లో చెప్పిన విషయాల్నే 138,139,140 పేజీల్లో చెప్పటం పునరుక్తి.

ఒక మంచి ఆలోచనతో కొత్త కోణంలో రచించబడిన పద్మారావు గారి 'తెలుగు సాహిత్య చరిత్ర' లో 'ముద్రా రాక్షసులు' చాలామంది కనిపిస్తున్నారు. సన్మిత్రులు, మాసోదలు పుట 11) సామాల (19) మదీయచక్రు (20) గురజాడ గురించి (21) వేలికి (24) వాల్మికి (651 ఇనీబిశిరిరీబిజి....ఈ పదాలున్న మూల గ్రంథి రచయిత - (79) పేరు లేదు. ఇలాంటి వాటిని మలిముద్రణలో సవరించుకోవచ్చు.

ఇంతవరకు వచ్చిన సాహిత్య చరిత్రల కంటే భిన్నంగా ఒక కొత్తకోణంలో రచించే ప్రయత్నం చేసిన పద్మారావు గారి స్ఫూర్తితో మరిన్ని రచనలు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. సాహిత్యాభిమానులు తప్పని సరిగా కొనిచదవ దగిన గ్రంథమిది. విద్యార్థులకు పాఠ్యపుస్తకంగా ఉండదగిన అర్హతలు ఈ గ్రంథానికి ఉన్నాయి. రచయితకు, ప్రచురణకర్తకు, ప్రోత్సాహకులకు అభినందనలు.

**-డా॥గుమ్మా సాంబశివరావు,** 98492 65025

పుస్తక సమీక్ష

# రుద్రమదేవి

శ్రీశ్రీ అన్నట్లుగా "తారీఖులు దస్తావేజులు
ఇవికావోయ్ చరిత్ర కర్థం
చారిత్రక విభాత సంధ్యల
మానవ కథ వికాసమెట్టిది?" – మానవ వికాసం తోపాటు మహిళావికాసాన్ని కూడా తెలిపిన నవల శ్రీమతి పాటిబండ్ల బేబి కౌసల్య రచించిన రుద్రమదేవి.

పదమూడవ శతాబ్దంనాటికే ఒక రాణిగా యుద్ధాలు, చేసి, విజయాలను సాధించిన ప్రపంచ ప్రథమ మహిళ ఆమే. రుద్రమదేవి శౌర్య ధైర్యాలను, పరిపాలనా దక్షతను, రాజ్యాభివృద్ధిని అభివ్యక్తం చేయడానికి బేబి కౌసల్య రచించిన చారిత్రక నవల ఇది. చారిత్రక నవలలకు కొన్ని పరిమితులుంటాయి. చరిత్రకు భంగం కలగకుండా, రాజకీయ వాతావరణాన్ని విసుగు కలిగించకుండా, పాత్రపోషణకు విఘాతం కలుగకుండా, కుటుంబ బంధాలకు బాధ కలుగకుండా రచన చేయడంలో రచయిత్రి విజయం సాధించింది. నిజానికి చరిత్ర పుటలలో రాణిరుద్రమకు చరిత్రకారులిచ్చిన స్థానం అతిస్వల్పం మాత్రమే. ఆమె బహుముఖప్రజ్ఞను, ఉన్నతవ్యక్తిత్వాన్ని విశదం చేస్తూ పాఠకులు కథా గమనంలో మమేకమై రాణి రుద్రమను వారింటి పెద్దకూతురుగా భావించేటట్లుగా రచయిత్రి నవలను తీర్చిదిద్దారు. చరిత్ర పుస్తకాలలో ఆమెకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది నవలలో ఆమెకొక స్థానాన్ని కల్పించారు రచయిత్రి.

మధ్య యుగాలలో పితృస్వామ్య వ్యవస్థ పరాకాష్ఠస్థితిలో ఉండేది. పురుషుల్లో భోగలాలసతతో కూడిన జీవనవిధానం కనిపించేది. మహిళలు మగవారి కోరికలు తీర్చే సాధనాలుగా భావింపబడేవారు. 'అలాంటి కాలంలో ఒక మహిళ మగవేషాన్ని ధరించి పరిపాలన పగ్గాలను చేపట్టటం మహాద్భుత సన్నివేశం. ఆ నేపథ్యాన్ని వివరిస్తూ రచయిత్రి 'స్త్రీ పురుష భేదం పునరుత్పత్తికోసం ఏర్పడిన భౌతికమైన భేదం తప్ప మానసికం కాదు' అని చెప్పడం లింగ వివక్షా సంస్కృతికి చెంపపెట్టు వంటిది.

గణపతిదేవుడు కూతురైన రుద్రమకు భావిరాణిగానే శిక్షణ ఇప్పించాడు. రుద్రమతో యుద్ధవిద్యల్లో సమ ఉజ్జీగా ఉన్న వీరభద్రునికిచ్చి వివాహం చేశాడు. భార్యను రాణిగా చేయకుండా తానే రాజ్యాన్ని పాలించాలనుకున్న వీరభద్రుడు పురుషాహంకార సంస్కృతికి ప్రతినిధి.




ఆ అహంకారంతోనే కుట్రపన్ని రుద్రమను పడగొట్టాలను కుంటాడు. ఐతే సమర్థురాలయిన రుద్రమ బయట శత్రువులను ఎంత సమర్ధవంతంగా అణచివేసిందో, అంతరంగాన్ని బయట పెట్టి అంతశ్శత్రువుగా మారిన వీర భద్రుని ప్రయత్నాన్ని అంత చాకచక్యంగా అణగద్రొక్కింది. అది పాలనాదక్షతకు మచ్చుతునక.. ఈ సందర్భాన్ని విశ్లేషించుకున్నా రుద్రమదేవి ఆలోచనా విధానం– ఆమె రాణిగా, కుటుంబ స్త్రీగా ఎంత పరిణతి సాధించిందో రచయిత్రి చక్కగా నిరూపించారు. ఆమెను అధికారదాహంతో అయినవాళ్ళు అంతం చేయాలనుకున్నా, అభిమానుల అండతో ఆమె వాటిని అధిగమించింది. రాజద్రోహుల అంతు చూసింది.

రైతుల, వృత్తి కళాకారుల సమస్యలను తెలుసుకోగోరి రుద్రమదేవి గ్రామాల్లో సంచరించడం, జానపదుల జీవనవిధానాన్ని, పేదరికాన్ని అర్థం చేసుకోవాలనుకోవడం వంటి విషయాలు చెప్పడం రచయిత్రి గొప్పతనం. అంతకుముందు చరిత్రలో ఏ ప్రభువు చేయని పాలనాపరమైన పనులివి. ఆయాసమస్యలను పరిష్కరించినట్లుగా వర్ణించి చెప్పినట్లయితే మరింతగా బాగుండేది. ఆమెకు గురువులంటే అపారమైన భక్తి ప్రపత్తులు ఉండేవని, అందుకే మఠాలు కట్టించిందని రచయిత్రి చెప్పారు. ఆనాటి విదేశీయాత్రికులు పేర్కొన్నట్లు ఆమె కట్టించిన ప్రసవాలయాలను కూడా ప్రస్తావిస్తే మరింత బాగుండేది.

ప్రజాక్షేమాన్ని, రాజ్యక్షేమాన్ని ప్రాణప్రదంగా భావిస్తూ– మహోదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన రుద్రమదేవి మహత్తర జీవితాన్ని ఉత్సాహం, ఉద్వేగం, ఉద్రేకం, ఉత్కంఠలకు భంగం లేకుండా రచించిన రచయిత్రి కృషి అనన్యమని చెప్పుకోవచ్చు.. చారిత్రక నవలా లక్షణాలన్నింటినీ పాటిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ రచించిన ఈ నవలను నేటి తరం చదవాలి.

**రుద్రమదేవి** –చారిత్రక నవల, రచయిత్రి : శ్రీమతి పాటిబండ్ల బేబికౌసల్య, వెల–100/– ప్రతులకు : రచయిత్రి, 205 సాయికృప టవర్స్, 6వ లైను, కోబాల్టుపేట, గుంటూరు – 522002 ఫోన్ : 98497 99711

**–డా॥ జె.కనకదుర్గ,** 94911 40299

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు
'అమ్మనుడి', జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ–520 004.

ఇ–మెయిల్ : *editorammanudi@gmail.com*

## 'అమ్మనుడి' లభించుచోట్లు

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా,
కాచిగుడా. **హైదరాబాదు – 500 027.**
ఫోన్ :040–24652387

మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ – 520 002**. ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్,
**నెల్లూరు**–1. ఫోన్:7386223538.




# నెల్లూరు జిల్లా తెలుగు భాషోద్యమ సమితి ఉద్యమస్ఫూర్తి

తెలుగును రక్షించుకోవాల్సిన ఆవశ్యకత వుందని నెల్లూరు జిల్లా సంయుక్త కలెక్టర్ -2 ఆర్.రాజ్‌కుమార్ అన్నారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో మాతృభాషలో విద్యాబోధన ఆవశ్యకత అంశంపై సెప్టెంబరు 16వ శుక్రవారం జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాజ్‌కుమార్ మాట్లాడుతూ- ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాంతీయభాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు డా॥సామల రమేష్‌బాబు మాట్లాడుతూ-2003 సంవత్సరం నుంచి సమాఖ్య చేసిన పోరాటాలతోనే తెలుగుభాషకు మంత్రిత్వశాఖ ఏర్పడిందని, ఇటీవల ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేస్తూ, జీవో నెం 10/14-9-2016 ఇచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా బోర్డుల మీద, ప్రభుత్వ వ్యవహారాల్లోనూ తెలుగుకే ప్రాధాన్యతనివ్వాలని, తెలుగు ప్రతిచోట కనపడాలి, వినపడాలి అనే అంశాన్ని సమాఖ్య, తదితర భాషోద్యమకారుల కోరిక మేరకు జీవో 11/14-9-2016 ఇచ్చిందని, ఇవి త్వరలో ఆచరణలోకి వస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. ఈ దిశగా జరిగే ఉద్యమాలు నిర్మాణాత్మకంగా వుండాలని, ఇరవై ఏళ్ళుగా చలంచర్ల భాస్కరరెడ్డి గారు భాషోద్యమ కార్యకర్తగా నిరంతరం పని చేస్తున్నారని, అటువంటివారిని ప్రభుత్వం గుర్తించి, పురస్కారంతో సత్కరించడం సమంజసంగా వుందని అన్నారు. తెలుగు భాషోద్యమ సమాఖ్యకు అనుబంధంగా తెలుగు భాషోద్యమ సమితిని నెల్లూరులోనే మొట్టమొదటగా ప్రారంభించారని, అధికార భాషగా తెలుగు అమలుకు కృషి చేసి జిల్లాల స్థాయిలో పూర్తి ఫలితాలు సాధించిన కీర్తి నెల్లూరుకే దక్కుతుందని అభినందించారు. సమితి నాయకుడు గుంపర్లపాటి కామయ్య అధ్యక్షత వహించారు. మంత్రి నారాయణ ఓఎస్‌డి పెంచలరెడ్డి, బీవీ నరసింహం, బద్దిపూడి శీనయ్య తదితరులు పాల్గొన్నారు. సభానంతరం చలంచర్ల భాస్కరరెడ్డి గారిని ఘనంగా సన్మానించారు.

## పుస్తక సమీక్ష

# చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు

సంస్కృతిలో భాగమైన ఆంధ్రుల ఆటలు అంతరించి పోతున్నాయని ఆవేదన చెందే తెలుగువారి మనస్సులకు సాంత్వన కలిగించే పుస్తకమిది. ప్రాచీనమైన ఎన్నో ఆటలను గుర్తించి, ఆ ఆటలను ఎంత మంది ఆడాలి, ఎలా ఆడాలి, ఎక్కడ ఆడాలి, ఆడడానికి కావలసిన వస్తువు లేవి మొదలైన వివరాలతో పాటు ఆడే విధానాన్ని వివరంగా, విపులంగా తెలియజేసిన గ్రంథరాజం ఈ "చిన్ననాటి ఆటలు- జ్ఞాపకాల మూటలు". ప్రతి ఆటకు ఒక బొమ్మను వేయించడం- అదీ రంగుల్లో ముద్రించడం ఈ పుస్తకానికి మరొక ఆకర్షణ.

ధూర్జటి కాళహస్తి మహత్మ్యంలో తిన్నని వృత్తాంతంలో కొన్ని క్రీడా విశేషాలను పేర్కొన్నాడు. చిట్లి పొట్లకాయ, సిరిసింగణావతి, తూరనతుంకాలు, పిల్ల దీపాలంకి అనేవి ఆ ఆటల్లో కొన్ని ధూర్జటి ఆ ఆటలు ఎలా ఆడాలో చెప్పలేదు. కాలక్రమంలో ఆ ఆటలు కనుమరుగయ్యాయి. వాటిని ఆడే విధానం తెలియకుండా ఉండిపోయింది. భవిష్యత్ తరాలకు అలాంటి సందేహం కలగకుండా గ్రంథకర్తలు ఆటలకు సంబంధించిన వివరాలన్నింటిని తెలిపి గ్రంథానికి సార్వకాలిక మైన ప్రయోజనాన్ని సంతరింప జేయడం ముఖ్యంగా చెప్పుకోదగిన అంశం.

ఈ పుస్తకంలో వంద ఆటలకు సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. ఆ ఆటల్లో అధికభాగం ప్రాచీన తెలుగు సంస్కృతికి సంబంధించినవే. ఆధునిక కాలంలో పరసంస్కృతీ ప్రభావంతో తెలుగు నేలమీద ఆడబడుతున్న జంపింగ్ గేమ్, పోస్ట్ ఆఫీస్ మొదలైన ఆటలు కూడా ఈ గ్రంథంలో చోటు చేసుకున్నాయి. విశ్వనాథ సత్యనారాయణ గారు చెప్పినట్లు ప్రతి ఆటకు ఒక పరమ ప్రయోజనం ఉంటుంది. ఏ ఆట వలన ఎలాంటి ఉపయోగం ఉంటుందో రచయితలు తెలియజేయడం ఈ గ్రంథంలోని మరొక ఉపయుక్తమైన అంశం.



బుద్ధినైశిత్యం, వ్యూహచాతుర్యం, లక్ష్య ఛేదన, సృజనాత్మకత, ఏకాగ్రత, పరిశీలనా శక్తి, దేహదారుఢ్యం మొదలైన శక్తులను అభివృద్ధి చేసే ఈ ఆటలను ప్రతి విద్యాసంస్థలో ఆడించడం మంచిది. అందుకోసం ఈ పుస్తకాన్ని ప్రతి పాఠశాలలో ఉంచగలిగితే పుస్తక ప్రచురణకు పరమార్థం చేకూరుతుంది. క్రీడాభిమానులు సంతసిస్తారు.

**చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు** -సేకరణ, కూర్పు : డా॥ జాస్తి శివరామకృష్ణ, కందుకూరిరాము, బొమ్మలు : దుంద్రపెల్లి బాబు, ప్రచురణ : కాంతి ఫౌండేషన్, వెల : 200/- ప్రతులకు : కాంతి ఫౌండేషన్, ప్లాట్ నంబరు 208, జె.డి. టవర్స్, నాగోల్ రోడ్, కొత్తపేట, హైదరాబాద్- 500035. ఫోన్ : 99599 11403. మంచిపుస్తకం 12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్ : 94907 46614. **-డా॥ నాగభైరవ ఆదినారాయణ,** 98497 99711




తెలుగులో వెలువడిన మొట్టమొదటి పాఠశాల స్మృతుల రచన **'మాబడి'.** రచయిత : తెన్నేటి కోదండరామయ్య, సంపాదకుడు : మోదుగుల రవికృష్ణ, **మాబడి** (పాఠశాల స్మృతుల రచన), పుటలు : 280, వెల : రు.220/-లు, ప్రతులకు : అన్ని ప్రసిద్ధ పుస్తక విక్రయకేంద్రాలు.




యాభై సంవత్సరాల స్నేహానికి గుర్తుగా సమర్పించిన కవితల సంకలనం **కాశంలో మట్టి**. రచయిత : డా॥ఎన్.గోపి, **ఆకాశంలో మట్టి** (60 కవితల సమాహారం) పుటలు : 118, వెల : రు.150/-లు. ప్రతులకు : ఎన్.అరుణ ఇంటి నెం.13-1/5బి, శ్రీనివాసపురం, రామాంతపూర్, హైదరాబాద్- 500 013, సెల్ : 093910 28496




చిత్రకారిణి కలం నుండి జాలువారిన మల్లెరేకుల వంటి 44 కవితల సమాహారం- **'ప్రియమైన..మీకు గుప్పెడు'**. రచయిత : గండికోట వారిజ, ప్రియమైన..మీకు గుప్పెడు...(కవితల సంపుటి) పుటలు : 72, వెల : రు.170/-లు, ప్రతులకు : పలమనేరు బాలాజీ, ఇంటి నెం.6-219, గుడియాత్తం రోడ్డు, పలమనేరు-517 408, చిత్తూరుజిల్లా.




వర్తమాన పరిస్థితులకు స్పందన 30 కవితల సంకలనం **'ప్రేమ తపన'**. రచన : వేముల తిరుపతిరెడ్డి, ప్రేమతపన (30 కవితల సంకలనం), పుటలు : 42, వెల : రు.50/-లు, ప్రతులకు : శ్రీమతి వేముల లక్ష్మి, ఇంటి నెం.11-83/బి, కాకతీయనగర్, హుస్నాబాద్-505 467, సెల్ : 90001 90800.




వివిధ వర్గాల ప్రజల బాధలు కష్టాలకు అక్షరరూపం **'అక్షర గమనం'**. రచయిత : తుంపాల శ్రీరామమూర్తి, **అక్షరగమనం**(53 కవితల సమాహారం), పుటలు : 69, వెల : రు.60/-లు. ప్రతులకు : తుంపాల శ్రీరామమూర్తి ఇంటి నెం.9-9-57/2, జోగవానిపాలెం, కొత్తగాజువాక, విశాఖపట్నం-530 206, సెల్ : 94402 60280.




సామాన్య ప్రజల జీవన సమరానికి ప్రతీక **'వనఝరి'.** రచయిత : కరిపె రాజకుమార్, **వనఝరి** (30 కవితల సంపుటి), పుటలు : 72, వెల : రు.100/-లు. ప్రతులకు : కరిపె రాజకుమార్, ఇంటి నెం.13-105, ఎన్.టి.ఆర్.చౌక్, విద్యానగర్, కాన్పూర్ మండలం, ఆదిలాబాద్ జిల్లా-504 203.




సాహిత్య జీవితంలో విరబూసిన నానీలు **'దంపతి నానీలు'.** రచయితలు : సబ్బని శారద, సబ్బని లక్ష్మీనారాయణ. **దంపతి నానీలు** (జంట వ్రాసిన నానీలు), పుటలు : 52, వెల : రు.50/-లు. ప్రతులకు : సబ్బని లక్ష్మీనారాయణ, ఇంటి నెం.6-6-302, సాయినగర్, కరీంనగర్-505 001, సెల్ : 89852 51271.




ప్రేమైక జీవులు, అభాగ్యజీవులకు ప్రేమతో అందించిన స్వీట్ రొమాంటిక్ కవితలు **'ప్రేమంటే'**. రచయిత : సబ్బని లక్ష్మీనారాయణ, **ప్రేమంటే** (55 స్వీట్ రొమాంటిక్ కవితలు), పుటలు : 56, వెల : రు.27/-లు. ప్రతులకు : రచయిత, ఇంటి నెం.6-6-302, సాయినగర్, కరీంనగర్-505 001, సెల్ : 89852 51271.




ఇప్పుడు కావాల్సిన కవిత్వం-**ఈ మట్టి ఆక్రోశం**. రచయిత బండి చంద్రశేఖర్, **ఈ మట్టి ఆక్రోశం** (59 కవితల సమాహారం) పుటలు : 116, వెల : రు. 80/-లు. ప్రతులకు : బండి చంద్రశేఖర్, ఇంటి నెం.7-2-904, మంకమ్మతోట, కరీంనగర్-505 001, సెల్ : 94400 87930.




సాక్షి వ్యాసాలలో కలగాపులగంగా వున్న వైష్ణవ సంబంధ ఆరు వ్యాసాల సంపుటి- **'వైష్ణవసాక్షి'**. సంపాదకుడు : మోదుగుల రవికృష్ణ, ప్రచురణ : సర్రాజు బాలచందర్, **వైష్ణవసాక్షి** (వ్యాసాల సంపుటి) పుటలు : 104, వెల : రు.70/-లు. ప్రతులకు : నవోదయ, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362











## 'సమైక్యభారతి' నిర్వహణలో తాపీ ధర్మారావు, గురజాడ జయంతులు

సాంస్కృతిక స్పృహతో, సామాజిక సమైక్యతకోసం కృషి చేస్తున్న శ్రీ పి.కన్నయ్య సంకల్పంతో మొదలైన సమైక్యభారతి సంస్థ సెప్టెంబరు 19న విశాఖపట్నంలోని సిటీ లైబ్రరీ హాలులో తాపీ ధర్మారావు జయంతిని, 21న విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయ సభామందిరంలో గురజాడ జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించింది. ప్రొ॥చాగలమర్రి గోపాలస్వామి అధ్యక్షతన జరిగిన విశాఖ సభలో డా॥సామల రమేష్‌బాబు, డా॥చందు సుబ్బారావు, శ్రీ రాజా చిన్నబాబు, శ్రీ రామతీర్థ, వాణిజ్య పన్నుల డిప్యూటీ కమీషనర్ శ్రీ టి.శివశంకర్ విశ్రాంత ఐ.ఇ.ఎస్. శ్రీసి.యస్.రావు ప్రసంగించారు. గురజాడ మునిమనుమడు డా॥మోపిదేవి విజయగోపాల్‌ను, కవి కీ.శే.జాలాది కుమార్తె డా॥విజయను ఘనంగా సన్మానించారు. డా॥సామల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన విజయవాడలో జరిగిన సభలో పద్మశ్రీ డా॥తుర్లపాటి కుటుంబరావు సి.అనంతహృదయరాజు, శ్రీ మాసాబత్తుల శ్రీనివాస్ శ్రీ వి.సర్వేశ్వరరావు, డా॥గుమ్మా సాంబశివరావు, శ్రీ గోళ్ళ నారాయణరావు ప్రసంగించారు. డా॥విజయగోపాల్‌కు విజయవాడలో కూడా సన్మానం చేశారు. రెండు సభలలోను అనేకమంది ప్రముఖులతోపాటు తాపీ, గురజాడ అభిమానులు నిండుగా పాల్గొనడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఒక నిరంతర సాంస్కృతిక కార్యక్రమంగా సంస్కర్తల, కవుల రచయితల జయంతులను జరపాలని నిర్ణయించినట్లు సమైక్య భారతి కన్వీనర్ శ్రీ పి.కన్నయ్య తెలియజేశారు.

## కోయంబత్తూరు (తమిళనాడు)లో తెలుగువారి మహాసభ

కోయంబత్తూరులోని కమ్మ మహాసంఘం వారు తెలుగువాణి (ట్రస్టు) ప్రోత్సాహంతో తానా (అమెరికా) సాకారంతో తమిళనాడులోని తెలుగువారికి తెలుగు నేర్పే కార్యక్రమాలు చేస్తున్న సంగతి 'అమ్మనుడి' చదువరులకు తెలిసిందే. సెప్టెంబరు 18వ తేదీన 9 వేలమంది కలిసి సభను నిర్వహించుకొని అందరం సమైక్యంగాతెలుగును కాపాడుకోవాలని, తెలుగు రాయడం, చదవడం నేర్చుకోవాలని నిర్ణయించారు. ఆం.ప్ర. తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుండి, అమెరికా నుండి తెలుగు పెద్దలు పాల్గొన్నారు. సినీ నటుడు పార్లమెంటు సభ్యుడు మాగంటి మురళీమోహన్, తాతా మధుసూదన్(తానా)లతోపాటు ప్రముఖ పారిశ్రామికవేత్తలు వనితామోహన్, లక్ష్మీనారాయణస్వామి, పి.రామకృష్ణశ్యామలా వరదరాజన్, పి.వెంకటేష్‌నాయుడు, తెలుగు ఆచార్యులు కస్తూరి విశ్వనాథం, తెలుగువాణి ట్రస్టీలు స.వెం.రమేశ్, వసంత్‌నాయుడు, దామోదర్, తెలుగుజాతి ట్రస్టీ పి.కోదండరామయ్య మున్నగువారు పాల్గొన్నారు. తిరుపతి నుంచి వచ్చిన శ్రీమతి కోడూరు సుమన తన బృందంతోపాటు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు.





AMMANUDI (Telugu Monthly)
October 2016, Vol.2, Issue 8

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

